అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 30-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సీపీఐ(ఎం) సమన్వయకర్తగా
ప్రకాశ్ కరత్
పార్టీ 24వ మహాసభ వరకు బాధ్యతలు

కేంద్ర కమిటీ ప్రకటన

సీతారాం ఏచూరి, బుద్ధదేవ్, ఆర్ఎస్‌తో సహా అమరవీరులకు సంతాపం 13లో

సంపుటి : 10 సంచిక : 272 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

మహిళల ఆరోగ్యమే సమాజ శ్రేయస్సుకు పునాది

పింక్ పవర్ రన్‌లో సీఎం రేవంత్ రెడ్డి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల ఆరోగ్యమే కుటుంబ, సమాజ శ్రేయస్సుకు పునాది అని తమ ప్రభుత్వం బలంగా నమ్ముతోందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంఈఐఎల్, సుధారెడ్డి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో బ్రెస్ట్ (రొమ్ము) క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు పింక్ పవర్ రన్ ఏర్పాటు చేశారు. 10, 5, 3 కిలోమీటర్ల కేటగిరిలో మారథాన్లను నిర్వహించారు. వీటిలో పాల్గొని విజేతలైన వారికి బహుమతి ప్రధానం చేయటంతో పాటు, వారిని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా మారథాన్లకు హాజరైన వారు పక్షి ఆకారంలో నిలబడి గిన్నీస్ బుక్‌లో చోటుకు ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీక్షించటంతో పాటు భాగస్వాములైన వారిని ఉత్తేజ పరిచారు. అభినందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మనమంతా కలిసి తెలంగాణ మహిళలకు ఆరోగ్యకరమైన, మరింత సాధికారత గల భవిష్యత్తును నిర్మిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ పరుగులో పాల్గొన్న వారు వేసే ప్రతీ అడుగు భవిష్యత్‌లో మహిళలు ఒంటరిగా సవాళ్లను అధిగమించేలా చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీన్ని ఇలాగే ముందుకు తీసుకెళ్దామని సూచించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం కోసం మరిన్ని హాస్పిటల్స్ నిర్మించడంతో పాటు వ్యవస్థలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పింక్ పవర్ రన్ కార్యక్రమం భవిష్యత్‌లో మహిళలు ఎలాంటి ఆరోగ్య సమస్యలనైనా అధిగమించేందుకు నాంది కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన మేఘా కృష్ణారెడ్డి, సుధారెడ్డిలతో పాటు పాల్గొన్న ఔత్సాహికులందరికి ...6లో

తెలంగాణ దర్శినిలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత టూర్

మార్గదర్శకాల విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం 5లో..



నిఘా



పెస్టిసైడ్స్ వ్యతిరేక గళాలే టార్గెట్

- అమెరికా కేంద్రంగా వి-ఫ్లూయెన్స్ సంస్థ నిర్వాకం
- అక్కడి ప్రభుత్వం నుంచి నిధులు
- భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా సమాచార సేకరణ
- ఆ జాబితాలో సామాజిక, శాస్త్ర, పర్యావరణ, విద్యావేత్తలు
- 'లైట్‌హౌజ్ రిపోర్ట్స్' సమాచారం
- అదేం లేదన్న వి-ఫ్లూయెన్స్
- వెల్లువెత్తుతున్న ఆందోళనలు

న్యూఢిల్లీ : పెస్టిసైడ్స్ (పురుగుమందులు)కు వ్యతిరేకంగా గళమెత్తారో...మీ ఫోటో, పేరు, చిరునామా సహా సమస్త సమాచారం అమెరికాకు చేరిపోతుంది. అక్కడి నుంచే మిమ్మల్ని ఎలా నిలువరించాలి...ఎలా నిర్బంధించాలనే వ్యూహరచన కూడా సాగిపోతుంది. ప్రపంచవ్యాప్తంగా పెస్టిసైడ్స్, జన్యుమార్పిడి పంటలకు వ్యతిరేకంగా గళమెత్తేవారందరి సమస్త సమాచారాన్ని రాబట్టేందుకు యూఎస్ కేంద్రంగా పనిచేస్తున్న పీఆర్ సంస్థ వి-ఫ్లూయెన్స్ ఈ నిఘా సమాచారాన్ని చేరవేస్తుంది. ఈ విషయాన్ని లైట్‌హౌజ్ రిపోర్ట్స్ బట్టబయలు చేసింది. ముఖ్యంగా వ్యవసాయం మీద ఆధారపడిన భారత్ వంటి దేశాల్లో ఇది మరింత తీవ్రంగా ఉంది. ప్రజలు ఆరోగ్యాలను ప్రభావితం చేసే పెస్టిసైడ్స్, జన్యుమార్పిడి పంటలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించటం ఈ కంపెనీలకు వరంగా మారింది. అలాంటి కంపెనీలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అనేక మంది శాస్త్రవేత్తలు, సామాజిక కార్యకర్తలు, పర్యావరణవేత్తలు పోరాడుతున్నారు. రైతులు, ప్రజల తరపున తమ గళాన్ని వినిపిస్తున్నారు. అయితే వారిని అణచివేసే చర్యలు అనేక రూపాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పుడు యూఎస్ కేంద్రంగా మిస్సోరీకి చెందిన వి-ఫ్లూయెన్స్ ఇంటరాక్టివ్ సంస్థ ఈ అణచివేత చర్యల్లో పరోక్ష భాగస్వామిగా ఉందని లైట్‌హౌజ్ రిపోర్ట్స్ తెలిపింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయి. 'లైట్‌హౌజ్ రిపోర్ట్స్' వార్త సంస్థ కథనం ప్రకారం వి-ఫ్లూయెన్స్‌కు గతంలో యూఎస్ ప్రభుత్వం నుంచి నిధులు అందాయి. యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్‌ఏఐడీ)లో గతంలో కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేసిన జే బైర్నె వి-ఫ్యూయెన్స్‌ను 2001లో స్థాపించి నడుపుతున్నారు. ఈ సంస్థ ప్రపంచ ఆగ్రోకెమికల్, బయోటెక్నాలజీ ఇండస్ట్రీకి సమాచార సేకరణ, నిఘా పెట్టటం, ప్రొప్రైటరీ డేటా మైనింగ్, సమాచార విశ్లేషణలు చేయటం వంటి సేవలను అందిస్తుంది. భారత్‌లోని ప్రముఖ పర్యావరణవేత్త వందన శివ, జీవావరణ శాస్త్రవేత్త దేబాల్ దేబ్, ఇతర కీలక సైంటిస్ట్‌లు, విద్యావేత్తలతో పాటు ప్రపంచవ్యాప్తంగా 500 మందికి పైగా సమాచారాన్ని వి-ఫ్యూయెన్స్ రూపొందించిన ఒక ప్రయివేటు సోషల్ నెట్‌వర్క్ కలిగి ఉన్నది. ఇందులో ఆగ్రోకెమికల్, బయోటెక్నాలజీ ఇండస్ట్రీకి చెందిన ఉద్యోగులు, భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా దాని అనుబంధ రంగాలు భాగమై ఉంటాయి.

అయితే, వి-ఫ్లూయెన్స్ చర్యలపై ప్రపంచవ్యాప్తంగా పెస్టిసైడ్‌లకు వ్యతిరేకంగా గళం వినిపించే ప్రముఖ వ్యక్తులలో ఆందోళన కలుగుతున్నది. భారత్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. ఆ సంస్థ సేకరించిన సమాచారం ఎలా వాడుకుంటుంది? ఎవరికిస్తుంది? గోప్యతను ప్రమాదంలో పడేస్తుందా? అన్న అనుమానాలు, భయాలు పలువురిలో కలుగుతున్నాయి. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థకు దిగ్గజ పెస్టిసైడ్ కంపెనీలతో సంబంధాలున్నాయి. ఇందులో కోర్టులో కేసును ఎదుర్కొంటున్న సింగెంట వంటి పేరుమోసిన కంపెనీ కూడా ఉన్నది.

ఇక వి-ఫ్యూయెన్స్‌కు భారత్‌లో ఉన్న సంబంధాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సంస్థ ప్రయివేటు సోషల్ నెటవర్క్ బోనస్ ఈవెంటస్ వెయ్యికి మందికి పైగా యాక్సెస్‌ను కలిగి ఉన్నారు. ఇందులో ప్రపంచ ఆగ్రోకెమికల్ కంపెనీలు, లాబీయిస్టులు, ప్రభుత్వ సభ్యులు కూడా ఉన్నారు. బోనస్ ఈవెంటస్ కోసం ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా యూఎస్‌ఏఐడీ నుంచి ఫండింగ్ అందింది. ఆసియా, ఆఫ్రికాలలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వచ్చే విమర్శలను ...6లో



తమిళనాడు డిప్యూటీ సీఎంగా
ఉదయనిధి స్టాలిన్
మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో నలుగురికి చోటు

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో ...13లో

లీగల్ నోటీసులకు
భయపడేది లేదు
చిన్న కంపెనీకి రూ. వెయ్యి కోట్ల టెండర్లా? : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన ఆరోపణలకు గాను సృజన్‌రెడ్డి పంపిన లీగల్ నోటీసులపై బీఆర్ఎస్ వర్కింగ్ ...13లో

ఫ్యూచర్ సిటీ వరకు
మెట్రో విస్తరణ
రూ. 32,237 కోట్లతో రెండో దశ పనులు

- ఎయిర్‌పోర్టు అలైన్‌మెంట్‌లో పలు మార్పులు
- మొత్తం 6 కారిడార్లలో 116 కి.మీ వరకు సేవలు
- ఒకటిన్నర కిలో మీటర్ల భూగర్భ మార్గం
- డీపీఆర్‌లకు తుదిమెరుగులు దిద్దుతున్న హెచ్ఎంఆర్
- ఫోర్త్ సిటీ మినహా మిగిలిన డీపీఆర్‌లను త్వరలో ప్రభుత్వ అనుమతితో కేంద్రానికి..



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణ పనులకు వేగంగా అడుగులు పడుతున్నాయి. రెండవ దశలో మెట్రో సేవలు ఫ్యూచర్ సిటీ వరకు విస్తరించనున్నారు. 6 కారిడార్లలో మొత్తం 116.2 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణాన్ని రూ. 32,237 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. ఇందులో కొత్తగా ఎయిర్‌పోర్టు నుంచి స్కిల్ వర్సిటీ వరకు రూ.8వేల కోట్లతో 40 కి.మీ. మేర నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్ (డీపీఆర్)కు హైదరాబాద్ మెట్రో తుది మెరుగులు దిద్దుతోంది. ఇటీవలే మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మెట్రో రెండవ దశ కారిడార్‌ల అలైన్‌మెంట్, ముఖ్యమైన ఫీచర్లు, స్టేషన్లు మొదలైన వాటిపై సవివరమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు. అన్ని కారిడార్‌లకు సంబంధించిన డీపీఆర్‌లకు తుది మెరుగులు దిద్దుతున్నామని, ట్రాఫిక్ అంచనాల విషయంలో హెచ్ఎండీఏ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సిద్ధం చేస్తున్న కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ) కోసం హెచ్ఏఎంఎల్ ఎదురుచూస్తోందని ఎండీ ముఖ్యమంత్రికి తెలిపారు. మెట్రో మార్గాల్లో ట్రాఫిక్ అంచనాలను సీఎంపీతో క్రాస్-చెక్ చేయాల్సి ఉంటుంది. రెండవ దశ మెట్రో కారిడార్‌ల కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం డీపీఆర్‌లను సమర్పించడానికి ఇది తప్పనిసరి. గతంలో సీఎం నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్ణయించిన ప్రకారం, ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ ఇప్పుడు ఆరాంఘర్, 44వ నెంబర్ జాతీయ రహదారి (బెంగళూరు హైవే)లోని కొత్త హైకోర్టు ...13లో



హైదర్‌షాకోట్‌లో మూసీ బాధితులతో బీఆర్ఎస్ బృందం సమావేశం

పెద్దలకో న్యాయం.. పేదలకో న్యాయమా?

ముఖ్యమంత్రి మౌనం వీడాలి

- మూసీ సుందరీకరణ ప్రతిపాదన విరమించుకోవాలి
- బాధితులు ఐక్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండాలి
- దేశాన్ని కాపాడే సైనికులకే ఇండ్లు కాపాడుకోలేని దుస్థితి : మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- గోడు వెల్లబోసుకున్న బాధితులు..
- అండగా ఉంటామని బీఆర్ఎస్ నేతల హామీ
- భారీ ర్యాలీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

నవతెలంగాణ-గండిపేట్

మూసీ సుందరీకరణపై ప్రభుత్వం తన ప్రాతిపాదనలు విరమించుకోవాలని, మూసీ బాధితుల సమస్యలపై అధికారులతో ప్రెస్‌మీట్లు పెట్టించడం కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి మౌనం వీడి, స్పష్టమైన ప్రకటన చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బాధితులు ఐక్యంగా ఉండాలని, ఆత్మ ...13లో

బీఆర్ఎస్‌ది మొసలి కన్నీరు

మూసీ పరివాహక ప్రజలను రెచ్చగొడుతోంది



- నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తాం
- గోదావరి నీటిని మూసీనదిలో పారిస్తాం
- ఈస్ట్, వెస్ట్ రోడ్లు నిర్మిస్తాం
- అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు : మూసీ సుందరీకరణపై మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టును బీఆర్ఎస్ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నదని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా హాల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మూసీ ప్రాంతంలో అవకాశవాద శక్తులు ప్రజలను రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో మూసీ సుందరీకరణ అన్నారనీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన అనగానే ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. మూసీ నిర్వాసితుల విషయంలో బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వారికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వడంతో పాటు, పునరావాసానికి పూర్తి భరోసానిస్తోందని తెలిపారు. అందుకోసం హైలెవల్ కమిటీ పని చేస్తున్నదని చెప్పారు. మూసీ ప్రక్షాళన కోసం మూసీ రివర్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసుకుని ముందుకు పోతున్నామని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే చెరువులు, మూసీ ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. తెలిసో, తెలియకో కొందరు మూసీలో ఇండ్లు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని, పేదలను నిలబెట్టాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందే తప్ప, పడగొట్టాలని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు గోదావరి జలాలను తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఇప్పుడు ఆ నీటిని మూసీ నదిలో ప్రవహింపజేస్తామన్నారు. ఈస్ట్, వెస్ట్ వైపుల రోడ్లు, మూసీపై పై ఓవర్లు నిర్మిస్తామని, పీపీపీ మోడల్‌లో నిర్మాణాలుంటాయని తెలిపారు. ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని వెల్లడించారు. 35 బృందాలతో సోషియో ఎకనమిక్ సర్వే చేస్తున్నామని తెలిపారు. వాక్ టు వర్క్ పద్ధతిలో ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పేద, మధ్యతరగతి ...13లో

ఇజ్రాయిల్ దాష్టీకంపై
ఆగ్రహం



దురాక్రమణ పూరిత దాడులు ఆపాలి : అంతర్జాతీయ సమాజం డిమాండ్

దాడులు కొనసాగుతాయి : నెతన్యాహు

బీరుట్: లెబనాన్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణపూరిత దాడులు, హిజ్బుల్లా నేతల హత్యలను అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల తదనంతర పర్యవసానాలకు ఇజ్రాయిల్, దానికి అండదండలిస్తున్న అమెరికా కాపూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించాయి. పశ్చిమాసియాను అస్థిరపరిచే యూదు దురహంకార ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలని అవి డిమాండ్ చేశాయి. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హత్య జరిగి 24 గంటలు కూడా తిరక్క ముందే మరో హిజ్బుల్లా నేత నబిల్ కౌక్‌ను ఇజ్రాయిల్ సైన్యం దుర్మార్గంగా హత్య చేసింది. హిజ్బుల్లా నాయకత్వాన్ని తుడిచిపెట్టడంలోతాము విజయం సాధించామని, అయినా దాడులు కొనసాగుతాయని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వేదికగా యుద్ధోన్మాది ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు హూంకరించాడు. తాజాగా ...5లో

ముకేశ్‌కు కలిసొచ్చిన మోడీ పాలన


దిగ్గజ సంస్థ రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీకి మోడీ పాలన బాగానే కలిసొచ్చింది. గత పదేండ్లలో ఆయన లక్షల కోట్ల సంపదను వెనకేసుకున్నారు. 2015లో రూ.1.75 లక్షల కోట్లుగా ఉన్న ఆయన నికర విలువ.. నేడు దాదాపు రూ.9.7 లక్షల కోట్లకు చేరుకున్నది. బడా పారిశ్రామికవేత్తలైన అంబానీ, అదానీలు మోడీకి మిత్రులని కాంగ్రెస్ వంటి ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తుంటాయి. ఈ కారణంగానే వారు భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సంపన్నులుగా ఎదుగుతున్నారని చెప్తుంటాయి. అయితే, ప్రభుత్వ సహకారం లేనిదే ఇదంతా సాధ్యం కాదనీ, అంబానీకి బీజేపీ పాలనలో చక్కటి మద్దతు, సహకారం లభించిందని కొందరు మార్కెట్ నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు.

'రిలయన్స్'కు స్వర్ణయుగం | గడచిన పదేండ్లలో భారీగా పెరిగిన సంపాదన

- ఏటా ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన సంపన్నుడు
- 2015లో నికర విలువ రూ.1.75 లక్షల కోట్లు
- నేడు దాదాపు రూ.9.7 లక్షల కోట్లకు చేరిన వైనం
- ప్రపంచ సంపన్నుల జాబితాలో చోటు

న్యూఢిల్లీ : ముకేశ్ అంబానీ రిలయన్స్‌కు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాలున్నాయి. పెట్రోకెమికల్స్ నుంచి రిటైల్ దుకాణాల వరకు దాదాపు ప్రతి రంగంలోనూ రిలయన్స్ బ్రాండ్ వ్యాప్తి చెందింది. ధీరూభాయ్ అంబానీ స్థాపించిన రిలయన్స్ సామ్రాజ్యాన్ని ఆయన పెద్ద కుమారుడైన ముకేశ్.. మరింతగా విస్తరించాడు. ప్రపంచ వ్యాపార రంగంలో ఒక కీలక వ్యక్తిగా ముకేశ్ తయారయ్యాడు. భారత్, ఆసియాలోనే కాకుండా ప్రపంచంలోని అత్యంత సంపన్నుల జాబితాలో నిలిచాడు. గత పదేండ్లలో ముకేశ్ అంబానీ రిలయన్స్ ప్రదర్శన ఈ కింద విధంగా ఉన్నది.

2014 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో తొలిసారి విస్పష్ట మెజారిటీని సాధించి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ-1 ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. భారీ విజయంతో మోడీ ప్రధాని అయ్యారు. అప్పటికే ప్రపంచ సంపన్నుల జాబితాలో పేరు దక్కించుకోవటానికి ముకేశ్ ముందుకు సాగుతున్నారు. 2015లో ఆయన నికర విలువ 21 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ప్రస్తుత భారత కరెన్సీలో చూస్తే, దాని విలువ రూ.1.75 లక్షల కోట్లతో సమానం.



2016లో ముకేశ్ సంపద పడిపోయింది. 19.3 బిలియన్ డాలర్లు, అంటే రూ.161 లక్షల కోట్లకు పడిపోయింది. ఆ ఏడాదిలోనే ఆయన జియో నెట్‌వర్క్‌ను భారత్‌లో ప్రారంభించి సంచలనం సృష్టించిన విషయం విదితమే.ఆ తర్వాత ఏడాది 2017లో ఆయన సంపద పెరుగుదలను చూసింది. 23.2 బిలిలియన్ డాలర్లకు (రూ.1.94 లక్షల కోట్లకు) చేరుకున్నది. 2018లో ఆయన సంపద భారీగా ఎగబాకింది. 40.1 బిలియన్ డాలర్ల(రూ.3.35 లక్షల కోట్లు)కు చేరుకొని ఆయన ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది. అయితే, 2020లో కోవిడ్-19 మహమ్మారి ప్రభావం కారణంగా ముకేశ్ నికర విలువ భారీగా పడిపోయింది. 50 బిలియన్ డాలర్ల నుంచి 36.8 బిలియన్ డాలర్లకు పతనమైంది.



2021లో ఆయన సంపద ఆకాశమే హద్దుగా రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. 84.5 బిలియన్ డాలర్లకు, అంటే రూ.7.6 లక్షల కోట్లకు ఎగబాకింది. 2021 నుంచి 2024 వరకు, ముకేశ్ సంపద ...5లో

టీఎస్ఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ నూతన అధ్యక్షునిగా

- తిరందాస్ సంతోష్ కుమార్





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ నూతన అధ్యక్షునిగా తిరందాస్ సంతోష్ కుమార్(సీఆర్పీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులుగా.. గౌరవ అధ్యక్షులుగా గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీలత రెడ్డి (కేజీబీవీ), రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులుగా చంద్రశేఖర్ గౌడ్ (డాటా ఎంట్రీ ఆపరేటర్), రాష్ట్ర కోశాధికారిగా యాదగిరి (మెసెంజర్), రాష్ట్ర ముఖ్య సలహాదారులుగా గంగుల కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అశోక్ రెడ్డి (ఐఆర్పీ), రాఘవేంద్ర నాయుడు (డేటా ఎంట్రీ ఆపరేటర్), స్వప్న(కేజీబీవీ), సంయుక్త కార్యదర్శిగా స్వరూప(కేజీబీవీ), గంగమ్మ(మెసెంజర్), ఖాజా మైనుద్దీన్ (పీటీఐ), రాంగోపాల్ (ఎంఐఎస్-కోఆర్డినేటర్) సభ్యులుగా వసంత (కేజీబీవీ), లక్ష్మణ్ (సీఆర్పీ), ఉపేందర్ (మెసెంజర్), పద్మ(కేజీబీవీ) ఏకగ్రీవంగా అన్ని విభాగాల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఓబీ ఉద్యోగుల స్వచ్ఛత క్యాంపెయిన్



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ఉద్యోగులు శనివారం నగరంలో శుభ్రతపై అవగాహన కల్పించారు. దేశ వ్యాప్తంగా స్వచ్ఛత హై సే 2024 ప్రోగ్రాంను చేపట్టాలని కేంద్ర ఫైనాన్సియల్ సర్వీసెస్ శాఖ సూచనతో హైదరాబాద్ మెట్రో రీజియన్‌లోనూ దీన్ని నిర్వహించారు. పద్మారావునగర్ పార్కు, చిల్కల్‌గూడ పార్కుల్లో సంపూర్ణ స్వచ్ఛత శ్రమదాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఆదిత్య కుమార్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రవకర్ ఝపత్ సింగ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కాంగ్రెస్ సర్కార్ మోసం

- నేడు ఇందిరాపార్కు వద్ద 24 గంటల దీక్ష : బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఉదయం 11 గంటల నుంచి 24 గంటల పాటు రైతు దీక్షను నిర్వహించనున్నట్టు బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి మీడియాతో మాట్లాడారు. రైతు హామీల సాధన దీక్షను విజయవంతం చేయడానికి రైతులందరూ కలిసి రావాలని కోరారు. ఈటల మాట్లాడుతూ.. దీక్షలో రైతులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులందరూ పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి రైతులకు మేలు చేయడమే తమ దీక్ష లక్ష్యమన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పి రేవంత్ సర్కారు మాట తప్పిందన్నారు. ఇప్పటివరకు ఎంత రుణమాఫీ అయిందనేది అధికారుల దగ్గర కూడా లెక్కలేదని విమర్శించారు. రుణమాఫీ చేయలేదని మేడ్చల్ ఎంపీడీఓ ఆఫీసులో ఉరేసుకుని రైతు చనిపోయాడన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రేవంత్ రెడ్డి మాటలు చూస్తే ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా కనిపించడం లేదని స్పష్టం చేశారు.

పేదల ఇండ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?

- ప్రజల ఆస్తులకు రక్షణగా ఉంటాం : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేదల ఇండ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారు పెద్దలు ఆక్రమించిన, కట్టిన భవనాలను కూల్చేస్తుందని తాము భావించామనీ, ఇప్పుడు మాత్రం పేదల ఇండ్లమీద పడిందని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో బీజేపీ సిటీ కార్యాలయంలో సేవా పక్వాడ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎంపీ లక్ష్మణ్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టరేట్లు, ఫైర్ స్టేషన్ల నిర్మాణం పేరుతో పేదల స్థలాలను బీఆర్ఎస్ సర్కార్ గుంజుకుందనీ, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లపై హైడ్రాతో కాంగ్రెస్ సర్కారు దాడులు చేయిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ తీరుతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతిన్నదన్నారు. ఆర్థిక పరిస్థితి గాడితప్పిందని చెప్పారు. మాజీ సర్పంచుల బిల్లులను చెల్లించడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. హైడ్రా దాడులపై ప్రభుత్వం పునఃసమీక్షించకుంటే బీజేపీ కొట్లాడేందుకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ప్రజల ఆస్తులను రక్షించే బాధ్యత తీసుకుంటామనీ, బుల్డోజర్లకు అడ్డుపడతామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహం చేసుకున్నందుకు కుటుంబంపై అగ్రకుల పెత్తందారుల దాడి

- దాడి చేసిన వాళ్లందరిని అరెస్టు చేయాలి : తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కులాంతర వివాహం చేసుకున్నందుకు కుంటుంబంపై అగ్రకుల పెత్తందార్ల దాడి అమానుషమని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడిరాజు నరేష్, పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం కోతుల బాధ గ్రామంలో. చిట్యాల నరసమ్మ, మల్లయ్య కుమారుడు చిట్యాల సతీష్ అదే గ్రామానికి చెందిన ఏనుగు వెంకట్ రెడ్డి విజయరెడ్డి కూతురు రేవతి గత రెండేండ్ల నుంచి ప్రేమించుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే గత నెలలో హనుమకొండలోని చింతగట్టులో వివాహం చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వారు అందుబాటులో లేకపోవటంతో సతీష్ తల్లి నరసమ్మను తక్కువ కులం దానివంటూ, అడక్కతినే దానవంటూ కులం పేరుతో తిడుతూ ఆమెపై దాడి చేశారని తెలిపారు. తండ్రి ఏనుగు వెంకట్ రెడ్డి, విజయ ఏనుగు రవి, ఏనుగు ఎల్లారెడ్డి, భాగ్యమ్మయాదమ్మ ఆ దాడిలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ విషయమై కేసు పెట్టినా పోలీసులు స్పందించలేదని తెలిపారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పెరిఫెరల్ మెడికల్ కాలేజీ అలవెన్స్ అమలు చేయాలి

- తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెరిఫెరల్ మెడికల్ కాలేజీ అలవెన్స్ అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో అన్ని జిల్లాల నాయకుల నుంచి సూచనలు స్వీకరించారు. అనంతరం ఆ సంఘం సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘం గుర్తింపునకు త్వరగా ప్రయత్నం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

రెవెన్యూశాఖ ప్రత్యేకం

ఈ శాఖలో నిందలు తప్పవు

- తహసీల్దార్లు బాధ్యతగా పని చేయాలి
- మీ సూచనలు, సలహాలతో రెవెన్యూ చట్టాల సవరణ
- ధరణితో ప్రజలకు ఇబ్బందులు
- అందుకే ఆర్ఓఆర్ చట్టాల రూపకల్పన : రెవెన్యూ, గృహ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- 33 జిల్లాల్లోని తహసీల్దార్లతో ముఖాముఖి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ శాఖల్లో అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ ప్రత్యేకమైనదనీ, అన్ని సందర్భాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక పాత్ర పోషిస్తారని రెవెన్యూ, గృహ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీలో ఆదివారం రాష్ట్ర స్థాయిలో 33 జిల్లాల తహసీల్దార్లతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 972 మంది తహసీల్దార్లు ఉన్నారనీ, గ్రామీణ, మండల స్థాయిలో ఉండే సమస్యలను, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎదుర్కొంటున్న సమస్యలను తమ ద్వారా తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెవెన్యూ చట్టాల సవరణలో క్షేత్ర స్థాయిలో ఉండే సమస్యలకు తహసీల్దార్లు ఇచ్చే సలహాలు, సూచనలను కూడా అవసరమైన మేరకు పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. ఏ విధంగా, ఏం చేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందో, ఎలా చేస్తే పరిష్కారం దొరుకుతుందో అన్ని విధాలా ఆలోచించి రెవెన్యూ చట్టాలను సవరిస్తామని చెప్పారు. రెవెన్యూ శాఖలో ఎంత నిజాయితీగా పని చేసినా నిందలు తప్పవనీ, అంతరాత్మను సాక్షిగా పెట్టుకుని పని చేయాలని సూచించారు. కార్యాలయాల్లో సిబ్బంది కొరత, మౌలిక వసతులు, ఫర్నీచర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేకపోయినా అనేక సమస్యలను ఎదుర్కొంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల వరకు చేరవేయడంలో, ప్రభుత్వ భూములను రక్షించడంలో తహసీల్దార్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారని తెలిపారు. ఇందుకనుగుణంగా వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తహసీల్దార్లు తప్పు చేస్తే వారికి చెడ్డపేరు వస్తుందో.. లేదో గానీ.. ప్రభుత్వానికి మాత్రం చెడ్డపేరు వస్తుందన్నారు. ప్రభుత్వం పక్షాన అన్ని వేళల్లో ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు జోడెద్దుల్లా పని చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని తహశీల్దార్లకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి'లోని సమస్యలతో ప్రజలు, రైతులు ఎంతగానో ఇబ్బంది పడుతున్నారనీ, అందుకే ఆర్ఓఆర్ చట్టాల రూపకల్పన చేసినట్టు తెలిపారు. పేదలు, రైతుల కష్టాలు మనందరికీ తెలుసనీ, ఎవరైనా, ఏమైనా సమస్యలతో మీ దగ్గరికి వస్తే వారిని విసుక్కోకుండా, కనీస మర్యాదతో సౌమ్యంగా మాట్లాడాలని సూచించారు. అంతకుముందు రాష్ట్రస్థాయిలో తహసీల్దార్లు తెలిపిన వారి శాఖాపరమైన, వ్యక్తిగత సమస్యలను, సలహాలను మంత్రి సానుకూలంగా ఆలకించారు. వాటికి ప్రతిస్పందిస్తూ రెవెన్యూ శాఖకు పెద్దన్నలా తాను ఉంటూ న్యాయమైన అందరి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రెవెన్యూశాఖలోనే ఇది చారిత్రాత్మకం : నవీన్ మిట్టల్

రెవెన్యూ శాఖలోనే ఇది చారిత్రాత్మకమైన రోజనీ, తన 28 ఏండ్ల సర్వీసులోనే రెవెన్యూశాఖ మంత్రి తహసీల్దార్లతో ముఖాముఖి నిర్వహించడం ఇదే మొదటిసారి అని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏ శాఖలు చేయలేని పనులను సైతం రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్నదని చెప్పారు. తహసీల్దార్ల సమస్యలను వినడానికి, వాటికి తగు రీతిలో పరిష్కరించడానికే మంత్రి ఇక్కడికి వచ్చారని తెలిపారు. జిల్లాల వారీగా సమస్యలను మంత్రికి వివరించాలని తహసీల్దార్లను కోరారు. అనంతరం ఈ కార్యక్రమానికి సహకరించిన నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను శాలువా, మెమెంటోతో మంత్రి పొంగులేటి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, స్వేచ్ఛకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత

- ఆస్తులు కాపాడటం సర్కారు బాధ్యత : శాన్‌ఫ్రాన్సిస్కో 'మీట్ అండ్ గ్రీట్ ' లో డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అభివృద్ధి, స్వేచ్ఛ ప్రధాన అంశాలుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ఆదివారం ఆయన ప్రసంగించారు. గతంలో ఫ్యూడల్ లక్షణాలతో బందీ చేయబడిన రాష్ట్రాన్ని, పూర్తి స్వేచ్ఛాయుతంగా మార్చామనీ, భవిష్యత్‌లో ఈ విధానం కొనసాగుతుందని తెలిపారు. ఎవరు ఏ భావజాలాన్నైనా వ్యక్తపరిచే వాతావరణాన్ని రాష్ట్రంలో తీసుకొచ్చామని వివరించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు అంతా తెలంగాణ రాష్ట్రంతో పాటు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఏమాత్రం అవకాశం ఉన్నా ఉపయోగించాలని వారిని కోరారు. హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్... ఇండ్ల నిర్మాణం పేరిట అవన్నీ కనుమరుగైపోయాయన్నారు. చెరువులు కబ్జా చేసి ఇండ్లు కట్టుకున్నారని, పార్కులు లేకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులు లేకపోతే వరదలొచ్చినప్పుడు ఇటీవల విజయవాడ నగరంలో సంబవించిన పరిస్థితులు హైదరాబాదులోనూ ఏర్పడతాయని చెప్పారు. నదీ గర్భంలో ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నారన్నారు. వీటిని ఇప్పటికీ ఆపకపోతే భవిష్యత్ తరాలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పేదవాళ్లను అడ్డంపెట్టి బిల్డర్లు నిర్మాణాలు చేపట్టి వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. ధన, మానప్రాణాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అన్నారు. మూసీ నదిలో మంచినీరు పారించటం పార్కులను ఏర్పాటు చేయా లనేది ప్రభుత్వ ఆలోచన అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో నిర్వాసి తమవుతున్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పిల్లలు చదువుకు అవకాశం కల్పించటం, ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు చేపట్టటం.. వారంతా మంచి వాతావరణంలో బతికేలా చూడటమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. సమా వేశంలో సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జన్యు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించొద్దు

- విస్తృత చర్చలు జరపాలి : కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘం నేతల డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారత ప్రభుత్వం జన్యుమార్పిడి పంటలను ప్రోత్సహించడంపై విస్తృత చర్చలు జరపాలని దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రతిఘటన ఎదురవుతున్నదని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో నిరసనలు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయా సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఆదివారం హైదరాబాద్‌లోని హాకా భవన్‌లో దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన దాదాపు 40 రైతు సంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన ఈ సదస్సులో స్వావలంబన, ఆర్థిక నష్టాలు, రైతులపై భారం, పర్యావరణ విధ్వంసం కలిగించే జన్యుమార్పిడి పంటలను అనుమతించబోమంటూ ఏకగ్రీవంగా తీర్మానించారు. స్వయం శక్తి, రైతుల జ్ఞానం, ప్రకృతి పరిరక్షణతో కూడిన వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కూడా రైతు సంఘాలు తీర్మానించాయి. సదస్సులో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ వివిధ వర్గాల ప్రజలు, ప్రత్యేకంగా రైతులు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి జన్యుమార్పిడి పంటలపై జాతీయ విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. 'సంప్రదింపుల ప్రక్రియల తర్వాత జన్యుమార్పిడి విధానాన్ని రూపొందించాలని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొంది. గడిచిన పదేండ్లలో కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి సంప్రదింపులు లేకుండా చట్టాలు తెచ్చింది. భారత ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలతో కూడిన ప్రక్రియలు విధాన రూపకల్పనలో ఉండాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. మన ఆహారం, వ్యవసాయ వ్యవస్థల్లో జనటిక్ ఇంజనీరింగ్ సాంకేతికతలపై చర్చించకుండా ప్రవేశపెట్టటం ఆందోళన కలిగిస్తున్నది. ఇది మన పర్యావరణం, ఆరోగ్యం, జీవనోపాధి, సార్వభౌమాధికారానికి సంబంధించినది. ఉత్పత్తి దారులుగా, వినియోగదారులుగా, రైతులు జన్యుమార్పిడి పంటలను కోరుకోవడం లేదు. రైతులకు కావాల్సింది జన్యుమార్పిడి పంటల ప్రోత్సాహక విధానం కాదు. బయో సేఫ్టీ పాలసీ కావాలి' అని అన్నారు.

కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, కిసాన్ కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, కోదండ రెడ్డి, తమిళనాడు రైతు సంఘం ప్రతినిదులు పిఎన్ పాండ్యన్, సుందర విమల నందన్, కర్నాటక రైతు సంఘం ప్రతినిధి బాలకృష్ణన్, కేరళ రైతు సంఘం ప్రతినిదులు కెవి బిజు, ఉష, వ్యవసాయ విధాన విశ్లేషకులు దొంతి నర్సింహారెడ్డి, రైతు స్వరాజ వేదిక సంఘం ప్రతినిధులు కవిత, కె.రవి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, భారతీయ కిసాన్ సంఘం ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, తదితరులు మాట్లాడారు.

విజయభారతి పార్థీవదేహానికి మంత్రి సీతక్క నివాళి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ రచయిత, దివంగత పౌర హక్కుల నేత బొజ్జా తారకం సతీమణి బి. విజయభారతి పార్థీవ దేహానికి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) నివాళి అర్పించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బేగం పేటలోని వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్థీవదేహంపై పూల మాల వేసి నివాళులు అర్పించారు. తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా విజయభారతి సేవలు అందించడంతో పాటు ప్రాచీన సాహిత్య కోశం, ఆధునిక సాహిత్య కోశం వెలువరించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సాహితీ రంగానికి విజయభారతి సేవలు మరువలేనివన్నారు. అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్, జ్యోతిరావు పూలే జీవితాలను, పోరాటాలను తెలుగు ప్రజలకు తన రచనల ద్వారా అందించిన విజయభారతి మరణం తెలుగు ప్రజా సాహిత్యానికి, అభ్యుదయ వాదులకు తీరని లోటని తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

పటాన్‌చెరు నుంచి విజయవాడకు ఈ-గరుడ బస్సులు

- నేటి నుంచి షురూ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పటాన్‌చెరు బీహెచ్ఇఎల్ రామచంద్రాపురం నుంచి విజయవాడ వెళ్లేందుకు కొత్తగా ఈ-గరుడ బస్సుల్ని ప్రవేశపెడుతున్నట్టు టీజీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీమతి శ్రీలత తెలిపారు. తొలివిడతలో రెండు సర్వీసులు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆదివారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సులు రామచంద్రాపురం, బీరంగూడ, చందానగర్, మియాపూర్, నిజాంపేట్ క్రాస్ రోడ్స్, హౌసింగ్ బోర్డ్ మీదుగా జేఎన్టీయూ రైతు బజార్, మలేషియన్ టౌన్‌షిప్, శిల్పారామం, సైబర్ టవర్స్, మై హోమ్ భుజా, సైబరాబాద్ కమిషనరేట్, టెలికాంనగర్ మీదుగా ఓఆర్ఆర్ నుంచి విజయవాడకు వెళ్తాయని వివరించారు. దీనివల్ల విజయవాడ వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఈ సర్వీసులు రోజూ రాత్రి 09:30 మరియు 10:30 గంటలకు రామచంద్రాపురం నుంచి బయలుదేరతాయనీ, ప్రయాణీకులు ఈ సర్వీసుల్ని ఆదరించాలని కోరారు.



కేటాయింపుల పెరిగినా

కొరత మాత్రం అలాగే

రెండేండ్ల తర్వాత గోధుమ కేటాయింపులు పెంపు

- పీఎంజీకేఏవై కింద తొమ్మిది రాష్ట్రాలకు పెంచిన కేంద్రం
- అయినా.. ఆ రాష్ట్రాలకు మాత్రం కొరతే
- 2022తో పోలిస్తే ఇది 12-20 శాతం
- ఢిల్లీకి పెరగని వైనం

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) (లేదా జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ)) కింద 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతా(యూటీ)ల్లో తొమ్మిదింటికి రెండేండ్ల తర్వాత కేంద్రం గోధుమ కేటాయింపులు పెంచింది. ఢిల్లీ మాత్రం ప్రస్తుతం అందే కోటానే రాబోయే నెలలకు అందుకోనున్నది. అయినప్పటికీ ఈ పెరుగుదల ఆయా రాష్ట్రాలకు గోధుమల కొరతను తీర్చేలా కనిపించటం లేదు. రెండేండ్ల క్రితంతో పోల్చి చూస్తే 12 నుంచి 20 శాతం వరకు కొరతను రాష్ట్రాలు, యూటీలు ఎదుర్కోనుండటం గమనార్హం.

కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ ఈనెల 24న జారీ ఒక ఉత్తర్వును జారీ చేసింది. ఇది ఈ ఏడాది అక్టోబర్-నవంబర్ నుంచి అమలులోకి రానున్నది. పీఎంజీకేఏవై లబ్దిదారుల్లో 67 శాతం మందిని, అంటే 54.41 కోట్ల మందిని కలిగి ఉన్న ఈ తొమ్మిది రాష్ట్రాలు నెలకు 12.26 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమను అందుకోనున్నాయి. ప్రస్తుతం జరిపే 9.17 లక్షల మెట్రిక్ టన్నుల కంటే ఇది 3.09 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువ. 2022, జూన్‌కు ముందు ఈ కేటాయింపులు 15.07 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉండటం గమనార్హం.

2022, మే 13న కేంద్రం తొమ్మిది రాష్ట్రాలు, ఒక యూటీకి గోధుమ కేటాయింపులను తగ్గించింది. ఈ జాబితాలో బీహార్, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్‌తో పాటు ఢిల్లీ లు ఉన్నాయి. అయితే, ఇందుకు పరిహారంగా కేంద్రం అందుకు సమానంగా బియ్యం కేటాయింపులను పెంచింది. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ గోధుమల కేటాయింపు అంశం చర్చకు వచ్చింది. కాగా, ఈ సారి గోధుమల కేటాయింపు పెరుగుదల ఢిల్లీకి లేకపోవటం గమనార్హం. ప్రస్తుతం ఢిల్లీకి అందే 22,433.59 మెట్రిక్ టన్నుల గోధుమల మొత్తాన్నే రాబోయే నెలల్లో అందుకోనున్నది. రెండేండ్ల క్రితం ఢిల్లీకి అందే మొత్తం 29,705.43గా ఉండేది. పీఎంజీకేఏవై కింద 35 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలను పెంచటానికి మంత్రుల కమిటీ ఆమోదించిందని ఈనెల 18న యూనియన్ ఫుడ్ సెక్రెటరీ సంజీవ్ చోప్రా వెల్లడించిన విషయం విదితమే.

దేశం గర్వించదగిన నేత ఏచూరి

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



> ప్రజాస్వామిక హక్కుల కోసం పరితపించిన యోధుడు : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎస్.వీరయ్య
>
> ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట కామ్రేడ్ ఏచూరి సంసర్మణ సభ

దేశంలో ప్రజాతంత్ర హక్కులకోసం, ప్రజాస్వామ్య విలువల కోసం పరితపించిన యోధుడు ఇక లేడంటే బాధ కలుగుతోందని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వీరయ్య, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ సంస్మరణ సభలో మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో చేరి 'అధ్యయనం - పోరాటం' నినాదాన్ని ఆచరించి ఈ దేశమే గర్వించదగిన నేతగా ఎదిగిన మహెూన్నత మార్క్సిస్టు నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. విద్యార్థి నాయకునిగా ఉంటూ ఆనాటి దేశ ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ ముందు నిల్చొని జేఎన్‌యూ వైస్ ఛాన్సలర్‌గా రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం ఏచూరి ధైర్య సాహసాలకు సూచిక అని అన్నారు. విద్యార్థి నాయకునిగా ప్రస్థానాన్ని ప్రారంభించి భారత కమ్యునిస్టు పార్టీ(మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన మహా మేధావిని దేశం కోల్పోయిందన్నారు. తన కోసం, కుటుంబం కోసం కాకుండా నిరంతరం పేద, అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పరితపించిన విప్లవ పోరాట యోధుడు అని తెలిపారు. 'ఈ దేశ జాతి పతాకాన్ని గౌరవించే విధానం గురించి మీరు మాకు నేర్పుతారా.. పతాకం మా గుండెల్లో ఉంది' అంటూ పార్లమెంట్ సాక్షిగా మాట్లాడిన మాటలు మరువలేనివన్నారు. కులం, మతం ప్రాతిపాదికన దేశాన్ని పాలించే పాలకులు ప్రజలను చిల్చుతున్న తీరును ఎండగడుతూ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ లౌకిక, ప్రజాస్వామ్య విలువల కోసం పార్లమెంటును ఆయుధంగా మలుచుకున్న మార్క్సిస్టు మేధావి అని కొనియాడారు. అధ్యయనం చేసిన ప్రతి విషయాన్ని ప్రజా ఉద్యమాలకు పదును పెట్టి ప్రజా బాహుళ్యానికి వ్యక్తపరచడంలో మహా నేర్పరి అని అన్నారు. ఆయన ఆలోచనా విధానాన్ని ఆశయ సాధనను విద్యార్థులు, యువత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పోరాటతత్వాన్ని నేర్చుకొని చివరి శ్వాస వరకు అదే పోరాట పటిమను కలిగిన మార్క్సిస్టు పార్టీ నేత సీతారాం ఏచూరి అని అన్నారు. విద్యార్థులు ఆయన చూపించిన పోరాట మార్గంలో పయనించడమే ఘనమైన నివాళిలు అర్పించడం అని తెలిపారు.

ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ మాట్లాడుతూ.. ఇది సీతారాం ఏచూరి సంస్మరణ సభ కాదని, స్ఫూర్తి సభగా భావిస్తున్నానన్నారు. మార్క్సిజమే లేదంటున్న తరుణంలో తన శిష్యుడిని, ఎర్ర జెండాను శ్రీలంకలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు గెలిపించిన తీరు చూస్తున్నామని తెలిపారు. భారతదేశంలోనూ అటు వైపు అడుగులు పడుతాయని, ఎర్ర జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ మాట్లాడుతూ ఎర్ర మందారం నెలకొరిగిందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలకు వచ్చిన సందర్భంగా సీతారాం ఏచూరి యూనివర్సిటీలు భావ సంఘర్షణ కేంద్రాలుగా ఉండాలని చెప్పిన మాటలు మరువలేనివన్నారు. తన జీవితం నేటి విద్యార్థి లోకానికి మార్గదర్శకమన్నారు. భారత్ విద్యా సంస్థల చైర్మెన్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక విజ్ఞాన ఘని, మంచి కమ్యూనిస్టు యోధుడు, ప్రజా ఉద్యమాల నాయకుడు సీతారాం ఏచూరినీ కోల్పోవడం భాధాకరమన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన "వీరతెలంగాణ" వీధి నాటిక ఆలరించింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రజనీకాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం.మమత, కె.అశోక్ రెడ్డి, దాసరి ప్రశాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.శంకర్, రాథోడ్ సంతోష్, ఎం.పూజ, ఓయూ కార్యదర్శి రవినాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్, యార ప్రశాంత్, కార్తీక్, జె.రమేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్, కట్టా నర్సింహా, హైదరాబాద్ జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీమాన్, నాగేందర్, ప్రశాంత్, స్టాలిన్, వీరేంద్ర, ఓయూ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సీఐటీయూ యూనివర్సిటీ నాయకులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి హర్యానాలో రాహుల్ యాత్ర



చండీగఢ్ : వచ్చే నెల ఐదో తేదీన జరిగే హర్యానా శాసనసభ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 30 నుంచి రాష్ట్రంలో యాత్ర చేపట్టబోతున్నారు. అయితే ఈ యాత్ర ఏయే ప్రాంతాల మీదుగా సాగుతుందనే విషయంపై కాంగ్రెస్ సీనియర్ నేతలెవ్వరూ పెదవి విప్పడం లేదు. కానీ ఇది భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్రకు కొనసాగింపేనని పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంక గాంధీ కూడా ఈ యాత్రలో పాల్గొనే అవకాశం ఉంది. కాంగ్రెస్ వర్గాలు అందించిన సమాచారం ప్రకారం 30వ తేదీ ఉదయం 11 గంటలకు నారాయణ్‌ఘర్ అసెంబ్లీ నియోజకవర్గంలో యాత్ర ప్రారంభం అవుతుంది. సాయంత్రం ఐదు గంటలకు కురుక్షేత్రలో ముగుస్తుంది. ఏడు నియోజకవర్గాల మీదుగా యాత్ర కొనసాగుతుందని పార్టీ వర్గాలు చెప్పాయి. అక్టోబర్ 3న ప్రచారం ముగిసే లోగా మరికొన్ని నియోజకవర్గాలలో కూడా రాహుల్ యాత్ర కొనసాగే అవకాశం ఉంది.

రాహుల్ యాత్రలో హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా, పీసీసీ అధ్యక్షుడు ఉదయ్ భాన్, ఇతర సీనియర్ నేతలు పాల్గొంటారు. హర్యానాలో ప్రియాంక ఇప్పటి వరకూ ఒక్క ఎన్నికల ర్యాలీలో కూడా ప్రసంగించలేదు. రాహుల్ రెండు సభలలో మాట్లాడారు. కాగా ఇది పాదయాత్ర కాదని, రోడ్ షో వంటిదని ఓ కాంగ్రెస్ నేత చెప్పారు.



విద్యార్థుల కోసం కేరళలో శిక్షణా కార్యక్రమం

- ఎనిమిది లక్షల మందికి ప్రయోజనం

తిరువనంతపురం : విద్యార్థులకు శిక్షణ, మార్గనిర్దేశం అందించేందుకు కేరళలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ ఫర్ ఎడ్యుకేషన్ (కైట్) ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే ఎనిమిది లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతారు. కైట్ అనేది కేరళ ప్రభుత్వ సాధారణ విద్యా శాఖలో సాంకేతిక విభాగం. 'ప్రవేశానికి కీలకం' పేరిట చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సాధారణ విద్యా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి శనివారం ప్రారంభించారు.

సైన్స్, హ్యూమానిటీస్, కామర్స్ విభాగాలలో విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు, మద్దతు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమం కీలక ఉద్దేశం అదేనని ఆదివారం ఓ అధికారిక ప్రకటనలో వివరించారు. కార్యక్రమం అమలు కోసం ప్రభుత్వం ఓ పోర్టల్‌ను ప్రారంభించింది. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలలో విద్యాభ్యాసం చేస్తున్న హయ్యర్ సెకండరీ, ఒకేషనల్ హయ్యర్ సెకండరీ విద్యార్థులు ఈ పోర్టల్‌లోకి ఉచితంగా లాగిన్ అవవచ్చు. అందులో ప్రశ్నాపత్రాలు, అసైన్‌మెంట్లు, మాక్ టెస్టులు వంటి విస్తృత సమాచారం ఉంటుంది. రోజువారీ లైవ్ తరగతులు ముగిసిన తర్వాత ఈ వనరులన్నీ అందుబాటులోకి వస్తాయి.లైవ్ తరగతులు నెల 30 నుండి కైట్ విక్టర్ ఛానల్‌లో ప్రసారమవుతాయి. వీటిని చూడలేకపోయిన విద్యార్థులు ఆ తర్వాత కైట్ యూట్యూబ్ ఛానల్‌లో వీక్షించవచ్చు.కార్యక్రమంలో భాగంగా ప్రారంభంలో రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రం, గణితం, చరిత్ర, రాజకీయ శాస్త్రం, వ్యాపార అధ్యయనాలు, ఆంగ్లం, భూగోళ శాస్త్రం తరగతులు బోధిస్తారు. భవిష్యత్తులో ఇతర సబ్జెక్టులు కూడా అందుబాటులోకి వస్తాయి.

మన్‌కీ బాత్‌లో మోడీ నోట తెలంగాణ

- 114వ ఎపిసోడ్ ప్రత్యేకమన్న ప్రధాని



న్యూఢిల్లీ: మన్‌కీ బాత్ 114వ కార్యక్రమంలో నీటి నిర్వహణతో పాటు పలు కీలకమైన అంశాల గురించి ప్రధాని మోడీ మాట్లాడారు.

దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజల ప్రయత్నాలు, స్ఫూర్తిదాయకమైన కథనాలను మన్‌కీబాత్ చూపిస్తోందన్నారు. కార్యక్రమం ప్రారంభించి పదేండ్లు పూర్తిచేసుకోనున్న నేపథ్యంలో ఈ ఎపిసోడ్ తనకు భావోద్వేగమైనదని అన్నారు. సామూహిక శక్తిని ప్రదర్శించే ప్రత్యేక వేదికగా ఈ కార్యక్రమం మారిందన్నారు.

మన్‌కీ బాత్ ద్వారా తన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా మసాలాలేని కంటెంట్‌ను ప్రజలు పట్టించుకోరనే అభిప్రాయం ఉండేదని.. ఈ కార్యక్రమం ఆ అభిప్రాయాన్ని మార్చేసిందన్నారు. స్ఫూర్తిమంతమైన కథలు, ప్రేరణ పొందే వ్యక్తులకు సంబంధించిన విషయాలు తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. నీటి నిర్వహణ గురించి ప్రస్తావించిన ఆయన.. నీటి సంరక్షణ ఎంత కీలకమో వర్షాకాలం సూచిస్తుందని చెప్పారు. నీటి సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను మెచ్చుకున్నారు. అనుకున్న లక్ష్యం కంటే ఎక్కువగా మొక్కలను నాటడం ద్వారా తెలంగాణ ప్రజలు కొత్త రికార్డు సష్టించారని అన్నారు. తెలంగాణతోపాటు ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు కూడా రికార్డు సాధించాయని పేర్కొన్నారు. 20 వేల భాషలకు భారత్ పుట్టినిల్లు అని పేర్కొన్న మోడీ.. దేశంలో వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. 'తల్లి పేరిట మొక్క' కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని చెప్పారు.

క్రియేట్ ఇన్ ఇండియాలో భాగస్వామ్యం కావాలని నూతన ఉత్పత్తుల తయారీదారులకు మోడీ పిలుపునిచ్చారు. భారత్ ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న 'మేకిన్ ఇండియా'కార్యక్రమం ప్రారంభించి పదేండ్లు పూర్తయిందని ప్రధాని అన్నారు. దీంతో ప్రతి రంగంలోనూ ఎగుమతులు పెరిగాయని, విదేశీ సంస్థాగత మదుపరులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించడంలో ప్రభుత్వం పురోగతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమం స్థానిక తయారీదారులకు సాయపడిందన్నారు. రానున్న పండుగ సీజన్‌లో స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రజలకు పిలుపిచ్చారు. ఇదిలా ఉండగా.. 2014 అక్టోబర్ 3న తొలిసారి 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.



అయోధ్య రామాలయం వద్ద

ప్రసాదంగా యాలకులు

పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిన అధికారులు

లక్నో : తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో ఆలయాల వద్ద ఫుడ్ సేఫ్టీ అధికారులు అలర్ట్ అవుతున్నారు. ప్రసాదం తయారీ, పంపిణీ విషయంలో అప్రమత్తంగా ఉంటున్నారు. యూపీలోని అయోధ్యలో గల రామాలయం వద్ద ప్రసాదంగా పంచబడుతున్న యాలకుల గింజలను ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ స్వాధీనం చేసుకున్నది. వాటి సమగ్ర పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపింది. ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ (ఐజీఆర్ఎస్) ద్వారా అందిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకున్నట్టు అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ మానిక్ చంద్ సింగ్ తెలిపారు. శాంపిళ్లను హైదరగంజ్ నుంచి సేకరించినట్టు వివరించారు. వాటిని సమగ్ర పరీక్షలు, మూల్యాంకనం కోసం ఝాన్సీ స్టేట్ ల్యాబోరేటరీకి పంపినట్టు తెలిపారు. ఒక పవిత్ర సమర్పణలో భాగంగా రోజుకు దాదాపు 80 వేల యాలకుల గింజల ప్యాకెట్ల పంపిణీ జరుగుతుందని రామాలయ ట్రస్ట్ ఆఫీసర్ ఇంఛార్జ్ ప్రకాశ్ గుప్తా చెప్పారు. తిరుపతి లడ్డూ కల్తీ వివాదం నేపథ్యంలో రామాలయ ప్రధాన పూజారీ దేశవ్యాప్తంగా అమ్మబడుతున్న నెయ్యి స్వచ్ఛతను ప్రశ్నించారు. ఆలయ పూజారుల పర్యవేక్షణలోనే 'ప్రసాదం'ను తయారు చేయాలని సూచించారు.

వేదికపై ఖర్గేకు అస్వస్థత

- జమ్మూకాశ్మీర్ ఎన్నికల ప్రచారసభలో ప్రసంగిస్తుండగా ఘటన



శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కథువా జిల్లాలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అనూహ్య సంఘటన చోటు చేసుకొంది. ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వేదికపై అస్వస్థతకు గురయ్యారు. ప్రసంగిస్తున్న సమయంలో అదుపు తప్పి పడిపోబోయారు. దీంతో అక్కడున్న నేతలు ఆయన్ను పట్టుకున్నారు.

వెంటనే ఖర్గేకు నీళ్లు తాగించారు. అయినప్పటికీ ఆయన ప్రసంగాన్ని మాత్రం ఆపలేదు. పార్టీ నేతలు ఆయనను పట్టుకుని నిలబడి ఉండగా.. ప్రసంగాన్ని కొనసాగించారు.

"జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను తిరిగి తీసుకువస్తాం. అందుకోసం పోరాడుతూనే ఉంటాం. ఎనిమిది పదుల వయసులో ఉన్న నేను.. అప్పుడే చనిపోను. మోడీ సర్కార్‌ను గద్దె దించే వరకు అలసిపోను. అప్పటివరకు బతికే ఉంటా" అని వ్యాఖ్యానించారు.

ఆయన అస్వస్థతకు గురైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వెంటనే పార్టీ అగ్రనాయకత్వం జమ్మూకాశ్మీర్ నేతలను అప్రమత్తంగా ఉండమని సూచించింది. అనంతరం వైద్య బృందానికి సమాచారం అందించారు. కాగా.. జమ్మూకాశ్మీర్‌లోని ఏడు జిల్లాల పరిధిలో తొలిదశ కింద 24 శాసనసభ నియోజకవర్గాలకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 61 శాతం పోలింగు నమోదు అయింది. రెండోవిడత పోలింగ్ ఆరు జిల్లాల్లోని 26 నియోజకవర్గాల్లో పూర్తికాగా.. మూడో విడత పోలింగ్‌కు జమ్మూకాశ్మీర్ సిద్ధమైంది.

నిరుద్యోగంపై అబద్ధాలు

ఈపీఎఫ్ఓ నమోదు.. ఉద్యోగ కల్పన కాదు

- అంకెల గారడీతో అవాస్తవాలు
- కేంద్రం వాదనలో హేతుబద్ధత లేదు
- తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వ ప్రకటనలు
- మోడీ సర్కారు తీరుపై నిపుణులు, విశ్లేషకులు



న్యూఢిల్లీ : ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ)లో చేరే ఉద్యోగుల సంఖ్యను ఆధారంగా చేసుకొని దేశంలో ఉద్యోగాల కల్పన పెరిగిందని మోడీ సర్కారు అంటున్నది. ఇది తమ ప్రభుత్వ గొప్పతనంగా చెప్పుకుంటున్నది. అయితే, ఈపీఎఫ్ఓ సమాచారాన్ని దేశంలో ఉద్యోగాల కల్పనకు ముడిపెట్టటంలో హేతుబద్ధత లేదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. మోడీ సర్కారు అంకెల గారడీతో దేశంలోని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని వారు చెప్తున్నారు.

ఇటీవల కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమాచారం ఆశ్చర్యం కలిగించక మానదు. 2017, సెప్టెంబర్ నుంచి 2024, మార్చి మధ్య ఈపీఎఫ్ఓలో 6.2 కోట్ల మంది నికర చందాదారులు చేరారని సదరు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2021-24 మధ్య 8 కోట్ల కంటే ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించబడ్డాయన్న కేంద్రం వాదనకు ఇది బలాన్ని చేకూరుస్తుంది. ఈపీఎఫ్ఓ నమోదు సమాచారం ఆధారంగా కోట్ల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించామన్నది ఇక్కడ కేంద్రం వాదన. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించామని చెప్పుకోవటానికి తాత్కాలికంగా ప్రభుత్వానికి ఇది కొంత వరకు ఉపశమనం కలిగించినా.. వాస్తవాలు మాత్రం సర్కారు వైఫల్యాన్ని బయట పెడతాయని విశ్లేషకులు, నిపుణులు అంటున్నారు.

2017, సెప్టెంబర్ నుంచి కవర్ అయ్యే పేరోల్ డేటాను 2018, ఏప్రిల్ నుంచి ఈపీఎఫ్ఓ విడుదల చేస్తున్నది. పేరోల్ డేటా ద్వారా ఈపీఎఫ్ఓలో తొలిసారి చేరుతున్నవారు, వైదొలుగుతున్నవారు, మళ్లీ చేరుతున్నవారి సంఖ్య తెలుస్తుంది. అయితే, ఈపీఎఫ్ఓ నమోదులో నికర పెరుగుదలను ఉపాధి కల్పనకు ఆపాదించలేమని విశ్లేషకులు చెప్తున్నారు. ఈపీఎఫ్ కింద ఇప్పటికే ఉన్న లబ్దిదారుల సంఖ్యకు, ఇప్పటికే ఉన్న కొందరు కాంట్రాక్టు కార్మికులు వచ్చి చేరటం ద్వారా ఈపీఎఫ్ఓ కింద నమోదయ్యేవారి సంఖ్య పెరుగుతుంది. వాస్తవానికి అక్కడ ఎలాంటి కొత్త ఉపాధి కల్పన జరగదని వారు వివరిస్తున్నారు. నికర కొత్త ఈపీఎఫ్ నమోదును ఎప్పుడూ ఉపాధి కల్పనగా చెప్పలేమన్న కీలక విషయాన్ని గుర్తుంచుకోవాలని అంటున్నారు. కొందరు గతంలో పని చేసినా.. ఈపీఎఫ్ కవరేజ్ కిందకు రానివారు కూడా ఉంటారు. ఇలాంటి వారిని ఈపీఎఫ్ కవరేజ్ కిందకు తీసుకొచ్చి కొత్తగా ఉపాధి సంఖ్య పెరిగినట్టుగా చెప్పటం సరికాదని విశ్లేషకులు చెప్తున్నారు.

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్, ఇతర నిబంధనల చట్టం, 1952 ప్రకారం.. ఏదైనా సంస్థ ముందు 12 నెలల్లో 20 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులను కలిగి ఉంటే.. సదరు సంస్థకు చట్టం నిబంధనలు వర్తిస్తాయి. ఒక సంస్థ పెద్ద సంఖ్యలో ఉద్యోగులను కలిగి ఉండవచ్చు. రెగ్యులర్ (శాశ్వత) ఉద్యోగుల సంఖ్యను తక్కువగా ఉంచుతాయి. ఇతర కార్మికులు, కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులుగా ఉంటారు. ఈ సంస్థలు ఈపీఎఫ్ఓ పరిధిలోనే ఉన్నప్పటికీ.. నమోదు అవకాశం శాశ్వత ఉద్యోగులకు మాత్రమే పరితమై ఉంటుంది. కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులు, కార్మికులు మినహాయించబడతారు.

ప్రస్తుతం ఈపీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ ప్రయోజనం కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులకూ పొడగించారు. దీంతో ఈపీఎఫ్ఓ డేటాలో నూతన నమోదును చూడొచ్చు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే వీరంతా గతంలో ఉద్యోగులే. కాకపోతే ఆ సమయంలో ఈపీఎఫ్ఓలో చేర్చుకోలేదు. ఇప్పుడు ఆ అవకాశం ఉన్నది. ఈపీఎఫ్ఓలో వీరు వచ్చి చేరినంత మాత్రానా ఇక్కడ ఎలాంటి కొత్త ఉద్యోగాల కల్పన జరిగినట్టు కాదని నిపుణులు చెప్తున్నారు. అలాగే, ఉద్యోగుల సంఖ్య 20 లేదా అంతకంటే మించి ఉన్న సంస్థలు కూడా ఈపీఎఫ్ కవరేజ్ కిందకు వస్తుంటాయి. ఇది ఒక నిరంతర ప్రక్రియ. దీని కారణంగా కూడా ఈపీఎఫ్ఓలో నమోదు సంఖ్య పెరుగుతుంది. దీని ఆధారంగా కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల సంఖ్య పెరిగిందని చెప్పుకోవటం ఎంత మాత్రమూ సరికాదని నిపుణులు వాదిస్తున్నారు.

మోడీ పాలనలో నిరుద్యోగం ప్రధాన సమస్య

మోడీ పాలనలో భారత్‌లో నిరుద్యోగం ఇప్పటికే ఒక ప్రధాన సమస్యగా ఉన్నది. ఉద్యోగ, ఉపాధి కల్పన తలకు మించిన భారంగా మారింది. పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలూ ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో కోట్లాది సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించామని మోడీ సర్కారు చెప్పుకోవటం ఆశ్చర్యం కలిగించక మానదని విశ్లేషకులు చెప్తున్నారు. 2017-2022 మధ్య ఈపీఎఫ్ఓలో 6.2 కోట్ల నికర కొత్త నమోదు సంఖ్యను ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధి కల్పన ప్రయత్నాలుగా చూడలేమని అంటున్నారు.

ఉద్యోగాల్లో నాణ్యత కరువు

క్లెమ్స్ (క్యాపిటల్, లేబర్, ఎనర్జీ, మెటీరియల్, సర్వీసెస్) డేటాబేస్ ఆధారంగా ఈపీఎఫ్ఓతో పాటు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) సమాచారాన్ని ఉటంకిస్తూ 2021-24 మధ్య భారత్‌లో 7.8 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని మోడీ సర్కారు వాదిస్తున్నది. అయితే, పైన వివరించనట్టుగా అంకెల గారడీతో కేంద్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విశ్లేషకులు, నిపుణులు చెప్తున్నారు. అంతేకాకుండా, దేశంలో సృష్టించబడుతున్న కొత్త ఉద్యోగాల్లో నాణ్యత కరువైందని అంటున్నారు.

కాలం పొలమారుతుంది



కాలం కుదుపులకు లోనయ్యిందేమో..
నడుస్తూ ఉన్నప్పుడు
నిత్యం పొలమారుతూనే ఉంది
గతాన్ని నెమరు వేసుకుంటూ
నిట్టూర్పులు విడుస్తూనే ఉంది
పలకరింపులకై పరితపిస్తూ
ఆత్మీయతకై అలమటిస్తూ
ఎక్కడోగాని రాని, మట్టి వాసనకై
వెతుకులాడుతూనే ఉంది
అత్తరు సొబగుల్లో మాయమైన
చెమట చుక్కల సౌందర్యాన్ని
కాసుల గలగలలో వినిపించని
కేరింతల సుమగంధాల జాడను
వెతుక్కుంటూ నడుస్తూనే ఉంది
ఎవరి పన్నాగమో..!
పట్టణ పుట్టల కింద విలవిలలాడుతున్న
పల్లెల శిథిలాలను తడుముకుంటూ
అభివృద్ధి చక్రాల కింద అనిగిపోయిన!
చేను మొనలను నిమురుకుంటూ
కాలం కుంటుతూనే నడుస్తూ ఉంది
పూర్వీకుల పాదముద్రలు పసిగడుతూ
తప్పిపోయిన త్రోవను
వెతుక్కుంటూనే ముందుకెళ్తూ

- వినోద్ కుత్తుం, 9634314502

దాశరథి కవిత్వ దృక్పథం

"వ్రాసివ్రాసి పొత్తమ్ములు మాసినా క
లమ్ములో సిరా యింకి, రక్తమ్ము పోసి
అరుణతారుణాక్షరాల పద్యాలు కూర్చి
ఆకలికి మాడిపోయెద, నీ కొరకయి"
(అగ్నిధార: ఉస్సురనెదవు - పు 69)
హైదరాబాద్ చార్మినార్ దగ్గర పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికురాలి శ్రమను చూసి అభ్యుదయ కవి చెప్పిన పద్యమిది.



అభ్యుదయ కవిత్వం ఎవరి పక్షమో ఈ పద్యం చెప్పకనే చెబుతున్నది. ప్రాచీనకాలంలో గానీ, ఆధునిక కాలంలో గానీ కవిత్వం మీద కవిత్వం చెప్పని తెలుగు కవులు చాలా తక్కువ. కొత్త సామాజిక సందర్భం ఏర్పడిన ఉదంతం తెలుగు కవులు కవిత్వాన్ని పునర్నిర్వచిస్తూ వస్తున్నారు. అది అనివార్యం. అభ్యుదయ కవిత్వం మొదలయినాక, అనేకమంది అభ్యుదయ కవులు కవిత్వం గురించి అసంఖ్యాక కవితలు రాశారు. వారిలో డా॥దాశరథి కృష్ణమాచారి ఒకరు. ఆయన 1937 నుండి 1987లో మరణించే దాకా కవిత్వం రాశారు. ఆయన రచించిన వందల కొలది కవితల్లో కనీసం ముప్పై కవితలు కవిత్వం గురించి రాశారు. అవి ఆయన కవిత్వ దృక్పథానికి దర్పణాలు. అగ్నిధార (1949), రుద్రవీణ (1950), పునర్నవం (1961), కవితాపుష్పకం (1966) కావ్యాలలో ఎక్కువగాను, తక్కిన కావ్యాలలో పరిమితంగానూ దాశరథి కవిత్వ కవితలు రాశారు. ఆయన కవితలలో భావ, అభ్యుదయ కవితలు కలిసి వుంటాయి. ఆయన కవిత్వ కవితలలోనూ ఆ మిశ్రమ లక్షణం కనిపిస్తుంది.

తొలినాళ్లలో భావ కవిత్వ ప్రభావంతో దాశరథి రాసిన కవిత్వ కవితలలో 'వాసంతిక' ఒకటి.

"నీ నునుబుగ్గలందు రమణీ! అరుణారుణ బాలభానుతే/ లానటనార్థియై ఉదయ రాగమునన్ పరువెత్తివచ్చు? ప్ర/ స్థానిత తీక్షతన్ చెలగి తాండవమాడును? నాకలంపు వి/ న్నాణముతో రచింతులలనా! నునుచెక్కులపై నికావ్యముల్"


వసంతం అనే యువతితో కవి సంభాషణ చేసిన పద్యమిది. ఆయన ఆమెను అడిగాడు. ఆమె లేత బుగ్గలమీద ఉదయించిన సూర్యుడు నటన చేయడం కోసం ఎందుకు పరుగెత్తి వస్తున్నాడు? ఎందుకు పరుగెడుతూ, ఎందుకు నాట్యం చేస్తున్నాడు? నేను నాదల నైపుణ్యంతో నీ నును చెక్కిలి మీద కావ్యాలు రాస్తాను అని కవి చెప్పాడు. కవి, రవి ఇద్దరూ ఒక్కడే. రవి ఆమె చెక్కిలీమీద తన కిరణాలతో నాట్యం చేస్తాడు. కవి తన కలంతో కవితలల్లుతాడు. కవి తన కలానికి సూర్య కిరణాలకు సమన్వయం చేశాడు. ఆమె లేత బుగ్గలమీద సూర్య కిరణాల నాట్యం కన్నా తన కలం రాసే కావ్యాలే మిన్న అని ప్రకటించారు. 'మహాలేఖిని' అన్నది మరో భావ కవిత్వ కవిత. కవి తన కలంతో చేసిన సంభాషణ ఈ కవిత. కవిత్వం ఆవేశ కళ. భావ కవిత్వం మరీ ఆవేశ కళ. భావ కవులకు తన్మయత్వం ఎక్కువ. దాశరథి భావకవిగా చాలాచోట్ల ఆ తన్మయత్వాన్ని ప్రకటించారు. తన కలంతో ఆయన చేసిన సంభాషణ ఇది.

"త్వరపడు! భావసాగరము బాహువు లెత్తుచు నీ శిరస్సుపై/ పొరలుచు వచ్చుచున్నది; కవుంగిలిలో కవితాకుమారి సం/ బరపడి నవ్వుచున్నది; గబా గబ కూర్చుము పద్యరాశి; అ/ ర్థ రహితమంచు పల్కెడి కళా రహితున్ పదత్రోసి సాగుమా!"

భావం అనే సముద్రం పొంగి వచ్చి నీ తల మీద తన చేతులతో నీపైకి వస్తున్నది. కౌగిలింతలో కవితాకుమారి సంబరంతో నవ్వుతున్నది. నువ్వు త్వరత్వరగా పద్యాలను లిఖించు. ఎవరైనా అర్థరహితంగా వుందని విమర్శిస్తే వారిని పక్కకు నెట్టి నువ్వు రాసుకుంటూ వెళ్లు అని కవి తన లేఖినిని కోరారు. ఈ పద్యం కవిత్వం పుట్టుకనూ చెబుతున్నది.

"నా గీతావళి ఎంత దూరము ప్రయాణం బౌనొ; అందాక ఈ/ భూగోళమ్మున అగ్గిపెట్టెదను; నిప్పుల్ వోసి హేమంత భా/ మా గాంధర్వ వివాహ మాడెదను; ద్యోమణ్యుష్ణ గోళమ్ముపై/ ప్రాగాకాశ నవారుణాస్ర జలధారల్ చల్లి చల్లార్చెదన్."

తన కవిత్వంలో ఎంత దూరం ప్రయాణిస్తుందో, అంత దూరం ఈ భూగోళాన్ని కాల్చేస్తాను. నిప్పులు చిందించి హిమం అనే స్త్రీని గాంధర్వ వివాహం చేసుకుంటాను. తూర్పున ఉదయించిన సూర్యుని ఎర్ర కిరణాల ధారలు చల్లి చల్లార్చుతాను. వేడి, చల్లదనం విరుద్ధ గుణాలు. తన కవితాశక్తితో కవి ఉష్ణాన్ని రగిలించి చల్లార్చగలను అని ప్రకటించారు. కవి శక్తి అంతటిదని ఆయన అభిప్రాయం.



- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

భావకవిగా ఇలాంటి మధురభావాలు కవిత్వం గురించి చెప్పి అభ్యుదయ కవిగా ఈ నాటికీ ప్రాసంగించగల అనేక కవిత్వ సూత్రాలు అందించారు. 'అగ్నిధార'లోనూ దాశరథి సమాజంలో రక్తానికీ, ప్రాణానికీ, శ్రమకూ, సౌజన్యానికీ, శ్రామికునికి, రచయితకూ విలువలేదు అని గుర్తించారు. అదే సమయంలో 'నిరుపేద' అనే కవితలోనే కవి కడుపేదలవైపు నిలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

"నిరుపేదా! నేను కూడ/ నీకోసం ఆకలితో/ చచ్చేనా! నాకలాన్ని రూకలకై/ అమ్ముకొచ్చేనా?"

అని అడుగుతూ 'దివ్యనవ్య భవితవ్యానికి' నిరీక్షించమని కోరారు.

'అగ్నిధార' కావ్యంలోనే దాశరథి యువకులతో పాటు రచయితల్ని కూడా నవ సమాజ నిర్మాతలుగా ప్రకటించారు.

"నవభారత యువకులారా!/ కవులారా! కథకులారా!/ భవితవ్యపు హవనానికి హోతలు;/ నూతన భూతల నిర్మాతలు మీరే, మీరే" (అనలదాహం)

'రుద్రవీణ' కావ్యంలో సమ్మె జేసే కార్మికులనుద్దేశించి వాళ్ల కోసం కవిత్వం రాస్తానని ప్రకటించారు.

"గొంతుకలెండి డొక్కలకు కొంచెము గంజియు లేకపోయినన్/ పంతము నిగ్గగావలెను; ప్రాణము పోయినగూడ సమ్మెగా/ వింతు మాటంచు ఆకట తపించెడి పేదలగూడ్చి నేనుమ్రో/ గింతును రుద్రవీణ; పలికింతును విప్లవగీతికావళుల్" (మూర్ఛె)

ఇలాంటి పద్యాలన్నీ దాశరథి అభ్యుదయ కవిగా తనను తాను నిర్వచించుకోవడాన్ని సూచిస్తాయి. తను ఎటువైపో కవి ప్రకటించుకోవడాన్ని ధ్వనిస్తాయి.

> కవిత్వం నిరంతరం సృజనాత్మకంగా వుండాలని, కవిత నిరంతరం కొత్తదనంతో అలలరారాలని కవి అభిప్రాయం. అభ్యుదయకవి మానవ సంబంధాలలో ధనాధిపత్యాన్ని వ్యతిరేకిస్తారు. అభ్యుదయకవులు పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకులు. అందుకే దాశరథి "రూపాయికి విలువలేని రోజు రేపు వస్తుందిట" అనే కవిత రాశారు.

'మహేంద్రోదయం' కావ్యంలో దాశరథి తెలంగాణ అనే నాలుగు భిన్న పద్యాల కవిత రాశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిబద్ధుడు, నిమగ్నుడు అయిన దాశరథి, ఆ ఉద్యమంతో కవిగా తనను తాను భాగస్వామిగా ప్రకటించుకున్నారు.

"మూగవోయిన కోటితమ్ముల గళాల/ పాట పలికించి కవితాజవమ్ముకూర్చి/ నా కలానికి బలమిచ్చి నడిపినట్టి/ నా తెలంగాణ కోటి రత్నాల వీణ"

ఒక ప్రజా ఉద్యమం కవిని ఎలా కదలించి తనలో కలుపుకుంటుందో ఈ పద్యం సూచిస్తుంది.

'పునర్నవం' కావ్యంలో కవిత్వ రచనకు సంబంధించి అనేక విషయాలు పేర్కొన్నారు దాశరథి. కవితలల్లడం అబద్ధాలాడినంత సులభం కాదు అన్నారు. అంటే కవిత్వం కేవలం ఊహకాదని అర్థం. కవిత్వానికి వాస్తవికత పునాది అని ఆయన అభిప్రాయం.

"దూరాన పొడిగాలి దిబ్బలకు/ తునాతునకలైపోయిన ఆకులతో/ ముసలిమొహం పడిన వృక్షం మీద/ యౌవనం చిగురించడం కవిత్వం/ రోజూ కనబడే నక్షత్రాల్లోనే/ రోజూ కనబడని కొత్తదనం చూసి/ రోజూ పొందని ఆనందానుభూతి/ పొందడం అంటేనే కవిత్వం"

కవిత్వం నిరంతరం సృజనాత్మకంగా వుండాలని, కవిత నిరంతరం కొత్తదనంతో అలలరారాలని కవి అభిప్రాయం. అభ్యుదయకవి మానవ సంబంధాలలో ధనాధిపత్యాన్ని వ్యతిరేకిస్తారు. అభ్యుదయ కవులు పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకులు. అందుకే దాశరథి "రూపాయికి విలువలేని రోజు రేపు వస్తుందిట" అనే కవిత రాశారు.

"కవి మాటకు విలువనిచ్చి/ కలహం మాట నశిస్తుంది/ రూపాయికి విలువలేని/ రోజు రేపు వస్తుంది"

అన్నది ఆయన ధీమా. అయితే ఆయన అభిలాష ఇంకా నెరవేరవలసే వుంది.

'కవితాపుష్పకం' పేరుతో రాసిన కవితలో దాశరథి తన కవిత్వ సిద్ధాంతాన్ని సంపూర్ణంగా ప్రకటించారు. 1966 నాటికి దిగంబర కవిత్వం వస్తున్నది. మరోవైపు కొందరు మార్మిక కవులూ వున్నారు. విప్లవ సాహిత్యం పురుడు పోసుకుంటున్నారు. ఆ నేపథ్యంలో కావచ్చు దాశరథి "చంద్రుడి భాష మాట్లాడింది, అందరికీ ఆ భాష అర్థమవుతుంది" అని కవులకు విజ్ఞప్తి చేశారు.

"ద్వేషాలు కలిగించే భాష మనకు వద్దు/ ప్రేమను రేకెత్తించే కోమల భాష మనకు కావాలి" అని ప్రబోధించారు. అప్పటికే ఆయనలో జాతీయ భావాలు, సమైక్య వాద భావాలు బలంగా నాటుకొని వున్నాయి. అందుకే

"మన దేశంలోని అన్ని భాషలూ నావి/ నాకర్థమయినా, నావికాకున్నా నావి" అని ప్రకటించారు. అంతేకాదు, తనను తాను విస్తృతపరచుకుంటూ

"మంచి కవిత్వం ఏ భాషలో వుంటే అది నా భాష మంచి కవి ఎవరైతే అతడు నా మిత్రుడు" అని ఒక విశాల దృక్పథాన్ని ప్రతిపాదించారు. తెలుగు, ఉర్దూ తనకు రెండు కళ్లు అని చెప్పారు. ఆ రెండు భాషలలో ఎన్ని భావాలైనా చదవగలనని అన్నారు.

"హృదయం ఒక్కటైతే లోకమంతా ఒకటి" అని విశ్వజనీన భావనను వ్యక్తం చేశారు. కంబరు, కబీరు కలిసి కవిత్వం చదువుతారని, ప్రాంతాలు, సంకుచితత్వాన్ని వ్యతిరేకించారు. "ప్రతి హృదయంలో రోజూ అఖిలభారత కవి సమ్మేళనం జరగాల"ని ఆకాంక్షించారు.

1975 నాటి 'తిమిరంతో సమరం'లో కత్తికంటే కలం గొప్పది" అని ప్రకటించారు. 1984 నాటి 'జ్వాలాలేఖిని' లో దాశరథి 'కవితా నా సంపద' అని ప్రకటించారు.

"అంధకార నిశ్శబ్దారణ్యాలలో/ ఆరని కాగడాలతో నడిచే కవిని నేను" అంటూ కవికి వుండవలసిన సామాజిక చైతన్య స్పృహను సూచించారు.

బాలగంగాధర తిలక్‌లాగే, దాశరథి కూడా భావాభ్యుదయ కవి. చాలాకాలం ఆ రెండింటినీ మేళవించి రాశారు. క్రమంగా భావ కవిత్వ తాకిడిని తగ్గించుకుని అభ్యుదయ మార్గంవైపు ఎక్కువ దృష్టి పెట్టారు. సినిమా పాటలలో సైతం 'ఆవేదన కలగాలి, ఆవేశం రావాలి' వంటివి రాశారు. దాశరథి నిలువెల్లా కవి. పోరాట కవి, ఉద్యమ కవి. ఆయన కవిత్వ కవితలలో ఆ లక్షణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.


నేను దాశరథి గారిని 1967 - 68 ప్రాంతాలలో చిత్తూరు జిల్లా రచయితల సంఘం వారు చిత్తూరులో నిర్వహించిన జిల్లా మహాసభలలో చూశాను. ఆధునిక కవిత్వం అంటే ఏమిటో వివరించారు. నేను అప్పుడు బి.ఏ చదువుతున్నాను. "ఇక్కడ నుంచి బాకు విసిరితే, అది నిజాంరాజు గుండెల్లో గుచ్చుకోవాలి. అది ఆధునికత" అన్నారు. అది నాకు బాగా గుర్తుంది. తర్వాత సాహిత్య చరిత్ర చదువుతున్న సమయంలో దాశరథి పోరాట జీవితం తెలిసింది. ఆయన శతజయంతి సందర్భంగా ...

"ఉప్పునీళ్ల ఉదధిని తాగేసి/ గొప్ప గొప్ప మేఘాల్ని వర్షించి/ అమృత జలధారల్ని వర్షించే/ అర్కుడు నిజానికి అసలైన కవి" (కలీనం కవికి).

(దాశరథి శతజయంతి సంవత్సరం)

లక్ష్యం నుండి లక్షణానికి తొవ్వ చూపిన నలిమెల

"తెలంగాణ బతుకు వేరే. తెలంగాణ భాష వేరే. ఎవని వాడుక భాష వాడు రాయాలె. ఇట్ల రాస్తె అవుతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకునుడు, మనను మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె. నేనెన్నోసార్లు చెప్పిన. భాష రెండు తీర్లు - ఒకటి బడి పలుకుల భాష, రెండోది పలుకు బడుల బాష. పలుకుబడుల భాష గావాలె", అన్న కాళోజీ మాటల సారం తెలిసి ఆయన పేరు మీద తెలంగాణ భాషాదినోత్సవం జరుపుడు, ఆయన పేరుతోని పురస్కారం ఇచ్చుడు తెలంగాణ భాషకు గౌరత. ఈ సంవత్సరం ఈ పురస్కారం బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్ కు అందజేస్తమని ప్రకటించుడు పురస్కారానికి వన్నె. పద్నాలుగు భాషలు మనుసున పట్టిచ్చుకొని మాట్లాడుడు, రాసుడు, అనువాదాలు చేసుడు ఒకెత్తు. ఇంకోదిక్కు తెలంగాణ భాషను చల్లకుండలెక్క చిలికి వెన్నతడిని పంచుడు ఇంకొకెత్తు.



1976ల తెలంగాణ భాషల 'రాతి గుండెలు' కవిత రాసిన తను, 1977ల తెలంగాణ పలుకుబడిల 'మంద' కథ రాసిన తను, ద్రావిడ భాషలైన తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ సామెతల మీద పరిశోధన చేసిన తనకు ఒక రంది పట్టుకున్నది. తెలంగాణ ప్రజల భాష మీద పడ్డ ముద్ర ఎంత తప్పో తెలియజెప్పాల్ననే రేషం మొదలైంది. 2001ల సిద్ధిపేట మంజీర రచయితల సంఘం సభ, వరంగల్ తెలంగాణ రచయితల వేదిక సభల తెలంగాణ భాష ఎంత అర్థవంతమైందో చెప్పుడు షురూ చేసిండు.

శ్రీ శ్రీ అన్నట్టుగ నలిమెల తెలంగాణ పలుకుబడులకై "విన్నవి కన్నవి విన్నవించగా, మాటలకై వెదుకాడగబోతే, అవి పుంఖాను పుంఖాలుగా, శ్మశానాలవంటి నిఘంటువులు దాటి, వ్యాకరణాల సంకెళ్లు విడిచి, ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి, వడిగా, వడివడిగా, వెలువడినై, పరుగిడినై". ప్రజల భాషను జీర్ణం చేసుకోని లక్షణ, భాషా శాస్త్రాలు, నిఘంటువులు, వ్యాకరణాలను వదిలి నలిమెల గళం నుంచి, కలం నుంచి ఉపన్యాసాలై, వ్యాసాలై అడుగిడినై. జనుల నోటి ముత్యాలు పుస్తకాన పలువరుసలై ముసిముసి నవ్వులు నవ్వినై. తెలంగాణ ప్రజల భాషకు మొదటి రిఫరెన్సు పుస్తకం తెలంగాణ పదకోశం (2003)ల అచ్చు అయింది. ఇది తెలంగాణ ఉద్యమకారులకు ఒక కరదీపిక అయింది. కమ్మలనిండ కమ్మటి తెలంగాణ భాష పరిమళం గుప్పుమన్నది.

నిజంగనే తెలంగాణ భాషను వింటే అచ్చ తెనుగుదనం చెవులకు ఇంపుగ తగులుతది. ప్రాచీన కవుల ప్రయోగాలు ఎన్నెన్నో తెలంగాణ ప్రజల వ్యవహారంల విన్పిస్తయి. ఆదివారం 'గోలె' ఎటుపోతవు బిడ్డా!, ఊర్ల 'పొన్న' తిరుగవోకు, వాడు దేశాల'పొంటి' వోయిండు వంటి వాక్యాలు ఇప్పటికీ పల్లెనోళ్ళల్ల నానుతున్నె. తెలంగాణ భాషకు ఒక నాద మాధుర్యం ఉన్నదని, అది పూర్ణానుస్వారం వలన సిద్ధిస్తున్నదనే ఎరుక కలిగించిండ్రు నలిమెల. ఇక్కడి జాతీయాలు, సామెతలు ఇతర ప్రాంతాలకంటె ఎట్ల వేరైనయో చేతిల దీపం బట్టుకొని చూపిండ్రు. యతి, ప్రాసలతోటి లయాత్మకంగ మారే పదాల వైనం చెప్పిండు. ద్విత్వంగ మార్చుడు, సంయుక్తాక్షరాలుగ చేసుడు ఇక్కడి ప్రజల భాషల ఎంత సాధారణమో చూపిస్తడు. ఇక్కడి ప్రజలు అర్థవంతమైన భాష మాట్లాడుతున్నరని, వ్యుత్పత్తులతోని నిరూపణ చేసిండు. 'మేర, లాగు, తంతె, గుండీ, చల్ల, ఎర్ర, వాగు, గుల్ల, తొక్కు, కాపోళ్లు, బెస్తోళ్లు' వంటి వందల పదాలను ఉడుంపట్టువట్టి వ్యాసాలు రాసి 'బాణం' పుస్తకంగ వేసిండ్రు నలిమెల.

నలిమెల ద్రవిడ భాషల లక్షణం తెలిసిన వారు కాబట్టి, తెలంగాణ భాషల ఉన్న పదాలకు ప్రాచీన ద్రవిడ భాషా మూలాలు తెలుసుకున్నరు. తెలంగాణ మాటలకు తమిళంతోటి ఉన్న సోపతిని, పొంతనను, చుట్టిర్కాన్ని విప్పి చెప్పిండ్రు. ఈ చెప్పుడు కూడా ఒక్క మాటల కాదు. తెలంగాణ భాష-తమిళ పదాలు పేరుతో పుస్తకమే వేసిండు. దీంట్ల కూడ ఒక పదం ఇచ్చి దాని ఎదురుంగ మరో పదం ఇచ్చి విడిచిపెట్టుడు కాదు, వాక్యం రాసుకుంట పోయిండు. ఇట్ల తెలంగాణ పదాలకు, మూల ద్రవిడ, తమిళ మూలాలున్న తుప్పల్, తూంగు, అచ్చు, తంబి, తెఱల్, తెన్, పూచ్చి, పుల్లాంగుళల్, కొండుపో, కల్లుప్పు, శుండెలి, వంటి వందల పదాలను పొక్కలకెల్లి సోదిచ్చుకచ్చిండు నలిమెల.

తెలంగాణ మాటకు మూల ద్రవిడ మూలాలే కాదు, ప్రాచీన కవులు నన్నయ, పాల్కురికి, తిక్కన, పోతన మొ. వాడిన దేశీ పదాల పొందిక కూడ ఉన్నది. ఈ ఉద్దేశ్యం బలపరుసుటానికి, రాసిందే తెలంగాణ భాష దేశ్యపదాలు. దీంట్ల శబ్ద రత్నాకరంల ఉన్న కోర, కొత్త, కయ్య, డొల్లు, తనబ్బీ, తబుకు, నెత్తి, నెనరు, దొంతి, నానువాలు, కంటు, ఈగి, కడమ, కర్రె మొదలైన దేశీ పదజాలమంత కుప్పవోసి వివరం చెప్తడు. తెల్లారితె పొద్దూకితే ఏ మాట మాట్లాడినా దాంట్ల సగం సంస్కృత పదాలె విన్పిస్తయి. సంస్కృత భాష దేశభాషల మీద చూయించిన ప్రభావం తక్కువనా! మరి, ఇది తెలంగాణ భాషల ఎట్ల ఇమిడిపోయింది? అది తెల్వాల్నంటె నలిమెల భాస్కర్ రాసిన తెలంగాణ భాష సంస్కృత పదాలు చదువాలె. యమళం అముడాల ఎట్లయింది, యాత్రను జాతరగ ఎట్ల మార్చుకున్నరు, బృహస్పతి వారానికి బేస్తవారపు రూపు ఎట్లా సిద్ధించింది, గ్రహచారం గాశారంగ ఎట్లా రూపొందిందనే విషయాలను, ప్రజలకు వశీకృతమైన సంస్కృతం రీతిని చెలిమె సల్లినట్టుగ చెప్తరు భాస్కర్ సారు.



- బూర్ల వేంకటేశ్వర్లు,
9491598040

ఆడిబిడ్డను తోల్కచ్చుడు, పిల్లను తోల్కపోవుడు అనే మాటలు విని గుసగుసలు పెట్టినోళ్లకు జవాబులు కావాలె. ఏది చేసినా కాళ్లల్ల కట్టెలు పెట్టెటోళ్లకు నిదానంగ చిలుకకు చెప్పినట్టు చెప్పాలె. తెలంగాణ క్రియ ఎన్నెన్ని పోకడలు పోయిందో చెవులిల్లుగట్టుకొని వినిపియ్యాలె. దీనికోసం తెలంగాణ భాష క్రియా పదాలు పుస్తకం తెచ్చి పదాల పండ్ల గంపను ముంగట పెట్టిండు నలిమెల. ఇట్ల, తెలంగాణ పద సంపదను పదకోశంగ వేసి, ప్రాచీన, ద్రావిడ, ప్రత్యేక లక్షణాల సంగతిని విప్పి చెప్పిండ్రు. వాక్య రీతి, నుడికారపు తీరు, పద సంపద విశిష్టతలను పొరలు పొరలుగ విప్పి తెలియజేసిండ్రు. ప్రజల భాష లక్ష్యంగ చేసుకొని లక్షణాలు కనిపెట్టి తెలంగాణ పలుకుకు గౌరవం కలిపించిండ్రు నలిమెల భాస్కర్ సారు.

ఎప్పుడైనా, భాష సమాజపు ఆస్తి. అవసరాన్ని బట్టి ఆ సంపదను పెంచే పదాలను ప్రజలు కల్పించుకుంటరు. వాళ్ళు విన్న దాన్ని, చూసిందాన్ని, అనుకున్నదాన్ని బట్టి వ్యవహారంల పదాలు తయారైతయి. గాలిలో తిరిగే మోటరు 'గాలి మోటరు' అని కొందరు అంటరు. పైన కనిపించేది కనుక 'మీది మోటరు' అని ఇంకొందరు అంటరు. 'కుట్ కుట్' మని చప్పుడు చేస్తే అది గుడు గుడు మోటరు అయింది. ప్రజల వాడుకల గుడు గుడు తారుమారై డుగ్గు డుగ్గు కూడ అయితది. 'ప్రవాహినీ దేశ్యా' అన్నది ఇందుకే. పలుకు ప్రవాహంలో ఎన్నెన్నో రూపాలను పొందుతది. గంగల రాళ్లు కరిగి నున్నగ అయినట్టు, మాటలు తీరు తీరు రూపాలల్ల ఉంటయి. ఇటువంటి రూపాలు తరతరాలుగ ప్రజల నోళ్లల్ల నానీ నానీ నాజూకు అయితయి, ఎన్నడు విననోళ్లకు మోటుగ కూడ అనిపిస్తయి. మరి ప్రజల మాటకు విలువ ఉన్నదా! లేదా! అవి గాలిలకెల్లి ఊసిపడ్డయా! నోటినుంచే కద!

ఇటువంటి నుడికారపు తీరును, సహజత్వాన్ని, సరళత్వాన్ని కాపాడుకోవాలె. ఈ పని చేసే వాళ్ళే నిజమైన భాషావేత్తలు. ప్రజల నడుమ తిరిగి, సందర్భం చూసి, నేపథ్యం తెలిసి వాటిని వ్యాఖ్యానించుడే భాషా పండితులు చెయ్యాలె. ఇది అందరితోని అయ్యేది కాదు. ఏ శాస్త్రానికైన ముడి సరుకు అనుభవమో, ప్రయోగమో, ఫలితమో కావాలె. వాడుకను బట్టి సూత్రం తయారు కావాలె. సూత్రాన్ని చూపించి వాడుక సరిగ లేదనుడు మంచిది కాదు. వ్యాకరణ సూత్రాలు పట్టుకొని ఇది గ్రామ్యము, ఇది లక్షణ విరుద్ధము, ఇది వికృతము అనుడు ప్రజలను అవమానించుడే. ప్రజల భాష లక్ష్యంగా పనిచేసిన నలిమెల భాస్కర్ గారిని కాళోజీ అవార్డుతో సత్కరించుడు తెలంగాణ భాషకు పబ్బతివట్టినట్టు.

(కాళోజీ పురస్కారం అందుకుంటున్న సందర్భం)

మేఘ తత్త్వం



మేఘమేమీ ప్రేమ లేనిది కాదు
నువ్వు చూడాలే కాని మేఘానికి కళ్ళుంటాయి
చెవులుంటాయి, నోరుంటుంది
కృష్ణుడికిమల్లె నల్లనైన శరీరమూ వుంటుంది
అది అప్పుడప్పుడు పెరుగుతుంది
అప్పుడప్పుడు తగ్గుతుంది కూడా !
మేఘమేమీ ఊరికే కూర్చోదు
సూర్యునితో సయ్యాట లాడుతుంది
చంద్రునితో కథలు చెబుతుంది
చుక్కలు నా మిత్రులంటుంది
ఆకాశం నాకు దుప్పటంటుంది
మనుషులందరూ నా వాళ్ళేనని
చినుకులతో రాయబారమూ పంపుతుంది
మేఘం ఒక సోషలిస్టు
పేద ధనిక బేధం లేకుండా
అందరి తలలూ తడుపుతుంది
ప్రకృతికి పచ్చని చీర కట్టే మేఘం
తనలోని నీళ్లతో
కన్నీళ్లను తుడుద్దామనుకున్న మేఘం
ఇప్పుడెందుకో అలిగి కూర్చుంది
సమయపాలన పాటించనని మొండికేసింది
మీ పద్ధతి మారేదాకా కరగనని
భీష్మించుకుని కూర్చుంది
అయినా మేఘమేమీ కఠినమైంది కాదు
మేఘానిది తల్లి మనసు, తండ్రి బాధ్యత
నువ్వు మనసుతో పలకరించాలేగాని
అది కరగనంటుందా , వర్షించనంటుందా
తన బాధ్యతేదో నిర్వర్తించనంటుందా !

- ఎన్.నరేశ్ చారి, 9701334516

అక్టోబర్ 4,5 తేదీలలో యూత్ లిటరరీ ఫెస్ట్

తెలంగాణ సాహితి డివైఎఫ్ఐతో కలిసి 'యూత్ లిటరరీ ఫెస్ట్'ను అక్టోబర్ 4,5 తేదీలలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నాం. కథ, కవిత, నవల, విమర్శ, పాట అంశాలపై చర్చ, స్వీయ విశ్లేషణ వుంటుంది. 40 ఏండ్లలోపు రచయితలు పాల్గొంటారు. వర్తమాన కవిత్వం - తీరుతెన్నులపై యువ కవులతో చర్చ, పాటల రచయితలతో సంభాషణ... కవి సమ్మేళనం, 4వ తేదీ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ కార్యక్రమానికి డా॥ మామిడి హరికృష్ణ, డా॥ఏనుగు నరసింహారెడ్డి, డా॥ ఎస్.రఘు తదితరులు హాజరవుతారు. పాల్గొనువారు తమ పేర్లను నమోదు చేసుకోగలరు.


- కె.ఆనందాచారి, 8897765417

తెలంగాణ రచయిత సంఘం వార్షిక సాహిత్య సభలు

తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వార్షిక సభలు అక్టోబర్ 6వ తేదీ ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.30 వరకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతాయి. ఇందులో ఘనపరం దేవేందర్, డా॥నాళేశ్వరం శంకరం, డా॥పరాంకుశం వేణుగోపాలస్వామి, డా॥నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఆచార్య సూర్యాధనుంజయ్, కందుకూరిశ్రీరాములు, డా॥వి.శంకర్, కొత్త అనిల్‌కుమార్ తదితరులు పాల్గొంటారు. ఇదే సభలో కవిసమ్మేళనం కూడా వుంటుంది.

- నాళేశ్వరం శంకర్

అమ్మతనం



నిజంగా అమ్మతనం
అంత గొప్పదా..?
పేగు బంధం
ఏ ప్రాణికి లేదు?
మరి మనిషిగా
మనకెందుకీ తపన?
పండుటాకులు
నిశ్శబ్దంగా రాలినప్పుడు
కలిగే ఉదాశీనత
అమ్మ విషయంలో
ఎందుకు ఉండదు?
రాలే ముందు...
రాలేటప్పుడు... రాలిన తర్వాత...
అమ్మ మన గుండెకు
పరీక్ష పెడ్తున్నదా?
దిటవుకావడం ఇక నా
గుండెదే కదా బాధ్యత
పరిణామక్రమంలో
మరణం అనివార్యమైనా
మనిషి గుండెకు ఇది ఎప్పుడూ పరీక్షే
జయించడమే కోరుకుంటుంది అమ్మతనం

- శైలి, 9959745723

అభివృద్ధి అంటే బీఆర్ఎస్‌కు అంతచిన్నచూపా..

- చదువుకున్న సంస్కార హీనుడు కేటీఆర్ : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



నవతెలంగాణ -హన్మకొండ చౌరస్తా

అభివృద్ధి అనగానే బీఆర్ఎస్ వాళ్లకు లాగులు తడుస్తున్నాయని, చదువుకున్న సంస్కార హీనుడు కేటీఆర్ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. నయీమ్ బ్రిడ్జిపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించారు. ఆదివారం ఉదయం 10గంటలకు నయీమ్‌నగర్ బ్రిడ్జికి సంబంధించిన ఆధారాలతో సహా మీడియా ముందుకు వచ్చి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నయీమ్‌నగర్ బ్రిడ్జి నిర్మిస్తే తామే కట్టినట్టు బీఆర్ఎస్ వాళ్ల అనడం పట్ల కేటీఆర్ రాజకీయ వివేకానికి వదిలేస్తున్నామని అన్నారు. నయీమ్‌నగర్ పరిసర ప్రాంత ప్రజలను, వ్యాపార, వాణిజ్య శ్రేణులను అడగాలని, ఏ ఒక్కరైనా నయీమ్ నగర్ బ్రిడ్జి బీఆర్ఎస్ వాళ్ళు నిర్మించారని చెబితే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. దొంగ యూట్యూబ్ ఛానెల్‌తో పబ్బం గడిపే కేటీఆర్, బీఆర్ఎస్ వారు మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు లేదని హితవు పలికారు. బ్రిడ్జి నిర్మాణం మొదటి దశ నుంచి బీజేపీ పార్టీ కార్పొరేటర్, స్థానిక ప్రజలు ఉన్నారని, తాను, మేయర్, కలెక్టర్, కమిషనర్ ఇతర అధికారులంతా పర్యవేక్షించినట్టు గుర్తుచేశారు. జరుగుతున్న అభివృద్ధి జీర్ణించుకోలేక ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి చేయలేని దద్దమ్మలు హరీశ్‌రావు, కేటీఆర్ అని, వారు ఏనాడైనా స్వతంత్రంగా పోయి ముఖ్యమంత్రి నిధులు అడిగిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. కేటీఆర్ చేసే పనులకు కిల్ బిల్ పాండే బిరుదు సరిగ్గా సూట్ అవుతుందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకుని నయీమ్‌నగర్ బ్రిడ్జి నిర్మాణం ఎవరు చేపట్టారో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఫామ్‌హౌస్‌లు పోతున్నాయనే భయంతో హైడ్రాపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. సింగిల్ చెక్ ద్వారా రూ.45కోట్ల పై చిలుకు నిధులను కేటాయించి ఈ రోజు కాళోజీ కళాక్షేత్రం నిర్మించిన ఘనత తమదేనని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, రహీమున్నీసా బేగం, వీరమల్ల రంజిత్ రెడ్డి, మారుపాటి వంశి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా నిలబడతాం

- మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

ప్రజల జీవితాలతో అడుకుంటామంటే ఊరుకోమని, ఎవ్వరూ అధైర్యపడొద్దని అండగా నిలబడతామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో సద్దులచెర్వు ప్రాంత బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. ప్రాణం పోయినా ప్రజలకు అన్యాయం జరగనివ్వమని చెప్పారు. కేసీఆర్ అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ అరాచకాలు చేస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజలకు అండగా ఉంటే రేవంత్‌రెడ్డి జీవితాలతో అడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అభివృద్ధి నిర్మాణాలు చేస్తే కాంగ్రెస్ కూల్చివేతలు చేస్తుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాలు మరిచిన కాంగ్రెస్ అరాచకాలు చేస్తుంటే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రజలను కన్నీళ్లు పెట్టించడం సమాజానికి మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ వైస్‌చైర్మెన్ పుట్ట కిశోర్, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, అంగిరేకుల నాగార్జున, బత్తుల సురేష్, కౌన్సిలర్ తాహేర్, జీడిభిక్షం తదితరులు పాల్గొన్నారు.

తల్లిని చంపిన తనయుడు

- మద్యం మత్తులో దారుణం

నవతెలంగాణ - బోనకల్

మద్యం మత్తులో భార్యను కొడుతుండగా అడ్డొచ్చిన తల్లిని తనయుడు హత్య చేసిన ఘటన ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తాటికొండ పాపయ్య కూతురు మంజు ఇటీవల ప్రసవించింది. కాగా, శనివారం మంజుకి 21వ రోజును పాపయ్య కుటుంబ సభ్యులు జరిపారు. ఈ సమయంలో పాపయ్య మద్యం మత్తులో ఉన్నాడు. రాత్రి పది గంటల సమయంలో భార్య మణితో గొడవ పడి కొట్టాడు. దాంతో అతని తల్లి మార్తమ్మ (70) కోడలిని కొట్టొద్దని అడ్డుపోయింది. మద్యం మత్తులో మరింత రెచ్చిపోయిన పాపయ్య.. తల్లి గొంతు పట్టి గోడకి అదిమి పైకి లేపాడు. ఆ వెంటనే కింద పడేసి కొట్టాడు. ఆ సమయంలో అడ్డువచ్చిన కుమారుడిని, భార్యను కూడా కొట్టాడు. దాంతో వారు భయంతో దూరంగా ఉండిపోయారు. ఓ అర్ధగంట అనంతరం మార్తమ్మ దగ్గరికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉంది. వెంటనే ఆర్ఎంపీని పిలిపించి పరీక్షించగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు గుర్తించారు. ఆ తర్వాత పాపయ్య స్వయంగా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి తన తల్లిని తన కుమారుడు, భార్య హత్య చేశారని తనకు రక్షణ కావాలని ఫోన్ చేశాడు. వెంటనే స్పందించిన బోనకల్ ఎస్ఐ కడగండ్ల మధుబాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె శాంతి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పాపయ్యపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కొడగండ్ల మధుబాబు తెలిపారు.పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బ్రాహ్మణపల్లి తీసుకువచ్చారు. అయితే పాపయ్య పోలీసుల అదుపులోనే ఉన్నాడు. తల్లికి తలకొరివి పెట్టవలసి రావటంతో పోలీసుల బందోబస్తు మధ్యనే ఆదివారం బ్రాహ్మణపల్లిలో తల్లికి తలకొరివి పెట్టాడు.

వ్యక్తి ఆత్మహత్య

- లోన్ యాప్‌లో అప్పులు.. వేధింపులు తీర్చలేకనే దారుణం


నవతెలంగాణ-ఎల్కతుర్తి

లోన్‌యాప్ ద్వారా అప్పులు చేసి, వాటిని తీర్చకపోవడంతో నిర్వాహకుల వేధింపులు భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హన్మకొండ జిల్లా భీమదేవపల్లి మండలం మల్లునూరు గ్రామంలో జరిగింది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాదుగుల అనిల్(29) డిగ్రీ చదివి నిరుద్యోగిగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఉపాధి కోసం వివిధ రకాల యాప్‌లు, బ్యాంకుల ద్వారా సుమారు రూ.9లక్షలు అప్పు చేసి టాటా ఏసీ ఆటో ద్వారా బీమారంలో మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభించాడు. ఈ క్రమంలో టిఫిన్ సెంటర్ పర్వాలేదు అనిపించినా.. తర్వాత క్రమక్రమంగా నష్టాలు రావడంతో ఆ వ్యాపారం మానేసి ఇంటి వద్దనే ఉండేవాడు. అనంతరం రెండు నెలల క్రితం మరింత అప్పుచేసి మల్కనూర్‌లో అమరవీరుల స్తూపం వద్ద ఫాస్ట్ ఫుడ్ సెంటర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇక్కడ కూడా షాప్ నడవకపోవడంతో అప్పులు చెల్లించడానికి ఫోన్‌లో ఉన్న వివిధ యాప్‌ల ద్వారా అప్పు తీసుకున్నాడు. దాంతో వాటిని తీర్చమని లోన్ యాప్ నిర్వాహకులు వేధించడంతో భరించకలేక ఈ నెల 28న రాత్రి రైతు వేదిక వద్ద ఉన్న క్రీడా ప్రాంగణంలో పురుగుల మందు తాగి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన అక్కడి చేరుకున్న వారు అపస్మారక స్థితిలో ఉన్న అనిల్‌ను.. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతుని తల్లి వినోద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబా తెలిపారు.

ఆరు వేల వేతనంతో ఎలా బతుకుతారు?

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాల్సిందే

- వారి పోరాటానికి అండగా ఉంటాం.. అవసరమైతే జైలుకైనా వెళ్తాం : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- ఆర్పీలకు జీవో 60 ప్రకారం కనీస వేతనాలివ్వాల్సిందే : ఎస్వీ రమ
- సీఐటీయూలో విలీనమైన తెలంగాణ మెప్మా ఆర్పీల యూనియన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ప్రధాని మోడీ.. సీఎం రేవంత్‌రెడ్డీ మిమ్మల్ని ఒక్కటే మాట అడుగుతున్న. మెప్మా ఆర్పీలు రూ.6 వేల వేతనంతో ఎలా బతకాలో మీరే చెప్పండి. స్కిల్డ్ కార్మికులకు ఇంత తక్కువ వేతనమా? ఇది దుర్మార్గం. మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాల్సిందే. కనీస వేతనం, పనిగంటలు, ఇతర కనీస సౌకర్యాల కోసం ఐక్య పోరాటాలకు సన్నద్ధమవుతున్న మెప్మా ఆర్పీలకు సీఐటీయూ అండగా ఉంటుంది. వారు ఒక్కడు ముందుకొస్తే మేం మూడు అడుగులు ముందుకేయడానికి సిద్ధంగా ఉన్నాం. కేసులైనా ఎదుర్కొంటాం. వారి హక్కుల కోసం అవసరమైతే జైలుకైనా వెళ్తాం' అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీఆర్ఎస్‌కేవీకి అనుబంధంగా ఉన్న తెలంగాణ మెప్మా ఆర్పీల యూనియన్ సీఐటీయూలో విలీనమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో భాస్కర్ మాట్లాడుతూ.. సీఐటీయూలో విలీనం కావడాన్ని స్వాగతించారు. ఏ ఉద్యోగికైనా నిర్దిష్ట పనిగంటలుంటాయనీ, ఆర్పీలకు పనిగంటలు లేకుండా, సెలవులు ఇవ్వకుండా పనిచేయించడం దారుణమని విమర్శించారు. నెలకు ఒకరోజే సెలవు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ఆరు వేల వేతనమిచ్చి వారితో గొడ్డుచాకిరీ చేయించడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26 వేల వేతనం ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వస్తున్నదనీ, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ కనీస వేతనాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు చెబుతున్నదని గుర్తుచేశారు. అలాంటప్పుడు మెప్మా ఆర్పీలకు కనీస వేతనం ఎందుకు ఇవ్వరని నిలదీశారు. జీవో నెంబర్ 60 ప్రకారం వారికి కనీస వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆర్పీలు చేసే పోరాటాలకు సీఐటీయూ అండగా ఉంటుందని ప్రకటించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రోజుకు రూ.178 వేతనం సరిపోతుందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెబుతున్నదనీ, అలాంటి బీజేపీ ఆర్పీలకు ఎలా న్యాయం చేస్తుందని నిలదీశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ మాట్లాడుతూ.. స్కిల్డ్ కేటగిరీకి చెందిన ఆర్పీలకు కనీసం రూ.19 వేల వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగభద్రత, జాబ్‌చార్టును నిర్ణయించడం, కనీస వేతనం అమలు, రూ.10 లక్షల బీమా, డ్రెస్‌కోడ్ తదితర డిమాండ్ల కోసం మెప్మా ఆర్పీలు దశలవారీగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ధర్నా కూడా చేస్తామన్నారు. ఆర్పీలంతా ఐక్యంగా పోరాటాలు చేస్తేనే అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్నభోజన కార్మికుల మాదిరిగా కనీస హక్కులు సాధించుకోగలుగుతారని స్పష్టం చేశారు. తెలంగాణ మెప్మా ఆర్పీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె.చంద్రకళ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవతి, రాష్ట్ర నాయకులు ఎ.పద్మ, కె.పద్మ, బాలమ్మ, మంజూల, శోభన, సుభద్ర, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

యెమెన్‌పై ఇజ్రాయిల్ దాడులు

సనా : గాజాలో మొదలు పెట్టి లెబనాన్, సిరియా, ఇరాక్‌కు దాడులను విస్తరింపజేస్తున్న యూదు దురహంకార ఇజ్రాయిల్ తాజాగా యెమెన్‌పై విరుచుకుపడింది. గత రెండు రోజులుగా హౌతీలు ఇజ్రాయిల్‌పై క్షిపణులను ప్రయోగిస్తున్నారన్న సాకుతో నెతన్యాహు ఆ దేశంపై దాడికి తెగబడ్డారు. పశ్చిమాసియా అంతటినీ యుద్ధంలోకి లాగాలని అమెరికాతో కలసి ఇజ్రాయిల్ యత్నిస్తున్నాయి. యుద్ధ విస్తరణకు ఇప్పటికే అనేక ఫ్రంట్‌లను తెరచిన ఇజ్రాయిల్ ఇప్పుడు యెమెన్‌ను కూడా యుద్ధంలోకి లాగుతోంది. డజన్ల కొద్దీ యుద్ధ విమానాలు హౌతీల స్థావరాలే లక్ష్యంగా ఆదివారం దాడి చేశాయని ఇజ్రాయిల్ మిలటరీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్ ఇసా, హోదీదా ఓడరేవులపైన, విద్యుత్ కేంద్రాలపైన బాంబుల వర్షం కురిపించి భీతావహమైన పరిస్థితిని సృష్టించింది.

సాంకేతిక అభివృద్ధిని రైతులకు అందించాలి

- పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి : తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ప్రొఫెసర్ నరసింహారెడ్డి



నవతెలంగాణ-మియాపూర్

పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతులకు సాంకేతిక అభివృద్ధిని అందించాలని తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ప్రొఫెసర్ నరసింహారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'భారతదేశంలో సమకాలీన వ్యవసాయ పరిస్థితి- సమస్యలు, పరిష్కారాలు -వ్యవసాయ ఆర్థిక విశ్లేషణ' అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఆహార సమస్య, రైతుల దుస్థితికి గల కారణాలను సువివరంగా వివరించారు. దేశంలో ఈనాటికీ అధిక శాతం సాగు ధనిక, మధ్య తరగతి రైతుల మధ్యే ఉందని, 85 శాతంగా ఉన్న చిన్న, సన్న రైతులు, వ్యవసాయ కూలీలకు తక్కువ భూమి ఉందన్నారు. రైతు పండించిన పంటలకు న్యాయంగా రావాల్సిన ఆదాయం దక్కకపోవడమే రైతు ఆత్మహత్యలకు కారణమని తెలిపారు. చిన్న రైతులకు అనుకూలంగా రుణ, మార్కెటింగ్, రీసెర్చ్ విధానాలను ప్రభుత్వాలు రూపొందించాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయంలోకి కార్పొరేట్ కంపెనీల ప్రవేశాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా మూడేండ్ల క్రితం జరిపిన వీరోచిత పోరాటాన్ని పేర్కొంటూ.రైతాంగం ఐక్యంగా కార్పొరేట్లకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధరలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సు కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలతో ఒక మెమోరాండంను రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శరత్‌బాబు మాట్లాడుతూ.. దేశంలోని వృక్ష, జన్యు సంపద, దేశంలో వంగడాల రూపకల్పనకు కాకుండా అదానీ, రాందేవ్ బాబా పతాంజలి వంటి కంపెనీలు ఎలా మోసగిస్తున్నారో వివరించారు. దేశ వృక్ష, జన్యు సంపదను పరిరక్షించుకోవాలని కోరారు. హైదరాబాద్ యూనివర్సిటీ ఆర్థికవేత్త ప్రొఫెసర్ నరేశ్ శర్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతోందని, గ్రామాలు, పట్టణాల మధ్య అభివృద్ధి వ్యత్యాసాలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అరిబండి ప్రసాదరావు, సహకార వ్యవసాయ సంఘాల ఉద్యమ నేత నైనాని గోవర్ధన్, కిసాన్ సభ నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రభు లింగం, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దర్శినిలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత టూర్

- మార్గదర్శకాల విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టూరిజం ప్రమోషన్లో భాగంగా ఏర్పాటు చేసిన తెలంగాణ దర్శిని టూర్ ప్రోగ్రామ్‌లో లక్ష మంది విద్యార్థులను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 280ని టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఆదివారం జారీ చేశారు. రెండవ తరగతి నుంచి డిగ్రీ, ఆపై చదివే విద్యార్థులు పర్యాటక టూర్‌కు అర్హులు. ఇందులో విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరిలో 2నుంచి 4వతరగతి విద్యార్థులు (డేట్రిప్), రెండవ కేటగిరీలో 5 నుంచి 8వతరగతి విద్యార్థులు (20 నుంచి 30 కిలోమీటర్లు, సొంత జిల్లాలో (డేట్రిప్), మూడవ కేటగిరీలో 9 నుంచి ఇంటర్ విద్యార్థులు (50 నుంచి 70 కిలోమీటర్లు రెండు రోజులు), నాల్గవ కేటగిరీలో డిగ్రీ అపై విద్యార్థులు, రాష్ట్రంలో ఎక్కడికైనా,నాలుగు రోజులు) ఉచితంగా వెళ్లడానికి టూర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. కేటగిరీల వారీగా వరుసగా రూ.300, రూ.800, రూ.2,000, రూ.4,000 వ్యయం అవుతుందని ఖరారు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎన్విరాల్‌మెంట్ ఫారెస్ట్ సైన్స్ లేదా ఇతర సంస్థలు విద్యార్థుల వ్యయాన్ని భరించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి నోడల్ అధికారులను ఏర్పాటు చేయనున్నారు. రవాణా, విద్యార్థుల భద్రత, ఇతర అంశాలకు సంబంధించిన ఏర్పాట్లను ఉపాధ్యాయులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల మార్గదర్శకత్వంలో చూసుకోవాలని సూచించారు. తెలంగాణ దర్శిని కార్యక్రమానికి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

హైడ్రా వేరు.. మూసీ ప్రక్షాళన వేరు..

- నిర్వాసితులను లాఠీలతో అణిచి వేసింది గత ప్రభుత్వం
- మేము బాధితులను సమన్వయ పరుస్తున్నాం : బీసీ సంక్షేమ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవ తెలంగాణ - సిద్దిపేట

హైడ్రా వేరు.. మూసీ ప్రక్షాళన వేరని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో పదవీ విరమణ ఫంక్షన్‌కి హాజరైన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. మూసీ కాల్వ ఇరు వైపులా నివాసం ఉన్న వారిని బలవంతంగా ఖాళీ చేయించడం లేదని, అలా ప్రచారం చేయడం సరికాదని బీఆర్ఎస్‌కు సూచించారు. మూసీ బాధితుల పట్ల ప్రతిపక్షాలు, హరీశ్‌రావు లాంటి నాయకులు రాజకీయం చేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదన్నారు. మూసీ బాధితులకు ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఇచ్చి, వారి పిల్లలకు విద్య అందించి ఆదుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు నమ్మవద్దని, హైదరాబాద్ తెలంగాణకు గుండె కాయలాంటిదన్నారు. హైదరాబాద్‌లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాలే కృష్ణ, గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించి ప్రజలకు తాగునీరు ఇచ్చాయని గుర్తుచేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వర్షాలు వస్తే హైదరాబాద్‌లో నాళాలు మునిగి, ప్రజలు అష్టకష్టాలు పడ్డారని తెలిపారు. మూసీని మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, గోదావరి జలాలతో నింపుతామన్నారు. రాష్ట్రంలో హైడ్రాను స్వాగతిస్తున్నారన్నారు. రాబోయే కాలంలో అన్ని చెరువులను రక్షిస్తామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే చర్చల ద్వారా పరిష్కారం చేద్దామని, ఇది కాంగ్రెస్ నాయకుల తీరు అని అన్నారు.

లాఠీలతో అణచివేసిన గత ప్రభుత్వం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్న సాగర్, గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులను లాఠీలతో అణిచి వేసి, కాల్పులు జరిపిందని మంత్రి గుర్తు చేశారు. మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రి ఇండ్ల నుంచి ఖాళీ చేయించారని, కానీ మేము బాధితులను సమన్వయ పరుస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన లాఠీచార్జి వీడియోను ఈ సందర్భంగా విలేకరులకు చూపించారు. నేడు కరీంనగర్‌లో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులు ప్రారంభం చేశామని తెలిపారు. గత ప్రభుత్వంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సమస్యలపై నిరసన తెలిపే అవకాశం కూడా ఇవ్వలేదని, కానీ వారికి మాట్లాడే అవకాశం ఇచ్చామన్నారు. అధికారం లేదని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజలా హరికృష్ణ, దరిపల్లి చంద్రం, అత్తూ, యాదగిరి, లక్ష్మి, ఆనంద్, రియాజ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడికి కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామంలో పుష్పన్‌కు అంత్యక్రియలు



తలస్సేరి : ఉద్యమంలో తుపాకీ తూటాలు తగలడంతో మూడు దశాబ్దాలుగా మంచానికే పరిమితమైనా పోరాట పథాన్ని వీడని పుష్పన్ (54)కు వేలాదిమంది కన్నీటి వీడ్కోలు పలికారు. ఇటీవల అస్వస్థతకు గురైన ఆయన కేరళలోని కోజికోడ్ బేబీ మెమోరియల్ ఆస్పత్రిలో శనివారం తుదిశ్వాస విడిచారు. పుష్పన్ భౌతికకాయానికి ఆదివారం సాయంత్రం స్వగ్రామం చోక్లి మేనప్రారంలో అంత్యక్రియలు నిర్వహించారు. 1994 నవంబర్ 25న యుడిఎఫ్ ప్రభుత్వ అవినీతి, విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా కూతుపరంబలో అప్పటి మంత్రి ఎంవి రాఘవన్‌కు నల్లజెండా చూపి, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన పోరాడారు. పోలీసు కాల్పుల్లో కెకె రాజీవన్, కెవి రోషన్, శిబులాల్, బాబు, మధు ప్రాణాలు కోల్పోయారు. బుల్లెట్ తగలడంలో 24 ఏళ్ల పుష్పన్ వెన్నుపాము దెబ్బతింది. అప్పటి నుంచి చికిత్స పొందుతూనే సమకాలీన రాజకీయ, సామాజిక పరిణామాలపై స్పందించేవారు. కోజికోడ్ బేబీ మెమోరియల్ ఆస్పత్రి నుంచి ఆయన భౌతిక కాయాన్ని శనివారం సాయంత్రం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యాలయం యూత్ సెంటర్‌కు తీసుకొచ్చారు. ఆదివారం కోజికోడ్ నుంచి కన్నూరుకు, ఆ తరువాత ఆయన స్వగ్రామం చొక్లీకి తరలించారు. దారిపొడవునా వేలాదిమంది సిపిఎం, వామపక్ష నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు.

నేపాల్ లో వరద బీభత్సం

148 మంది మృతి

ఖాట్మండూ (నేపాల్) : నేపాల్‌లో వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. కుండపోతగా కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగిపడడం, వాగులు వంకలు పొంగి పొర్లడంతో ఇప్పటివరకు 148 మంది చనిపోయారు. 59 మంది గల్లంతయ్యారు. పదకొండు జల విద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతినిపోయాయి. విద్యుత్ ప్రాజెక్టులకు జరిగిన నష్టం 245 కోట్ల దాకా ఉంటుందని ప్రాథమిక అంచనా. ఇది కాకుండా ఆస్తినష్టం కూడా పెద్దయెత్తున ఉన్నట్టు నేపాల్ విద్యుత్ శాఖ మంత్రి దీపక్ ఖద్కా తెలిపారు.కొండచరియలు విరిగి పడడం వల్ల పలు చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది.

మంత్రి ఉత్తమ్‌కు పితృవియోగం

- మహాప్రస్థానంలో అంత్యక్రియలు
- హాజరైన సీఎం, ఇతర మంత్రులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి (81) మరణించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన శనివారం తుదిశ్వాస విడిచారు. ఆదివారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరిగాయి. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సహా పలువురు మంత్రులు అంత్యక్రియలకు హాజరయ్యారు. సంతాపాలు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు సంతాపం తెలిపి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇజ్రాయిల్ దాష్టీకంపై ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

సిరియాపై దాడికి దిగాడు. దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చేందుకు అమెరికా మద్దతుతో నెతన్యాహు ప్రయత్నిస్తున్నాడు. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దురాక్రమణపూరిత దాడులు, హిజ్బుల్లా చీఫ్ హత్యను అరబ్బు దేశాలతో బాటు చైనా, రష్యా, క్యూబా, వెనిజులా, అర్జెంటీనా, కొలంబియా, దక్షిణాఫ్రికా తదితర దేశాలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా మాత్రం ఇది ఉగ్రవాదుల చేతిలో బలైన వేలాది మంది అమాయక పౌరులకు చేకూరిన న్యాయం అని అభివర్ణించింది. అమెరికా మిత్ర దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు సైతం ఈ దాడుల తాలూకు పర్యవసానాల గురించి ఆందోళన వ్యక్తం చేశాయి. నస్రల్లా హత్యను పిరికిపంద, ఉగ్రవాద చర్య అని హమాస్ ఖండించింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దురాగతాలకు ప్రతిఘటన కొనసాగుతుందని స్పష్టం చేసింది. బీరుట్‌లో గత 24 గంటల్లో చోటు చేసుకున్న పరిణామాల పట్ల ఐరాస చీఫ్ అంటోని గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. జాత్యహంకారంతో ఇతరులపై దాడి చేసే ఇటువంటి చర్యలను తాము చూస్తూ ఊరుకోబోమని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమాఫోసా ఇజ్రాయిల్‌ను హెచ్చరించారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మాట్లాడుతూ లెబనాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే ఏ చర్యనైనా తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. పశ్చిమాసియాలో పరిణామాలకు ఇజ్రాయిలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు తగ్గేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇజ్రాయిల్ పాశవిక దాడులు పశ్చిమాసియా ప్రాంత భద్రతకే కాదు, ప్రపంచ శాంతికి, భద్రతకు పెను ముప్పు అని క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ ఆందోళన వ్యక్తం చేశారు. లెబనాన్‌పై మిలిటరీ చర్యను పశ్చిమాసియాలో పూర్తి స్థాయి యుద్ధానికి దారి తీసేలా ఉందని రష్యా విదేంగ మంత్రి లావ్రోవ్ హెచ్చరించారు. లెబనాన్‌పై దాడిని సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్,యెమెన్ వంటి అరబ్బు దేశాలు ఖండించాయి. తక్షణమే దాడులను విరమించాలని ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, అర్జెంటీనా కోరాయి.

మరో హిజ్బుల్లా నేత నబిల్ కౌక్ హత్య

నస్రల్లా వారసుడిగా సఫీద్

దక్షిణ బీరుట్ పై ఇజ్రాయిల్ సైన్యం శనివారం జరిపిన క్రూరమైన దాడుల్లో హిజ్బుల్లాకు చెందిన మరో కీలక నేత నబిల్ కౌక్ మరణించాడు. హిజ్బుల్లా సెంట్రల్ కౌన్సిల్ అధిపతిగా ఉన్న కమాండర్ నబిల్ హత్యతో హిజ్బుల్లా ప్రధాన నాయకత్వాన్నంతటినీ అంతమొందించామని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. దీనికి ప్రతీకారం తప్పదని హిజ్బుల్లా సంస్థ హెచ్చరించింది. నస్రల్ హత్య హిజ్బుల్లా చరిత్రలోనే అతిపెద్ద దెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు. దీని నుంచి కోలుకునేందుకు నస్రల్లా స్థానంలో ఆతని బంధువు, హిజ్బుల్లా రాజకీయ విభాగం అధిపతిగా ఉన్న సఫీద్ నియమితులయ్యారు. 1964లో దక్షిణ లెబనాన్‌లో డెయిర్ కాన్సుల్‌లో జన్మించిన సఫీద్ ఆరేళ్ల క్రితం అమెరికా దాడి చేసి చంపిన ఇరాన్ మిలిటరీ చీఫ్ సులేమాన్‌కు మామ కూడా.

ముకేశ్‌కు కలిసొచ్చిన మోడీ పాలన

(మొదటిపేజీ తరువాయి)

ఆకాశం వైపే చూసింది. వ్యూహాత్మక పెట్టుబడులతో ముందుకెళ్లాడు. దీంతో ఆయన సంపద పెరుగుదల అలాగే కొనసాగింది. ముఖ్యంగా, డిజిటల్ విభాగం నుంచి రిలయన్స్‌కు గణనీయమైన ఊపును తీసుకొచ్చింది. ఫేస్‌బుక్, గూగుల్ వంటి దిగ్గజ టెక్ కంపెనీల నుంచి వందల కోట్ల పెట్టుబడులను ఇది ఆకర్షించింది. అంబానీ సంపద పెరగటానికి కీలకమైనవాటిలో ఒకటి జియో నెట్‌వర్క్. కేంద్రం ప్రభుత్వ రంగ నెట్‌వర్క్ అయిన బీఎస్ఎన్ఎల్‌ను పట్టించుకోకపోవటం, డిజిటల్ వైపు ఎక్కువగా అవకాశాలు కల్పించటం ముకేశ్‌కు కలిసి వచ్చిందని నిపుణులు అంటారు. దీంతో అప్పటి వరకు ఈ రంగంలో ఏకఛత్రాధిపత్యాన్ని ప్రదర్శించిన ఇతర మొబైల్ నెట్‌వర్క్‌లను నెట్టేసి జియో ముందుకు వచ్చింది. ఇందుకు మోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు చేయూత చాలానే ఉన్నదని కొందరి మార్కెట్ నిపుణుల వాదన. ప్రస్తుతం ముకేశ్ అంబానీ నికర విలువ 116.7 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అంటే, భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.9.7 లక్షల కోట్లకు సమానం. భారత్‌లో సంపద అసమానతలు భారీగా కలిగి ఉన్నాయని పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు విశ్లేషిస్తున్నాయి. అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తల ఆస్తులు పెరగటం, పేద, మధ్య తరగతి వారు కనీసం అవసరాలకు సైతం నోచుకోలేకపోవటం వంటివి ఈ నివేదికల వాదనలకు బలాన్ని చేకూరుస్తున్నాయని సామాజికవేత్తలు, ఆర్థిక నిపుణులు అంటున్నారు.



ఏచూరి మరణం.. దేశ ప్రజలకు తీరని లోటు

- మతోన్మాద రాజకీయాలను సమర్థవంతంగా ఎదుర్కొన్న నాయకుడు
- ఇండియా కూటమిలో కీలకమైన పాత్ర
- సీతారాం ఆశయసాధనకు కృషిచేయడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ
- మాడ్గులలో సంతాప సభ

నవతెలంగాణ-మాడ్గుల

మతోన్మాదం పెరిగిపోతున్న ప్రస్తుత తరణంలో మతోన్మాద రాజకీయాల్ని సమర్థవంతంగా ఎదుర్కోగలిగిన మేధావి కామ్రేడ్ ఏచూరిని కోల్పోవడం దేశ ప్రజలకు తీరని లోటని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో మండల కమిటీ సభ్యులు పులికేంటి రమేష్ అధ్యక్షతన ఏచూరి సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న ప్రస్తుత సమయంలో వాటిని నిర్మూలించడం కోసం విప్లవోద్యమాన్ని ముందుకు నడిపించాల్సిన అనుభవం కలిగిన మార్క్సిస్టు నాయకుడిని కోల్పోవడం ఉద్యమానికి తీవ్ర నష్టమని అన్నారు. దేశంలోనేకాక, ప్రపంచంలోని అనేక దేశాలకు.. కమ్యూనిస్టు పార్టీలు ఎలా ముందుకెళ్లాలి, ఎలా పని చేయాలి అనే సూచనలు ఇచ్చిన ప్రపంచ మార్క్సిస్టు మేధావి ఏచూరి అని కొనియాడారు. అందుకే చైనా, వియత్నాం వంటి అనేక దేశాల నాయకులు తమ సంతాపాన్ని తెలియజేసినట్టు గుర్తు చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగుతుందని, తమను ఎవరూ ఓడించలేరని విర్రవీగుతున్న తరుణంలో 29 పార్టీలతో ఇండియా బ్లాక్‌ను ఏర్పాటు చేయడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. ప్రభుత్వాలను మార్చగలిగే శక్తి, వ్యూహాలు, ఎత్తుగడలు రచించడంలో ఏచూరి దిట్ట అని కొనియాడారు. విద్యార్థి దశలోనే ప్రపంచ స్థాయిలో ఏచూరి తన ప్రతిభను నిరూపించుకున్నట్టు చెప్పారు. మతమే ముఖ్యమని, హిందువుల రాజ్యం ముసుగులో భూస్వాములు, అగ్రవర్ణాల ఆధిపత్య దోపిడిని కొనసాగించడానికి బీజేపీ మతోన్మాద రాజకీయాలు కొనసాగిస్తున్నదని విమర్శించారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో లౌకిక శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం బూర్జువా పార్టీలు అధికారమే లక్ష్యంగా ప్రజలకు ఉచిత హామీలతో డబ్బులు పంచి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య, వైద్యం పూర్తిగా వ్యాపారంగా మారిందని, ఉద్యోగలు లేక నిరుద్యోగం పెరిగిపోయిందని, పేదలకు ఇండ్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల కుట్రలను పసిగట్టి ప్రజలు చైతన్యం కావాలని ఆకాంక్షించారు. ఇలాంటి తరుణంలో ఏచూరి ఆశయాలు కొనసాగించడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కందుకూరి జగన్, పి.అంజయ్య, మండల కమిటీ సభ్యులు ఎస్.కె నభి, అంజయ్య కాటంరాజు నరసింహ, సైదయ్య, శ్రీను, చిన్ని కృష్ణ, యాదగిరి, గణేష్, ముస్తఫా, పార్టీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి




నవతెలంగాణ-కందనూలు

మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా 3వ మహాసభలు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయ సమావేశం హాల్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు నిర్మల అధ్యక్షతన ప్రారంభమైన ఈ మహాసభలో ముందుగా ఐద్వా పతాకాన్ని జిల్లా సీనియర్ నాయకులు వెంకటమ్మ ఆవిష్కరించారు. అనంతరం సభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళల హక్కుల కోసం, రక్షణ కోసం కనీస వేతనం, కుటీర పరిశ్రమల కోసం, ఉపాధి కల్పన కోసం ఐక్యంగా మహిళలందరూ పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ప్రజల స్వేచ్ఛను హరిస్తున్నదని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు స్వతంత్రంగా ఎదిగేందుకు చైతన్యం కావాలని కోరారు. దేశంలో, రాష్ట్రంలో మహిళల సమస్యలపై పోరాటాలు చేస్తూ ఐద్వా వారికి అండగా నిలుస్తున్నదని తెలిపారు. మూడేండ్ల నుంచి జరిగిన కార్యక్రమాలను సమీక్ష చేసుకొని భవిష్యత్తు కార్యాచరణ చేపట్టేందుకు ఈ మహాసభను నిర్వహించుకుంటున్నామన్నారు. ఐద్వా పోరాటం వల్ల నిర్భయ చట్టం, లైంగిక వేధింపుల చట్టం, ఆస్తి హక్కుల చట్టం, 498 చట్టం సాధించామని తెలిపారు. ఈ చట్టాలను పక్కాగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ఉద్యమాలను ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కందికొండ గీత, ఉపాధ్యక్షులు వెంకటమ్మ, సునీత, శ్రీలక్ష్మి, దీప, సంధ్య ఈశ్వరమ్మ చెన్నమ్మ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక
- జేసీబీ, కారు అద్దాలు పగల గొట్టిన ఆందోళన కారులు
- నిందితుడిపై కేసు నమోదు



నవతెలంగాణ-కొముురవెల్లి

సిద్ధిపేట జిల్లా కొముురవెల్లి మండలం గురవన్నపేట గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఐదవ తరగతి చదువుతున్న 12 ఏండ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక పక్క ఇంట్లో నివాసముంటున్న యువకుడు.. ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడి బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కోపోద్రిక్తులైన గ్రామస్తులు ఒక్కసారిగా నిందితుని ఇంటిపై దాడికి పాల్పడ్డారు. వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామస్తులను అదుపు చేశారు. పరిస్థితి ఉధృతంగా మారడంతో గ్రామంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి.

ఇంకెంతకాలం డీఏల పెండింగ్?

2022, జులై నుంచి ఇవ్వని ప్రభుత్వం

- నివేదిక తెప్పించుకోవాలంటున్న సంఘాలు
- వివిధ రకాల బిల్లులను చెల్లించని సర్కారు
- ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ రద్దు చేయాల్సిందే



దసరా కానుకగా వస్తుందంటూ ఉద్యోగుల ఎదురుచూపు
పీఆర్సీ అమలుపైనా అస్పష్టత

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

'అధికారంలోకి వచ్చిన వెంటనే కరువు భత్యం (డీఏ) చెల్లిస్తాం. ఆర్నెళ్లలో ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి పీఆర్సీ అమలు చేస్తాం. నెలరోజుల్లోనే వివిధ రకాల పెండింగ్ బిల్లులను మంజూరుచేస్తాం'అంటూ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. డిసెంబర్ ఏడో తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఇప్పటి వరకు తొమ్మిది నెలలు గడిచిపోయింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి మార్చి నుంచి ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నది. అది తప్ప మిగతా సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. 2022, జులై నుంచి డీఏలు పెండింగ్‌లు ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో మూడు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండు డీఏలు కలిపి మొత్తం ఐదు డీఏలు విడుదల చేయాల్సి ఉన్నది. ఇంకోవైపు పీఆర్సీ అమలుపై స్పష్టత కరువైంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేస్తామంటూ హామీ ఇచ్చింది. దానిపైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి వివిధ రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు రూ.నాలుగు వేల కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. వాటి గురించి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో అసంతృప్తి పెరిగే అవకాశమున్నది. ఇంకెంతకాలం డీఏల పెండింగ్ అంటూ ప్రశ్నిస్తున్నారు. దసరా కానుకగా విడుదల చేయాలంటూ కోరుతున్నారు.

మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎంప్లాయీ ఫ్రెండ్లీ ప్రభుత్వమంటూ బీఆర్ఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించింది. 2022 జులై, 2023 జనవరి, జులైకి సంబంధించి మూడు డీఏలను చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024 జనవరి, జులై రెండు డీఏలు బకాయిలున్నాయి. ఐదు డీఏలను ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. ఇంకోవైపు బకాయిలు చెల్లించకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మరో రెండు డీఏలు విడుదల చేయలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదనీ, బీఆర్ఎస్ హయాంలో ఇష్టారాజ్యంగా అప్పులు చేయడం వల్ల తెలంగాణ దివాళా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలను ఉద్యోగులు, ఉపాధ్యాయులు విన్నారు. తొమ్మిది నెలలు గడిచినా డీఏలు, వివిధ రకాల పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోవడం వల్ల ప్రభుత్వంపై అసంతృప్తి పెరగడానికి దోహదపడుతున్నది. అధికారం లోకి వచ్చిన ఆర్నెళ్లలోపు పీఆర్సీని అమలు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తొమ్మిది నెలలు గడిచినా ఇంత వరకు నివేదికను కూడా తెప్పించుకోలేదు. పదో పీఆర్సీలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 27 శాతం ఐఆర్ ఇచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం 43 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది. తెలంగాణ మొదటి పీఆర్సీలో ఐఆర్ లేకుండానే 30 శాతం ఫిట్‌మెంట్‌ను ఇచ్చింది. గడువుకు ముందే పీఆర్సీ కమిటీని ప్రభుత్వం నియమించింది. అయితే ఐదు శాతం ఐఆర్‌ను ప్రకటించడం పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భగ్గుమ న్నారు. 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని అమలు చేయాలని కోరుతు న్నారు. సీపీఎస్ రద్దుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్తగా ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్)ను అమలు చేస్తామని ప్రకటిం చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఓపీఎస్‌ను అమలు చేస్తామని ఇంత వరకు ప్రకటించలేదు. దీంతో సీపీఎస్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 317 జీవో బాధితుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిం చింది. నివేదికను రూపొం దించలేదు. ఆ సమస్య ఎప్పుడు పరిష్కా రమవుతుందోనని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి : మారం జగదీశ్వర్, ఉద్యోగ జేఏసీ చైర్మెన్

పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలి. వాటి కోసం 2022, జులై నుంచి ఎదురుచూస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ప్రకటించాలి. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను కూడా చెల్లించాలి. ధరల పెరుగుదల ప్రకారం 51 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ నివేదికను తెప్పించుకుని అమలుకు చర్యలు వేగవంతం చేయాలి. ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను పటిష్టంగా అమలు చేయాలి సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి. 317 జీవో బాధితుల సమస్యను పరిష్కరించాలి. దసరా వరకు వేచిచూస్తాం. ఆ తర్వాత ఉద్యోగ జేఏసీ సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తుంది.

ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతుంది : చావ రవి, ఉద్యోగ జేఏసీ కో చైర్మెన్

రాష్ట్రంలో పది లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబాలున్నాయి. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయకుంటే వారిలో అసంతృప్తి పెరుగుతుంది. గత బీఆర్ఎస్‌కు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా లేదని భావించాల్సి వస్తుంది. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను మంజూరు చేయాలి. ఏండ్ల తరబడి డీఏలు, బిల్లులు పెండింగ్‌లో ఉంచడం ప్రభుత్వానికి మంచిది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో కొన్నింటిని అమలు చేస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగంలో, సమాజంలో ఉద్యోగులు కూడా భాగమే. వారికి ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం దృష్టిసారించాలి. ఉద్యోగులను సంతృప్తిపర్చాల్సిన బాధ్యత ఉన్నది. డీఏలు చెల్లించడం ప్రభుత్వాల బాధ్యత. రెండున్నర ఏండ్లుగా పెండింగ్‌లో ఉంచడం సరైంది కాదు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యోగ జేఏసీలో చర్చించి దసరా తర్వాత కార్యాచరణ ప్రకటిస్తాం.

కుల, మతాంతర వివాహాలు చట్టబద్ధమే

ప్రభుత్వం, పౌరసమాజం ప్రోత్సహించాలి



- ఆదర్శ దంపతులకు రూ.10 లక్షల ప్రోత్సాహం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి
- కేవీఎస్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు

నవతెలంగాణ-ముషీరాబాద్

కుల, మతాంతర వివాహాలు రాజ్యాంగబద్ధమేనని, ప్రభుత్వం, పౌర సమాజం.. అభ్యుదయ వివాహాలను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం (కేవీఎస్ఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. కేవీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. దశరథ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో రాధారాణి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ కేవలం మనదేశంలో మాత్రమే ఉందన్నారు. ఇది క్యాన్సర్, ఎయిడ్స్ జబ్బుల కంటే ప్రమాదకరమైనందని చెప్పారు. ఓ వైపు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుంటే.. మరోవైపు కులాల ఆధిపత్యంతో దాడులు, దౌర్జన్యాలు, కులదురహంకార హత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గాలను సహించకూడదన్నారు. కుల, మతాంతర వివాహాలు చేసుకున్న దంపతులు ఆర్థికంగా ఎదుగుతూ తమ అత్తామామ, తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుతూ సమాజంలో మిగతా వారికి ఆదర్శంగా నిలబడాలన్నారు. తమ పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కుల, మతాంతర వివాహాలు చేసుకున్న వాళ్ళందరూ ఐక్యమత్యంగా బంధువుల్లా కలిసి ఉండాలని సూచించారు. ఒంటరితనం, ఏదో తప్పు చేసిన మానసిక స్థితి నుంచి బయటపడాలని, నాటి సంఘసంస్కర్తలు అందరూ ఆదర్శ వివాహాలనే చేసుకున్నారని తెలిపారు.

రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. మనుధర్మ శాస్త్రం మనుషులను ముక్కలుగా చేసిందన్నారు. కుల, మతాల గీతలు గీసుకుని ప్రపంచాన్ని చూడలేక దేశం వెనుక పడుతుందన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టిన దేశాలు అభివృద్ధి చెందుతుంటే కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషల పేరు మీద మనుషుల చైతన్య స్థాయిని మరింత దిగజార్చుతున్నారని విమర్శించారు. వ్యవసాయంలో అనేక కులాలు, వృత్తులు సమిష్టిగా కృషి చేయడం ద్వారా దేశ ప్రజల కడుపులోకి నాలుగు మెతుకులు వెళ్తున్నాయని, ప్రకృతికి లేని కులం మనుషులకు అవసరం లేదన్నారు. ప్రజాశక్తి మాజీ సంపాదకులు, ఎస్వీకే కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ మాట్లాడుతూ.. కుల మతాంతర వివాహితుల ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, ఆదర్శ దంపతులకు రూ.10 లక్షల ప్రభుత్వ ప్రోత్సాహం ఇవ్వాలని, దంపతుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పిల్లల చదువులకు ప్రభుత్వం బాధ్యత వహించాలని తెలిపారు. కుల మతాంతర వివాహం చేసుకున్న దంపతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం చేపట్టబోయే కులగణనతో పాటు కుల, మతాంతర వివాహాల గణన కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు.

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. 2014 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 120 కులదురహంకార హత్యలు జరిగాయన్నారు. భావి యువతను అగ్రకులాధిపత్యం బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని ఖండించి నిందితులను శిక్షించాల్సిన పాలకులు వారికి అండగా నిలబడ్డారని తెలిపారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని, కుల నిర్మూలనకు బాటలు వేయాలని కోరారు. దశలవారీ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం జీవో నెంబర్ 12 ద్వారా రూ.2.50లక్షలు ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కానీ వాటికి బడ్జెట్ కేటాయించకపోవడంతో చాలా ఏండ్లుగా ఆ ప్రోత్సాహం అందటం లేదన్నారు. ఆ జీవోను సవరించి తాము పుట్టిన కులం గాకుండా వేరే ఏ కులాన్ని పెండ్లి చేసుకున్న రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ వహీద్, కార్యదర్శి కృష్ణచంద్, ఉపాధ్యక్షులు జ్యోతి, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరూరి కుమార్, ఎం ప్రకాష్ కరత్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉసిల్ల కుమార్, గంధం మనోహర్, బి సుబ్బారావు, కేవీపీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే సమాజ శ్రేయస్సుకు పునాది

(మొదటిపేజీ తరువాయి)

శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రత్యేక ఆకర్షణగా ఆరేండ్ల బాలిక

పింక్ పవర్ రన్‌లో ఆరేండ్ల బాలిక ఎస్.పార్వతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తల్లితండ్రులతో కలిసి పది కిలోమీటర్ల మారథాన్‌లో ఆ చిన్నారి పాల్గొంది. ఆ బాలికను సీఎం రేవంత్ రెడ్డి, ఎంఈఐఎల్, సుధారెడ్డి ఫౌండేషన్‌ల నిర్వాహకులు పీ.వీ.కృష్ణారెడ్డి, సుధారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ మారథాన్ పురుషుల విభాగంలో విజేతగా లవ్ ప్రీత్ నిలిచారు. మొదటి రన్నరప్‌గా మోహన్, ద్వితీయ రన్నరప్‌గా ఆరిష్ యాదవ్ నిలిచారు. మహిళల విభాగంలో సీమా, సంజీవని మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. 10 కి.మీ మారథాన్ విజేతకు రూ.2,50,000 నగదు, మొదటి రన్నరప్‌కి రూ.1,75,000, ద్వితీయ రన్నరప్‌కి రూ.1,00,000 రూపాయల నగదు పురస్కారం సీఎం రేవంత్ రెడ్డి అందజేసారు. 5 కిలోమీటర్ల మారథాన్ పరుగు పందెంలో పురుషుల విభాగంలో విజేతగా శంకర్ లాల్ , మొదటి రన్నరప్‌గా అఖిల్ కుమార్, ద్వితీయ రన్నరప్‌గా అమన్ కుమార్ నిలిచారు. మహిళల విభాగంలో విజేతగా ప్రీతి, మొదటి, ద్వితీయ రన్నరప్‌లుగా సోనిక, రీను నిలిచారు. 5 కి.మీ మారథాన్ విజేతకు రూ.1,25,000, మొదటి రన్నరప్‌కి లక్ష, ద్వితీయ రన్నరప్‌కి డెబ్బై ఐదు వేల రూపాయల నగదు పురస్కారం సీఎం రేవంత్ రెడ్డి అందించారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర శాప్ చైర్మెన్ శివసేన రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఉషాలక్ష్మి ఫౌండేషన్ చైర్మెన్ ఉషాలక్ష్మి, ప్రభుత్వ అధికారి క్రిస్టీనా తదితరులు పాల్గొన్నారు.

మారథాన్ ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ

మారథాన్‌ను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పీ.వీ.కృష్ణారెడ్డి, సుధారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. 3 విభాగాల్లో వేలాది మంది పాల్గొన్నారు. గచ్చిబౌలిలో ప్రారంభమైన మారథాన్లు ఐఎస్‌బీ, విప్రో జంక్షన్‌ల మీదుగా తిరిగి స్టేడియంకు చేరుకున్నాయి. ఇందులో భారీ సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొని క్యాన్సర్ మహమ్మారిని తరిమేసేందుకు ప్రతిజ్ఞ పూనారు. ఇందులో పాల్గొన్న ఔత్సాహికులకు ప్రత్యేక రేస్ కిట్లు, పోషకాహారం ఇవ్వడమే కాకుండా, రేస్‌కు ముందు, తర్వాత చేయాల్సిన వ్యాయమ చిట్కాలను నిర్వాహకులు సూచించారు.

ఆకట్టుకున్న పక్షి ఆకారం

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది పిల్లల నుంచి పెద్దల వరకు ప్రత్యేకమైన గులాబీ రంగు దుస్తులు ధరించి పక్షి రూపంలో భారీ మానవ హారంగా ఏర్పడి గిన్నీస్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నించారు. కన్నుల విందు కలిగించే ఈ పక్షి రూప మానవహారం, ఐక్యతా, ఆశ, బ్రెస్ట్ క్యాన్సర్‌పై పోరాడే నిబద్ధతకు ఒక సంకేతంగా సుధారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రామాన్ని వీక్షించిన సీఎం అందులో పాల్గొన్న వారిని, నిర్వాహకులను అభినందించారు. 'గిన్నీస్ వరల్డ్ రికార్డు ప్రయత్నంలో భాగంగా పక్షి రూపాన్ని ఎంచుకోవడం వెనుక లోతైన అర్థం ఉందని, సాధారణంగా పక్షి రెక్కలు, స్వేచ్ఛకు ప్రతీకగా భావిస్తారు. అదే స్వేచ్ఛ బ్రెస్ట్ కేన్సర్ జయించిన వారి పట్టుదల, బలాన్ని సూచిస్తుందని' సుధా రెడ్డి అన్నారు. ఈ పింక్ పవర్ రన్ ఆత్మన్యూనతాభావం అనే సంకెళ్ళను తొలగించుకుని అచంచలమైన విశ్వాసం అనే స్వేచ్ఛ వైపు పరుగులు పెట్టే మానవీయ ఘట్టంగా నిలిచిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించిన తెలంగాణ ప్రభుత్వం, ఒలెక్ట్రా, ఏఐజీ హాస్పిటల్, మారథాన్ రన్నర్స్‌కు సుధారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

ఆ దిశగా మెప్మాతో ప్రభుత్వ సంప్రదింపులు

- కొత్త వాటికి అనుగుణంగా ఖాళీల భర్తీ
- ఇప్పటికే కొనసాగుతున్న 3035 పోస్టుల నియామక ప్రక్రియ : రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- వచ్చే మార్చి నాటికి 500 బస్సుల కొనుగోలుకు కసరత్తు :టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్
- కరీంనగర్ రీజియన్‌లో 33 ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం



నవతెలంగాణ- కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకు మెప్మాతో సంప్రదింపులు చేస్తున్నామని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం వల్ల బస్సులకు విపరీతంగా డిమాండ్ పెరిగిందని, ఈ మేరకు రాష్ట్రంలో బస్సుల సంఖ్యనూ పెంచుతామని స్పష్టం చేశారు. కొత్త బస్సులకు అనుగుణంగా రవాణ సంస్థలో ఖాళీలను భర్తీ చేస్తామని, ఇప్పటికే 3035 పోస్టుల్లో నియామక ప్రక్రియ సాగుతుందని వివరించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా టీజీఆర్టీసీ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన ఎలక్ట్రిక్ బస్సులను కరీంనగర్ రీజియన్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సహా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పొన్నం ప్రసంగించారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులను కరీంనగర్‌కు కేటాయించినందుకు ఆర్టీసీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం 35 బస్సులు అందుబాటులోకి వచ్చాయని, త్వరలోనే మరో 39 ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ వాడకంలోకి తెస్తుందని తెలిపారు. రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్స్ ద్వారా కొత్త బస్సుల కొనుగోలుకు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేస్తోందని చెప్పారు. కాలుష్యరహిత సమాజం కోసం హైదరాబాద్ ఓఆర్‌ఆర్ లోపల ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల నేపథ్యంలో దశలవారీగా 2400 బస్సులను కొనుగోలు చేసేందుకు సంస్థ కసరత్తు చేస్తోందన్నారు. 2013 బాండ్లకు సంబంధించిన డబ్బును కండక్టర్లు, డ్రైవర్లకు సంస్థ చెల్లించిందని, మిగిలిన బకాయిలను దసరాలోగా మిగతా ఉద్యోగుల ఖాతాలో జమచేస్తామని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తోందని స్పష్టం చేశారు. టీజీఎస్‌ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి జిల్లాల్లో 500 ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. 300 రోజుల్లో మహిళలకు 92 కోట్ల జీరో టికెట్లను సంస్థ జారీ చేసిందని, ఫలితంగా రూ.3123 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, కరీంనగర్ మేయర్ సునీల్ రావు, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, మునిసిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి మంత్రి పొన్నం కొత్త బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీముని శేఖర్, సీఎంఈ వెంకన్న, కరీంనగర్ ఆర్‌ఎం సుచరిత, జేబీఎం ప్రతినిధి చందన్ మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

నిఘా

(మొదటిపేజీ తరువాయి)

తిప్పికొట్టటమే లక్ష్యంగా ఇది పని చేస్తున్నది. అంతేకాదు, 2019లో క్రాప్‌లైఫ్ సభ్యుల కోసం ఒక శిక్షణా కార్యక్రమాన్ని సైతం వి-ఫ్యూయెన్స్ ఏర్పాటు చేసింది. అలాగే, మూడేండ్ల తర్వాత 'ఇండియా కెమ్ 2021' కార్యక్రమాన్ని ఫిక్కీ నిర్వహించింది. ఇందులో రెండు కేంద్ర మంత్రిత్వ శాఖలు కూడా భాగమయ్యాయి. వి-ఫ్యూయెన్స్ అధ్యక్షుడిగా బైర్నె ఇందులో పాల్గొని మాట్లాడటం గమనార్హం.అయితే, వి-ఫ్యూయెన్స్ వ్యవస్థాపకులు బైర్నె.. తన నెట్‌వర్క్ వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా సేకరిస్తున్న ఆరోపణలపై స్పందించారు. ఇవి తప్పుదోవ పట్టించేలా ఉన్నాయనీ, పూర్తి అవాస్తవాలను తోసిపుచ్చారు. గతంలో యూఎస్ ప్రభుత్వ కాంట్రాక్టులను నిర్వహించిందన్న వాదనలను ఆ సంస్థ కొట్టిపారేసింది.

'సాహితీ' లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకున్న ఈడీ

- ప్రీలాంచ్ ఆఫర్లతో రూ.3 వేల కోట్ల స్కాం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో ప్రీలాంచ్ పేరిట భారీ మోసానికి పాల్పడిన సాహితీ సంస్థ యజమాని లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రీలాంచ్ స్కీం పేరిట దాదాపు రూ.3 వేల కోట్ల మేరకు పెట్టుబడులను సేకరించి, తర్వాత మోసానికి పాల్పడినట్టు గతంలో హైదరాబాద్ నగర నేర పరిశోధక విభాగం (సీసీఎస్)లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగానే ఈడీ అధికారులు సైతం తమ వైపు నుంచి దర్యాప్తును ప్రారంభించారు. మనీలాండరింగ్‌కు లక్ష్మీనారాయణ పాల్పడ్డారనే కోణంలో దర్యాప్తును ముందుకు సాగించిన ఈడీ అధికారులు.. ఆయనను అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నట్టు సమాచారం.

ఫైనాన్స్ కమీషన్ డైరెక్టర్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-హయత్ నగర్



ఫైనాన్స్ కమీషన్ డైరెక్టర్ మాలోతు నెహ్రు నాయక్‌ను ఆదివారం ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు రామావత్ జగన్ లాల్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. తర్వాత ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానుకోట మాజీ సర్పంచ్ భూక్యా నెహ్రు నాయక్, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మెన్ గాంధీ నాయక్, కార్యదర్శి చందు నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎం. శ్రీనివాస్ నాయక్, నేనావత్ శంకర్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సీనియర్ సిటిజన్స్

నవతెలంగాణ - వనస్థలిపురం





వనస్థలిపురం డివిజన్ పరిధిలోని అభ్యుదయనగర్ కాలనీలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో పుట్టినరోజు జరుపుకుంటున్న సుగుణమ్మ, శశికళలతో కేకు కట్ చేపించి, శాలువాలతో సన్మానించారు. ఈ పుట్టినరోజు కార్యక్రమాన్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ కాలనీ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటిపైకి బుల్డోజర్ వెళ్లాలంటే ముందు నన్ను దాటాలి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి





నవతెలంగాణ-ఎల్బీనగర్

ఇంటిపైకి బుల్డోజర్ వెళ్లాలంటే ముందు నన్ను దాటాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హైడ్రా కూల్చివేతలలో భాగంగా ఇటీవల అధికారులు చైతన్యపురి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మార్కింగ్ వేసి, ఆర్‌బీ అనే గుర్తు వేశారు. అంటే మూసీ నది బార్డర్ అని అర్థం వచ్చే విధంగా చేసిన నేపథ్యంలో చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలో స్థానిక ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీవాసులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అధికారులు ఎలాంటి మార్కింగులు వేసినా మీకు ఎలాంటి నష్టం జరగనివ్వనని సుధీర్ రెడ్డి కాలనీవాసులకు భరోసా, హామీ ఇచ్చారు. బుల్డోజర్లు రావాలంటే ముందు నన్ను దాటాలి అని అన్నారు. ప్రభుత్వం ఒక ప్రణాళికబద్ధంగా చేయాల్సింది పోయి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని, ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఏది ఏమైనా అన్ని పార్టీలను కలుపుకొని ముందుకెళ్తామని, ప్రజలకు ఎలాంటి నష్టం జరగనివ్వమని అన్నారు. ఈ పర్యటనలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, లింగాల రాహుల్ గౌడ్, తోట మహేష్ యాదవ్, సొంటి చంద్రశేఖర్ రెడ్డి, తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

నేను రైతు బిడ్డనే..
అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలి

- రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేను రైతు బిడ్డనే.. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయాలని నాదర్ రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి అధ్యక్షతన రైతులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు రుణమాఫీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారు కార్డు సక్రమంగా లేకపోవటం, ఇందుకు కారణమని చెప్పిటంతో రైతు రుణమాఫీ అమలు జరగటం లేదన్నారు. వ్యవసాయ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలు జరిగే వరకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. బ్యాంకు అభివృద్ధికి రైతులు తమ వంతుగా డిపాజిట్లు చేయాలన్నారు.ప్రస్తుతం రూ. 4కోట్లతో అభివృద్ధి బాటలో బ్యాంకు ముందుకు నడుస్తుందన్నారు. బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ బంగారు బాబు, మాజీ చైర్మెన్ పి.పుల్లారెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు ఎల్చల సుదర్శన్ రెడ్డి, మోహన్ రెడ్డి, తోట ప్రతాప్ రెడ్డి, కందాడి జ్యోతి, మేనేజర్ నారాయణరెడ్డి, సహకారం సంఘం నాయకులు అన్నపూర్ణ, సురేఖ, రైతులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో మూసీ ఒడ్డున నివసిస్తున్న
వృత్తిదారుల ఇండ్లను కూలిస్తే ఉద్యమిస్తాం



- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య

నవతెలంగాణ - ఎల్బీనగర్

దిల్‌సుఖ్‌నగర్ మూసీ నది ఒడ్డున అనేక ఏండ్ల నుంచి పేదలు, వివిధ వృత్తిదారులు గుడిసెలు వేసుకొని తలదాచుకుంటున్నారని వారిని అర్థాంతరంగా అక్కడి నుంచి ఖాళీ చేయాలని హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరికలు జారీ చేయడం తగదని తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇండ్లల్లో పనులు చేసుకుంటూ, ఇస్త్రీలు చేసుకుంటూ, ఇతర వృత్తి పనులు చేసుకుంటూ పొట్ట పోసుకునే వేలాదిమంది పేదలు మూసీ పరివాక ప్రాంతంలో గుడిసెలు వేసుకొని 40 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారని, వాళ్ళందరికీ వెంటనే ప్రత్యామ్నాయ పునరావాసం కల్పించాలని కోరారు. ఆర్థికంగా భరోసా ఇచ్చి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏకపక్షంగా కూలుస్తామని హైడ్రా మార్కింగ్ పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం అన్నారు. అదేవిధంగా మూసీ నదిలో ఏండ్ల నుంచి ఉన్నటువంటి ధోబి ఘాట్లకు తగిన భరోసా కల్పించి, వాటిని మోడ్రనైజ్ చేసి వృత్తిదారులకు ఉపాధి కల్పించే విధంగా చూడాలని కోరారు. వాటిని తొలగిస్తామనే ఆలోచనను అధికారులు విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా రజక వృత్తిదారుల సంఘం కార్యదర్శి సి.మల్లేష్, క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేశం, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వైద్య శిబిరం



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో ఉన్న వాసవి శ్రీ నిలయంలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్, వాసవీ శ్రీ నిలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి వాసవి గృహ సమూహంలోని దాదాపు 200 మంది వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చారు. వీరికి షుగర్, బీపీ, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, టుడిఈకో మొదలగు పరీక్షలను ఉచితంగా చేశారు. కార్డియాలజిస్ట్, అర్థోపెటిక్, జనరల్ మెడిసిన్ డాక్టర్ల పర్యవేక్షణలో కామినేని హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడారు. గుండె సంబంధ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రతిరోజు 30 నిమిషాలు తగ్గకుండా నడక, వ్యాయామం చేయాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో ఉప్పు, చక్కెరలను తక్కువగా వాడాలని సూచించారు. తాజా కూరగాయలు, పండ్లు, మొలకలను వాడాలని తెలియజేశారు. పొగ, ఆల్కహాలు, జంక్ ఫుడ్, ఆయిల్ వంటకాల జోలికి పోకూడదని సూచించారు. గుండె వద్ద, ఎడమచేతిలో నొప్పి, ఆయాసం, గుండె దడ, కాళ్ల వాపు, కళ్ళు తిరగటం, త్వరగా అలసిపోవడం, శరీరం చల్లబడటం మొదలగునవి ఇలాంటి సూచనలు ఉన్నప్పుడు వెంటనే గుండె సంబంధిత వైద్యుల్ని సంప్రదించాలని కోరారు. వాసవి శ్రీ నిలయం సొసైటీ అధ్యక్షుడు కట్ట భరత్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకున్న వాసవి గృహ సముదాయ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కామినేని హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామినేని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నాగు, బెజీ చర్యసెల్లా, ఏజియం గంగాధర్, పీఆర్ఓ యాదగిరి, జంగారెడ్డి, సిబ్బంది, వాసవి శ్రీ నిలయం సొసైటీ ఉపాధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, సంధ్యారాణి, శంకర్, రఘునందన్, కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పునరావాసం కల్పించాకే
మూసీ ప్రక్షాళన చేపట్టాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్ వెస్లీ





నవతెలంగాణ- నాగోల్

మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టి, వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలతో పునరావాసం కల్పించాకే మూసీ ప్రక్షాళన చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరూర్ నగర్ సర్కిల్ చైతన్యపురి డివిజన్లో మూసీ పరిహార ప్రాంతమైన భవాని కాలనీలలో ఆదివారం పర్యటించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పునరావాసం కల్పించకుండా పేదల ఇండ్లను కూల్చివేస్తుంటే సీపీఐ(ఎం) పార్టీ చూస్తూ ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మూసీ ఇరువైపులా 50 మీటర్ల దూరం నుంచి ఉన్న ఇండ్లను కూలుస్తామని ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు కారణంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆ నోటీసులు చూసిన తర్వాత కొంతమంది గుండెపోటుకు గురై ఆస్పత్రి పాలయ్యారని, మరికొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీకి ఇరువైపులా స్థలాలలో పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు కలిగి ఉంటే వాటిపై చర్యలు తీసుకొని తొలగించాల్సింది పోయి.. మురికి కాల్వ చుట్టూ చిన్న చిన్న గుడిసెలు నిర్మించుకొని 30, 40 సంవత్సరాలు నుండి చాలిచాలని సంపాదనతో జీవనాన్ని గడుపుతున్న పేదవారిపై తమ ప్రతాపాన్ని చూపిస్తూ మూసీ ప్రక్షాళన పేరుతో ఇండ్లను కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. రోజువారి కూలీలు కూలీగా జీవనం సాగిస్తున్న వారు, చిన్న చిన్న స్థలాలు కొనుక్కొని గుడిసెలు వేసుకుని బతుకుతున్న వారికి అన్యాయం చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డబల్ బెడ్ రూమ్స్ ఇండ్లు నాణ్యత లేవని, కనీస వసతులు కూడా లేవని అవి ఎంత కాలం ఉంటాయో కూడా తెలియని పరిస్థితి ఉందని అన్నారు.

మూసీనది పరివాహక ప్రాంతంలో ఉన్న ఇండ్ల కూల్చివేతలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చర్యలు చేపట్టి పూర్తి అవగాహనతో వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. లేని పక్షంలో ప్రజలు తిరగబడి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ పర్యటనలో రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సరూర్ నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, సర్కిల్ కమిటీ సభ్యులు ఎం వీరయ్య కట్ట శ్రీనివాస్ ఎం. గోపి నాయక్, జి. మనోహర్, రంగారెడ్డి జిల్లా రజక సంఘం కార్యదర్శి సి. మల్లేష్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేష్, మూసీ ప్రాంత కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

యోగ ఒక అద్భుతమైన సాధనం

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ-నాగోల్





ఆధ్యాత్మిక, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగ ఒక అద్భుతమైన సాధనం అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసగుప్త అన్నారు. ఐడీఏ జీడిమెట్ల షాపూర్ వద్ద ఎస్ఎస్‌డీ యోగశాలలో పూర్ణ విజయ్ ఆధ్వర్యంలో జరిగిన శివ శక్తి ధ్యాన యోగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి ఏకాగ్రత పెరిగేకొద్దీ ఎక్కువ జ్ఞానాన్ని ఆర్జించవచ్చు అని, ఏకాగ్రత ఒక్కటే జ్ఞానాన్ని ఆర్జించడానికి ఏకైక మార్గం అని అన్నారు. మనిషి తన జీవితంలో దిన చర్యగా యోగాను చేర్చడం వల్ల ప్రతిరోజు ఆరోగ్యంగా ఉంటూ ఉన్నతమైన ఆలోచనలతో మన లక్ష్యాన్ని చేరుకోవచ్చు అని అన్నారు. యోగా అంటే మన శరీరం, మనసు, మరియు ఆత్మను అర్థం చేసుకోవడం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ టెంపుల్ చైర్మెన్ ప్రవీణ్ గుప్త, ప్రకాశ్ గుప్త, ఉప్పల రమేశ్, ఉప్పల ఎంఎస్‌సి యోగ ఎంబీఏ పూర్ణ సాయి, యోగ గురువు మల్లేష్, ఇంటర్నేషనల్ యోగ గురువు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆరోగ్యానికి వ్యాయామం అవసరం

సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ సత్తయ్య గౌడ్



నవతెలంగాణ - చంపాపేట్

ఆరోగ్యాలు బాగుండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ సత్తయ్య గౌడ్ అన్నారు. చంపాపేట ప్రధాన రహదారిలోని ఓనస్ రోబోటిక్ మరియు ఓనస్ హార్ట్ ఇన్స్టిట్యూట్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ సత్తయ్య గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో తినే పదార్థాలు వల్ల అనేక రోగాలు వస్తున్నాయని అన్నారు. దీనికి తోడు గుండెపోటు అధిక మందిలో వస్తుందని, ప్రతినిత్యం వ్యాయామం తప్పకుండా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యాయామం చేయటంతో పాటు ఆరోగ్యపరమైన భోజనం తీసుకోవాలన్నారు. ఓనస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు ఎండీ డాక్టర్ బాలరాజ్ నాయుడు మాట్లాడుతూ... 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకొని తగిన సూచనలు పాటించాలన్నారు. ప్రతినిత్యం 30 నిమిషాలు వ్యాయామం చేసుకోవాలని, నాన్ వెజ్ చికెన్, మటన్ తినవద్దని అన్నారు. పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మెన్ రామానాయుడు, డాక్టర్ లక్కీ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ రవి కిరణ్, సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

పరిసరాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా కాశిబుగ్గ దేవాలయ ఆవరణంలో ఆదివారం పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం వలననే సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందుకోసమే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జీ.రఘు, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి. యాదగిరి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, దేవాలయం పూజారి, జవాన్లు ఎం. మహేష్ కుమార్, ఎస్. శ్రీనివాస్, ఎస్. విజయ్, ఎం. విజయ్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో 'లోపలి వాన కవితా సంపుటి' ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

తన సాహిత్య రచనాభిలాషను షట్ డౌన్ లేకుండా కొనసాగిస్తున్న యువ కవి కుడికాల వంశీధర్ అని ఆచార్య ఎన్.గోపి అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో డా.ఎస్. రఘు అధ్యక్షతన కుడికాల వంశీధర్ కవితా సంపుటి లోపలి వాన ఆవిష్కరణ సభ జరిగింది. ఆచార్య ఎన్. గోపి లోపలి వాన కవి సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం గోపి మాట్లాడుతూ అచిరకాలంలోనే కవిత్వం లోతులు ముట్టిన కవి వంశీధర్ అని తెలిపారు. వంశీ "నానీల వసంతం", "సాఫ్ట్‌వేర్ నానీల" ద్వారా ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్న కవి అని, "లోపలి వాన" వచన కవితా సంపుటిలో వస్తు వైవిధ్యంతో పాటు, కవితాశిల్పం, భావ శబలత, పదాల ఎంపికలో చక్కని పరిణితి సాధించారని వక్తలు అభిప్రాయపడ్డారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కవి కుడికాల వంశీధర్ ను సన్మానించారు. "లోపలి వాన" సంపుటిలోని అధికశాతం కవితలు వివిధ తెలుగు పత్రికల్లో, మ్యాగజైన్స్‌లో ప్రచురింపబడినవేనని, ఈ కార్యక్రమంలో ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొన్నారని, "లోపలి వాన" కవితా సంపుటిని "తడిగల ప్రతి హృదయానికి అంకితమిస్తున్నా"నని కవి వంశీధర్ అన్నారు. ఈ సభలో డా. కాంచనపల్లి గోవర్ధన రాజు, గ్రంథ సమీక్షకులుగా డా. గిన్నారపు ఆది నారాయణ పాల్గొన్నారు.

'ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ
శాఖల సమన్వయ లోపంతో ప్రమాదాలు'

నవతెలంగాణ- హయత్ నగర్



ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ శాఖల సమన్వయ లోపంతో వాహన దారులకు ప్రమాదాలు జరుగుతున్నాయని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కే ఎల్ ఎం షాపింగ్ మాల్ నుండి పనామా మాంగళ్య షాపింగ్ మాల్ వరకు హైవే రోడ్డుకు కాలనీల యొక్క కనెక్టింగ్ రోడ్లు ధ్వంసమై ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆదివారం అట్టి ప్రాంతాన్ని సందర్శించారు. కేఎల్ఎం షాపింగ్ మాల్ ఆగమయ్య నగర్ కాలనీ వద్ద గాయత్రీ అపార్ట్మెంట్ స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేసి అధికారులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధిలో భాగంగా ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ శాఖల అధికారుల మధ్యన సమన్వయం లేక ధ్వంసమైన రోడ్లల్లో కంకర రాళ్ళు తేలి స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రోడ్ల పునరుద్ధరణ పనులు చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తుండడం అధికారులు చర్యలు తీసుకోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ వెంటనే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రోడ్ల పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రావు, వేణా రెడ్డి, కరుణాకర్ యాదవ్, రామేందర్, గిరిప్రసాద్ రెడ్డి, వృషి కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ డా. లక్ష్మణ్‌లను ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత వారికి పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి





ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బాలాపూర్ లడ్డూ ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాజుల మధు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం శివ సాయి గార్డెన్ నాగారంలో నిర్వహించిన రంగారెడ్డి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు పదవీ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ..కుషాయిగూడ హెడ్ మాస్టర్‌గా సేవలు అందించిన రంగారెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు మహేష్ గౌడ్ సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం కళాకారుల భిక్షాటన



నవతెలంగాణ-జవహర్ నగర్

వరద బాధితుల సహాయార్థం నిరుద్యోగ కళాకారులు ఆదివారం జవహర్‌నగర్‌లో భిక్షాటన చేశారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాజీ నగర్‌లో టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు ఆదేశాల మేరకు సాంస్కృతిక సేన మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి గజ్జెల్లి రామచందర్ ఆధ్వర్యంలో భిక్షాటన చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖమ్మంలో సర్వం కోల్పోయిన వరద బాధితుల కోసం భిక్షాటన చేసి సేకరించిన నిధులను సీఎం సహాయ నిధికి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు పిడమర్తి రాంబాబు, యాకన్న, రాజు, రమేష్, విష్ణు, మహేష్, వెంకన్న, రమేష్, శ్రావణి యాకన్న, లతా, నమిన్ల అక్షయ్, భాస్కర్, మహంకాళి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాతో పేదలకు నష్టం జరగొద్దు

- సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి పీ.సత్యం

నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రాతో పేదలకు ఎలాంటి నష్టం జరగవద్దని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి పీ.సత్యం అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ కార్పొరేషన్ సీపీఐ(ఎం) శాఖ కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో చెరువులు, కుంటల ఆక్రమణల నుండి పరిరక్షించేందుకు తెచ్చిన హైడ్రాతో సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.

సీపీఐ(ఎం) పీర్జాదిగూడ కార్యదర్శిగా కర్రే జంగయ్య



సీపీఐ(ఎం) పీర్జాదిగూడ శాఖ కార్యదర్శిగా కర్రే జంగయ్య ఎన్నికయ్యారు.ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనను శాఖ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య,జిల్లా కమిటీ సభ్యురాలు ఎన్.సృజన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు అమలు చేసే వరకు పోరాటాలు నిర్వహిస్తాం : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-ఉప్పల్

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు సీపీఐ (ఎం) పోరాటం నిర్వహిస్తుందని సీపీఐ (ఎం) ఉప్పల్ శాఖ కార్యదర్శి జె. వెంకన్న అన్నారు. ఆదివారం ఉప్పల్‌లో నిర్వహించిన ట్రేడ్ యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ట్రేడ్ యూనియన్ ఉప్పల్ శాఖ కార్యదర్శిగా బి. పెద్దస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జె. వెంకన్న, పెద్దస్వామిలు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దానాలను ఇచ్చిందన్నారు. అందులో ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గృహలక్ష్మీ పథకం, గ్యాస్ సబ్సిడీ, మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం వంటి పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తు, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. 43 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులను పొట్టలు కొడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్మిక ప్రజల పక్షపాతిగా ఉండాలని కోరారు. నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మ, కృష్ణ, ఎల్లయ్య, పర్వతాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ శుభోదయ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ శుభోదయ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంచికట్ల మల్లేష్, ఉపాధ్యక్షుడిగా బైరోజు వెంకటచారి, జనరల్ సెక్రెటరీ రాళ్ల బండి కృష్ణాచారి, జాయింట్ సెక్రెటరీగా బత్తిని పరశురాం గౌడ్, కోశాధికారిగా కే. నరసింహ చారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కే. రామకృష్ణను ఎన్నికయ్యారు. ఈ కమిటీని కాలనీ పెద్దలు చెంచు రెడ్డి, నందచారి, బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవ ఎన్నుకున్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెం.16లోని రాజ్‌సుఖ్ నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.7లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీలో దశల వారీగా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అపోహలను తొలగించాలి



- కార్పొరేటర్ నిహారిక గౌడ్, బాలవికాస ప్రతినిధులు వినోద్ రెడ్డి, బూడిద వెంకటేష్
- స్టార్ గేజర్ లిల్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రజలలో క్యాన్సర్ పై ఉన్న అపోహలను తొలగించాలని జవహర్ నగర్ కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, బాలవికాస సంస్థ హైదరాబాద్ కోఆర్డినేటర్ వినోద్ రెడ్డి, డైరెక్టర్ బూడిద వెంకటేష్ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 28 వ డివిజన్ మదర్ థెరిసా కాలనీ కమ్యూనిటీ హాల్ లో బాలవికాస ఆధ్వర్యంలో స్టార్ గేజర్ లిల్లీ క్యాన్సర్ పౌండేషన్ వారు బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ పై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి, క్యాన్సర్ లో ఉన్న వివిధ రకాల దశల లో వాటికి సంబంధించిన చికిత్సగురించి వివరించారు. క్యాన్సర్ కు సంబందించిన కిట్స్ ను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు శ్లోక అనుష్, జయాన్, 12 మంది స్టూడెంట్స్, కాలనీ వాసులు మేరీ, రవి, శారద, భాగ్యలక్ష్మి, చంద్ర కళ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సేవలను ప్రభుత్వాలు గుర్తించాలి

- రిటైర్డ్ జస్టిస్ చంద్ర కుమార్



నవతెలంగాణ-కాప్రా

ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ విద్యారంగానికి చేస్తున్న సేవలను ప్రభుత్వాలు గుర్తించి, వారికి బెనిఫిట్స్ అమలు చేయాలని రిటైర్డ్ జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. ఆదివారం ఈసీఐఎల్ లయన్స్ క్లబ్ హాల్‌లో నిర్వహించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలంగాణ ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ.. టీచర్ దేశానికి పునాది, దేశ భవితకు టీచర్ ఫౌండింగ్ స్టోన్, టీచర్ దేశానికి ఒక దిక్సూచి, దేశ భవిష్యత్తు నిర్మాణానికి రాళ్ళెత్తే కూలీల లాంటోల్లు టీచర్స్ అని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో చదువుకున్న వారు ప్రభుత్వ ఉద్యోగం రాక ప్రయివేట్ టీచర్స్‌గా మారి వెట్టికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో చదువుకున్న బానిసలు ఎవరైనా ఉన్నారంటే ప్రయివేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న టీచర్స్, లెక్చరర్స్ అని చెప్పారు. చేస్తున్న శ్రమకు, వస్తున్న వేతనానికి తేడా ఉంటుందన్నారు. టీచర్స్ కూడా బాధ్యతగా చదువు చెప్పాలని సూచించా రు. టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఏ.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రయివేట్ విద్యాసంస్థలు వెలిగి పోవడానికి ప్రధాన కారణం టీచర్స్ త్యాగ ఫలితమేనన్నారు. స్కూల్స్ ర్యాంకులు వచ్చేందుకు, స్కూల్ బ్రాంచ్‌ల సంఖ్య పెరగడానికి టీచర్లే ప్రధాన కారణం అన్నారు. ఓ ప్రయివేట్ సంస్థకు అందులో ఉద్యోగియే ప్రధానం అవుతారని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 11,000 పైగా ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయని, వాటిలో దాదాపు 4 లక్షల మంది టీచర్స్ ఉన్నారని తెలిపారు. 35లక్షల మంది విద్యార్థులకు వీరు బోధన చేస్తున్నారని వివరించారు. ఇన్ని లక్షల మంది విద్యార్థుల ను తీర్చి దిద్దుతున్న ప్రయివేట్ అధ్యాపకులకు గుర్తింపు లేదన్నారు. ఉప్పల్, కీసర ఎంఈవోలు రామారావు, శశిధర్‌లు మాట్లాడుతూ.. ప్రయివేట్ విద్యాసంస్థల్లోనే నేడు ఎక్కువగా విద్యార్థులు చేరుతున్నారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేట్‌లోనే చేర్పిస్తున్నారని అన్నారు. టీచర్స్‌కు ఏదైనా సమస్యలు ఉంటే తమకు చెప్పితే పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ టీచర్స్ సైంటిఫిక్ థింకింగ్‌తో చదువు చెప్పాలని సూచించారు. అనంతరం చాలా ఏండ్లుగా విద్యారంగానికి సేవ చేస్తున్న సీనియర్ టీచర్స్, లెక్చరర్స్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. విజయ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకులు సురేందర్ టీచర్, లెక్చరర్ రవి, పి. విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడి ఎంతవరకైనా పోరాటం చేస్తా



- ఒక్క ఇల్లునూ కూలనివ్వను...
- అవసరమైతే సుప్రీంకోర్టు వరకైనా వెళ్తా..
- కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలి అనవసర కార్యక్రమాలు చేస్తున్నది
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజల పక్షాన నిలబడి ఎంతవరకైనా పోరాటం చేస్తానని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకైనా వెళ్తానని, తాను ఉండగా ఒక్క ఇల్లు కూడా కూలనివ్వనని, ఈ సమస్య ఒకరిది కాదని, మల్కాజిగిరి ప్రజల సమస్యని, ప్రజల పడుతున్న అవస్థలు చూసి, చాలా బాధ కలిగిందని వారందరికీ అండగా ఉంటానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ప్రజలు హైడ్రా వల్ల భయాందోళనలకు గురవవుతున్న నేపథ్యంలో మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఈస్ట్ ఆనంద్‌బాగ్, వినాయక్ నగర్, మౌలాలి డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లో హైడ్రా అధికారులు ఎప్పుడొచ్చి ఇండ్లను కూల్చేస్తారో తెలియక బిక్కుబిక్కుమంటున్న శంకరయ్య కాలనీ, సింహాద్రి నగర్, ఎన్ .ఎం.డీసీ కాలనీ శివానంద నగర్, పలు కాలనీల ప్రజలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కలిసి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..30 ఏండ్ల క్రితం ఇండ్లు నిర్మించుకుని, మున్సిపల్ పర్మిషన్లు, రిజిస్ట్రేషన్స్ చేసుకొని అన్ని విధాల పన్నులు కడుతున్నప్పటికీ, హైడ్రా పేరుతో కూల్చివేయడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసి అనవసర కార్యక్రమాలు చేస్తోందన్నారు. ఆరు గ్యారంటీలను అటక ఎక్కించి, ప్రజల దృష్టి మరలిచండానికి హైడ్రా తెచ్చిందన్నారు. ప్రజలకు అండగా ఉంటానని, ఎటువంటి ఆందోళనకు గురి కావొద్దని ధైర్యాన్ని ఇచ్చారు. ప్రజలు భయాందోళనతో నిద్ర లేని రాత్రులు గడుపుతూ అనారోగ్యాల పాలవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం అంటే ప్రజల కోసం ప్రజా క్షేమం కోసం పని చేయాలని, అలా కాకుండా వారిని ఆవేదనకు గురి చేయడం సిగ్గు చేట్టన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాల రాయడం భావ్యం కాదన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, ఇల్లు కట్టుకొన్ని అన్ని అనుమతులు తీసుకొని నిర్మించుకున్న ఇల్లును ఒక్కసారిగా నేలమట్టం చేయడం దుర్మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, స్థానిక అసోసియేషన్ కమిటీల సభ్యులు, స్థానిక కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా గ్రంథాలయంలో పరిశుభ్రత కార్యక్రమం



నవతెలంగాణ-మేడ్చల్

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మేడ్చల్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ విద్యార్థులు సంజయ్ సాహుల్ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. గ్రంథాలయాల దీప్తి వాటి పరిశుభ్రత వనరుల కల్పన అను వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నోడల్ అధికారి, విద్యాశాఖ గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేష్ రూపకల్పన చేశారు. రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలు, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యకర్తల ద్వారా గ్రంథాలయంలోని పరిసరాలను, పుస్తకాల దుమ్ము ధూళిని దులిపివేయడం, క్రమ పద్ధతిలో విభాగాల వారీగా సర్దడం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సురేష్ బాబు, సిబ్బంది, నాగవేణి, ప్రవళిక, విద్యార్థులు సాయికృష్ణ, శ్రీజ, పాఠకులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రయినేజీ సమస్య పరిష్కారం



- ప్రజాప్రతినిధులకు సన్మానం

నవతెలంగాణ-కీసర

ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బాక్స్ డ్రయినేజీ సమస్యను పరిష్కరించినందుకు నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్‌లను 5,6 వార్డులకు సంబంధించిన చక్రధర్ కాలనీ, గౌరీనాథ్ కాలనీ, వివేకానంద కాలనీ, న్యూలక్ష్మీనగర్ కాలనీ ప్రజలు సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు కౌకుట్ల అనంత్ రెడ్డి , అన్నంరాజు శ్రీనివాస్ , కౌకుట్ల కృష్ణారెడ్డి , శ్రీ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ , అన్నంరాజు సురేష్ , సుర్వి శ్రీనివాస్ గౌడ్‌లను అభినందిస్తూ సన్మానం చేశారు. గత కొన్నేండ్లుగా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడ్డామని కాలనీవాసులు తెలిపారు. సమస్యను పరిష్కరించినందుకు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

సీపీఐ (ఎం) పిల్లి నరసింగరావు నగర్ కాలనీ శాఖ కార్యదర్శిగా పి. మంగ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ పరిధిలోని పిల్లి నర్సింగరావు నగర్ కాలనీ సీపీఐ(ఎం)1వ శాఖ మహాసభను ఆదివారం సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి ఎం కృపా సాగర్ సమక్షంలో నిర్వహించిన మహాసభలో పిల్లి నర్సింగరావు నగర్ కాలనీ 1వ శాఖ కార్యదర్శిగా పి మంగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభల్లో ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలను ఇచ్చారని, ముఖ్యంగా ఆరు గ్యారంటీ పథకాలను ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నామమాత్రంగానే అమలు చేస్తూ వస్తున్నారన్నారు. రానున్న కాలంలో కమ్యూనిస్టులుగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంగ మాట్లాడుతూ మౌలాలి డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తూ, సీపీఐ(ఎం) పార్టీ బలోపేతానికి సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



హాజరైన మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సాయినగర్‌లోని సాయిబాబా దేవాలయంలో శ్రీ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ హాజరై మాట్లాడుతూ.. దేవ శిల్పి, చేతి వృత్తుల అధినేత విశ్వకర్మ భగవాన్ గురించి భవిష్యత్తరాలకు తెలుపుతూ, సంప్రదాయాలను తెలియజేయడం మన కర్తవ్యమని అన్నారు. లోక కల్యాణర్థం ఈ కార్యక్రమం చెప్పటం గొప్ప విషయమన్నారు. అనంతరం సహ పంక్తి భోజనం చేసి స్వామి వారి దివ్యప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమం లో శ్రీభూపతి చారీ, మల్లేష్, దయానంద్, ప్రవీణ్, విజయకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పేదవారికి సాయం చేస్తేనే మన జీవితానికి సార్ధకత





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మానవతా దృక్పథంతో పేదవారికి మనకు తోచిన విధంగా సహాయం చేస్తేనే మన జీవితం సార్థకమవుతుందని శ్రీగంగా చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, అధ్యక్షులు బిర్రు బాలమల్లయ్య అన్నారు. నేరేడ్‌మెట్ చౌరస్తాలోని బస్‌స్టాప్ వద్ద శ్రీగంగా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అన్నదానం నిర్వహిస్తారు. ఆదివారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్వమత సేవా సమితి అధ్యక్షులు బి. శివకుమార్ పాల్గొని మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం ఎంతో గొప్పదని, పేద ప్రజలకు సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెక్కడ దొరకదని అన్నారు. ప్రతి ఒక్కరూ పేదలకు తోచిన విధంగా సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎల్ నారాయణ రెడ్డి, సంఘ సేవకులు సెర్ల అనిల్, వెంకట్, భరద్వాజ్, భువన్, సుందర్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం



నవతెలంగాణ-శామీర్‌పేట

విద్యుత్తు మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని శామీర్‌పేట విద్యుత్ ఏఈ సురేందర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేవరయంజాల్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్తపేట ఫీడర్ మరమత్తుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దేవరయంజాల్, గోడౌన్స్, ఎలిగలగూడ గ్రామాలతో పాటు వ్యవసాయ పొలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కండ్ల కొయ్య సబ్‌స్టేషన్‌లో అంజన్న టెంపుల్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా దేవరయంజాల్‌లోని మల్లన్న కాలనీ, సాయి గీత ఆశ్రమం సమీపంలోని పలు గోడౌన్స్‌కు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథం కలిగి ఉండాలి

- కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు
- మైనంపల్లి అడుగుజాడలల్లో నడుస్తూ పేదలకు సాయం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో పేదవారికి తమకు తోచిన విధంగా సహాయం చేస్తూ అండగా నిలబడాలని కాంగ్రెస్ నాయకులు పిట్టల నాగరాజు అన్నారు. వినాయక్ నగర్ డివిజన్‌కు చెందిన రషీద్ ఖాన్ అనే వ్యక్తి నాలుగు రోజుల క్రితం మోటార్ బైక్ నుండి కిందపడి కాల్ ఫ్రాక్చర్ అయ్యింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు పిట్టల నాగరాజు రషీద్ ఖాన్‌ను ఆదివారం పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసి, మరో రూ.2 వేలతో మెడిసిన్స్‌ను ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనంపల్లి స్ఫూర్తితో పేద ప్రజలకు తమకు తోచిన సహాయాన్ని అందజేస్తున్నానని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ, పేద ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు.

వైకుంఠధామంలో షెడ్డు ఏర్పాటు

- రూ. 3లక్షలతో నిర్మాణం చేయించిన కంభం వెంకట్‌రాజ్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామ వైకుంఠధామంలో గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ కంభం వెంకట్ రాజ్ రూ.3లక్షల నిధుల వ్యయంతో షెడ్డు ఏర్పాటు చేయించినట్లుగా తెలిపారు. గ్రామంలోని ప్రజలు దహన సంస్కారాలు చేసే సమయంలో కూర్చునేందుకు వీలుగా షెడ్డును ఏర్పాటు చేసినట్లుగా వెల్లడించారు. గ్రామంలోని ప్రజలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి తన సహకారం ఉంటుందని అన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

సోమవారం | సెప్టెంబర్ 30, 2024 | www.navatelangana.com



భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి...

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహమ్మద్ బషీర్ అనే వ్యక్తి దారుణ హత్య

నవతెలంగాణ - ముషీరాబాద్

మహమ్మద్ బషీర్ అనే వ్యక్తిని దారుణంగా గొంతు కోసి హత్య చేసిన ఘటన దోమల గుడా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ లోని భరత్ నగర్ లో నివాసం ఉండే మహమ్మద్ బషీర్ (30) రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో లోయర్ ట్యాంక్ బండ్ గోశాల నుంచి మారుతీ నగర్ కు వెళ్లే దారిలో ఆటోపై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు బషీర్ ను అత్యంత దారుణంగా మద్యం మత్తులో ఇక్కడకు తీసుకువచ్చి అతని మెడపై తీవ్రంగా గాయపరిచి హత్య చేసి పరారయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య దోమలగూడ సిఐ శ్రీనివాస్ రెడ్డి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి క్లూస్ టీం సహాయంతో నిందితుడి గురించి ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

ప్రారంభ కానున్నా బతుకమ్మ వేడుకలు



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి/కేపీహెచ్‌బీ

ప్రతి సంవత్సరం ఎంతో అత్యంత వైభవంగా నిర్వ హించే బతుకమ్మ వేడుకలు సోమవారం నుంచి ప్రారం భం కానున్నయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నేపథ్యంలో.. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ప్రతీక బతుకమ్మ వేడుకల న్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా జరు గు వేడుకలకు సర్వం సిద్ధం చేశామని తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం మొదటి బతుకమ్మ, మంగళ వారం పెద్దల అమావాస్య, 8 వ తేదీన అట్ల బతుకమ్మ, 9 వ తేదీన బతుకమ్మ అలిగిపోవడం, 10వ తేదీన సద్దు ల బతుకమ్మ, 12వ తేదీన విజయదశమి వేడుకలు, అత్యంత ఘనంగా కుకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వ హించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే చివరి రోజైన విజయ దశమి రోజు న కూకట్‌పల్లి రామాలయం వద్ద సాయంత్రం 5:30 గంట లకు, జమ్మి పూజ నిర్వహించి.. రంగ ధాముని చెరువు వద్ద విద్యుత్ కాంతుల వెలుగులతో, మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించే, బతుకమ్మ వేడుకలను కనుల విందు చేసే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మహిళలు భక్తులు, పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ వేడు కల్లో పాల్గొంటారని, ప్రజలందరికీ బతుక మ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా ప్రతిరోజు కూకట్ పల్లిలో జరుగు బతుకమ్మ వేడుకల్లో, కూకట్‌పల్లి గ్రామ మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందలన్నారు.

బతుకమ్మ కుంటలను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలి : కార్పొరేటర్..

శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లో, రాబోయే బతుకమ్మ పండుగ సందర్భంగా పలుచోట్లలో బతుకమ్మ కుంటలను పరిశీలించి వాటికి కావలసిన మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అలాగే అవసర మైన చోట్ల లైట్లను అమర్చాలని కార్పొరేటర్, అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, భద్రయ్య, తులసి దాస్, స్థానిక నాయకులు ఆంజనేయులు, జగదీష్ గౌడ్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, కొండలరావు శ్రీనివాస్ సాగర్, పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే అతి పెద్ద బతుకమ్మల ఏర్పాటు కూకట్‌పల్లి ప్రత్యేకం : బతుకమ్మ కమిటీ సభ్యులు : కంచనపల్లి నాగరాజు..

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సంబరాలు కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే సహకారంతో ఘనంగా కూకట్‌పల్లి బతుకమ్మ కమిటీసభ్యులు కంచనపల్లి నాగరాజు తెలిపారు. బతుకమ్మ ఉత్సవాలు కూకట్‌పల్లిలో ఈనెల 30వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. అచ్చమైన పూలతో బతుకమ్మలను పేర్చే కూకట్‌పల్లిలో మహిళలు రాష్ట్రంలోనే అతి



పెద్ద బతుకమ్మలను పేర్చి ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. బతుకమ్మ పండుగ కోసం మహిళలు పోటీ తత్వంతో బతుకమ్మల ను తయారు చేస్తారు. ఈసారి బతుకమ్మలకు అమావాస్యకు ముందు రోజు మంగళవారం రావటంతో తొలి రోజు బతుకమ్మ బొడ్డెమ్మలను బయటకు తీసుకురావద్దనే సంప్రదాయం ఉంది. దీంతో సోమవారమే బతుకమ్మ వేడుకలను ప్రారంభి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భం గా బతుకమ్మ వేడుకల కోసం కూకట్‌పల్లి అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. కూకట్ పల్లి ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసే ఈ వేడుక లకు మహిళలు భారీ ఎత్తున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేయను న్నారు. ఈనెల 10వ తేదీన సద్దుల బతుకమ్మ నిర్వహించనున్నారు.



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్
- సీసీ రోడ్డు పనులకు రూ. 72 లక్షలు మంజూరు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, సంజయ్ పురి కాలనీలో సుమారు రూ.72 లక్షల నిధులను పలు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేయించిన సందర్భంగా.. ఆ ప్రాంత వాసులు ఆదివారం శాలువాతో సన్మానిస్తూ ధన్యవాదాలు తెలిపారు. సంజయ్ పురి కాలనీలో జలమండలి సిబ్బంది భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్ పనులు చేయడం కోసం అక్కడి మెయిన్ రోడ్డును తవ్వి అసంపూర్తిగా వదిలేశారన్నారు. దీంతో స్థానికులతో పాటు ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కూన దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలంలో నరక యాతన అనుభవిస్తున్నామని స్థానికులు వాపోయారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పడుతున్న ఇబ్బందులపై స్పందిస్తూ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ లకు వివరించారు. తక్షణమే స్పందించి ప్రభుత్వం తరపున సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అనంతరం కాలనీవాసులతో కలిసి పలు సమస్యలను పరిశీలించారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఓరుగంటి కృష్ణ గౌడ్, రషీద్ భాయ్, కాలనీవాసులు దామోదర్ రావు, వెంకటేశ్వర రావు, సత్తయ్య గుప్తా, ఇస్మాయిల్, భాగ్యలక్ష్మి, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే



- జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జర్నలిస్టుల పక్షపాతిగా నాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) పాటుపడుతుందని సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అన్నారు. ఆదివారం సూరారంలోని కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే 143 కి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఆ సంఘానికి రాజీనామా చేసి టీయూడబ్ల్యూలో చేరారు. యూనియన్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కోటగడ్డ శ్రీనివాస్, పి.సాయి బాబాలతో కలిసి ఆయన సభ్యత్వాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకమునుపు నుంచి జర్నలిస్టుల పక్షాన పోరాటం చేస్తున్న సంఘం తమదేనన్నారు. గడిచిన 10 ఏండ్ల కాలంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం ఆందోళనకరం మన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సంక్షేమానికి మంచి రోజులు రావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత, ఇండ్ల స్థలాల కేటాయింపుకై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్న జర్నలిస్టుల వివరాల సేకరణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ (హెచ్ఎంటీవీ), సాక్షి శర్మ, ఈటీవీ రమణ, టెన్ టీవీ ప్రవీణ్, టీవీ5 ప్రవీణ్, ఐ న్యూస్ భాస్కర్ రెడ్డి, బి ఆర్‌కే న్యూస్ సంతోష్, తదితరులు యూనియన్ సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి శేషారెడ్డి, యూనియన్ జిల్లా నాయకులు సూర్య నారాయణ రెడ్డి, నాగేంద్ర చారి, రాజు మన తెలంగాణ, లక్ష్మణ్, మల్లేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడే చలో లేబర్ కమిషనరేట్‌ను జయప్రదం చేద్దాం..

- తెలంగాణ ఉద్యోగ, పారిశుధ్యకార్మికుల సీఐటీయూ
- సంఘం అధ్యక్షులు జి.వెంకటరాజం



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి వార్డ్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సందర్భంగా సీఐటీయూ నాయకుడు వెంకట రాజం మాట్లాడుతూ అనేక సం॥రాలుగా కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. గత బీర్ఎస్ ప్రభుత్వంలో అనేక దపాలు పాలకులు దృష్టికి తీసుకు వెళ్లిన పరిష్క రించలేదని సీఐటీయూ పోరాటం ఫలితంగా కేవలం ఒక్క పీఆర్సీ ప్రకారంగా కేవలం రూ.3,660 మాత్రమే పెంచిదన్నారు. ముఖ్యంగా కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఫిక్సపే, డైలీ వేజ్, తదితర పద్ధ తుల్లో పారిశుధ్యం, పార్కులు, హరితహారం, ఇంజనీ రింగ్, వాటర్ వర్క్స్, సీట్ లైటింగ్, విభాగాల్లో పారిశుధ్య కార్మికులు డ్రైవర్లు, ఎలక్ట్రీషన్లు, పంప్ ఆపరేటర్స్‌గా పని చేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ప్రమా దాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం నేడు జరిగే మహాధర్నా కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మ, శ్రీను, విజయకుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్స్ ఔట్సోర్సింగ్ కార్మికులు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలనీ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ బాచుపల్లి ఏరియాలలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సభలు సమావేశాలు నిర్వహించడం జరిగింది. దేశవ్యాప్తంగా 20 24 సెప్టెంబర్ నెలలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నాన్ పర్మినెంట్ ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబర్ 30 చలో లేబర్ కమిషనర్ కార్యక్రమం జయప్రదం చేయాలని జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు జి. వెంకటరాజం పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ వర్కర్స్ నాన్ పర్మినెంట్ ఎంప్లాయిస్ అందర్నీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని, కనీస వేతనం 26,000గా నిర్ణయించాలని కోరారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని హెచ్చరించారు. కార్మిక చట్టాలు అమలు చేయాలి. ఈఎస్ఐ పిఎఫ్ బోనస్ గ్రాట్యూటీ అమలు చేయాలని అపాయింట్‌మెంట్ లెటర్స్ గుర్తింపు కార్డులు పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని దినం అమలు చేయాలని, అదనపు పనికి అదనపు వేతనం చట్టప్రకారం డబల్ ఇవ్వాలన్నారు. మహిళా కార్మికులకు రెస్ట్ రూమ్లు పసిపిల్లలకు క్రెచ్ సౌకర్యం కల్పించాలని లైంగిక వేధింపులు అరికట్టాలని కోరారు.. ఈ కార్యక్రమంలో నారాయణ చెన్నయ్య వెంకన్న మద్దిలేటి నరసింహ శ్రీను మనీ లక్ష్మీ పెంటమ్మ తదితర నాయకులు కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.



ఐటీ ఉద్యోగులు ఇంద్ర బస్సును సద్వినియోగం చేసుకోవాలి



- కూకట్‌పల్లి డీఎం శ్రీహరి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో ఉంటూ హైటెక్ సిటీలో ఉద్యోగం చేసుకునే ఐటీ ఉద్యోగులైన, ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులకు టీజీఎస్ఆర్టీసీ కూకట్‌పల్లి డిపో మేనేజర్ శ్రీహరి శుభవార్త చెప్పారు. గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లోనీ ఐటి ఉద్యోగుల కోసం, ప్రతి సోమవారం ఉదయం 5 గంటలకు హన్మకొండ బస్టాండ్ నుంచి ఇంద్ర బస్సును ప్రత్యే కంగా నడపడం జరుగుతుంది. ఇంద్ర బస్సును ఐటీ ఉద్యోగులు వినియోగించుకోగలరని మేనేజర్ తెలిపారు. బస్ సర్వీస్ నంబర్ 8277 సర్వీస్ నెంబర్ గల బస్, గచ్చిబౌలి నుండి 10:30 నిమిషాలకు, 8278 సర్వీస్ నెంబర్ బస్సు, ఉప్పల్, జేబీఎస్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, హైటెక్ సిటీ మీదుగా గచ్చిబౌలికి చేరుకుంటుందని, ఈ సదావకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోగలరని కూకట్‌పల్లి డిపో డిఎం శ్రీహరి తెలిపారు.

నేటి 'చలో లేబర్ కమిషనర్ రేట్'
జయప్రదం చేయండి : సీఐటీయూ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 'చలో లేబర్ కమిషనర్ రేట్' వద్ద నేడు (30న) జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో కుత్బుల్లాపూర్ సీఐటీయూ ఆధ్వర్యంలో 'చలో లేబర్ కమిషనర్ రేట్' కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పసుల అంజయ్య మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 2014 నుండి కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలో చాలా మార్పులు చేశారని,29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. కనీస వేతనానికి గ్యారెంటీ లేకుండా ఎనిమిది గంటల పని విధానానికి బదులు 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్ ఎంప్లాయిస్ అందరిని పర్మినెంట్ చేయాలని, రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయి మెంట్స్ లో కనీస వేతనాలు సవరించాలని ఆయన అన్నారు.కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ,బోనస్, గ్రాట్యూటి అమలు చేయాలని, ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ వి ఓఏ లు, విద్య వైద్యరంగం తో పాటు వివిధ స్కీములలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కార్మిక చట్టాలను అమలు చేయాలని ఆయన అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన అన్నారు. గడిచిన 10 ఏండ్లలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దారా దత్తం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించా లని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. నేడు (సెప్టెంబర్ 30న) చలో లేబర్ కమిషనర్ రేట్ జరిగే ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పసుల అంజయ్య, సీఐటీయూ నాయకులు యాదిరెడ్డి పాల్గొన్నారు.

కన్న తండ్రి కండ్ల ముందే కొడుకు మృతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కన్న తండ్రి కండ్ల ముందే కుమారుడు మృతి చెందిన విషాదకర ఘటన కుకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన పై కూకట్ పల్లి ఇన్‌స్పెక్టర్ కే.ముత్తు తెలిపిన వివరాలు.. ఆదివారం ఉదయం 8:30 గంటల సమయంలో, కూకట్ పల్లి రంగాధముని చెరువు సమీపంలో నిర్మిస్తున్న , హానర్ అనే బడా నిర్మాణ సంస్థ సైట్‌లో, పని చేసే రవి కుమార్ (20) తండ్రి కిషోర్ రామ్‌తో పాటుగా అక్కడి తన పనుల్లో పాల్గొనేందుకు వెళ్ళడం జరిగింది. రవి కుమార్ కేబుల్ వైరింగ్ కోసం తీసిన గుంతలోకి దిగి, వైర్ డ్యామేజ్ గురించి చెక్ చేస్తుండగా.. గుంత నుంచి తీసిన మట్టి అకస్మాత్తుగా పైన నుండి జారుకుంటూ.. గుంతలో ఉన్న రవి మీద పడింది. వెంటనే సంఘటనా స్థలంలో ఉన్న మృతుడి తండ్రి, ఇతర వర్కర్స్ కలిసి, ఆ మట్టిని తొలగించి అతడిని బయటికి తీసి, సమీపంలోని అమోర్ హాస్పిటల్‌కి తరలించగా.. అక్కడి డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే చనిపోయినట్లుగా నిర్ధారించారు. ఇట్టి విషయంలో మృతుడు తండ్రి నుంచి పిర్యాదు తీసుకొన్న కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 డివిజన్ షాపూర్ నగర్ లో ఎస్ .ఎస్ .డి .వై డాన్స్ అండ్ ఫిట్నెస్ స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న టి.పి.సి.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి . ఈ కార్యక్రమంలో పున్నారెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో ప్రజలు మానసికంగా శారీరకంగా ఎన్నో రోగాలకు గురవుతున్నారని వాటి నుంచి కాస్తయినా బయట పడాలంటే డాన్స్ మరియు ఫిట్నెస్ ఎంతగానో దోహదపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 125 డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దండే రాజు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీసీ సెల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అన్వర్, పున్నన్న అభిమాన సంఘం అధ్యక్షులు రాజ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని
ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-దుండిగల్

వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంప్ స్థానిక ప్రగతి నగర్,లేక్ వి కాలనీలో నిర్వహించారు. ఈ క్యాంపులో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, డెంటల్, ఆప్తమాలజీ, పెడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. వివిధ పరిసర ప్రాంతాల ప్రజలు అనేకమంది పాల్గొని ఈ మెడికల్ క్యాంపు యొక్క సేవల్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ కుమార్ , అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్ వాలంటీర్స్ సాంబశివరావు, శాస్త్రి, గోపాలకృష్ణరాజు, నరసింహారాజు, విజయ్ సింహ, చక్రధర్ రావు, అశోక్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కార్పొరేటర్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దైనందిన జీవితంలో యోగా ప్రతి ఒక్కరూ చేయాలని అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ రోడ్ వద్ద కౌడ మల్లేష్ శివశక్తి ధ్యాన యోగశాలను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రజలు వారి ఆరోగ్యం పట్ల సరైన శ్రద్ధ తీసుకోకపోవడంతో ఎన్నో శారీరక ,మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వయో పరిమితి లేకుండా యోగ చేయడం చేస్తేనే మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. యోగాశ్రమ నిర్వాహకులు, నాయకులు మురళీకృష్ణ, దుర్యోధన నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | సెప్టెంబర్ 30, 2024 | www.navatelangana.com

సమతా నగర్‌లో వైద్య శిబిరం



నవతెలంగాణ-కంటోన్మెంట్
పాత బోయినపల్లి ఆర్ బి ఐ సమతానగర్ లో కాలనీ వెల్ఫే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు డాక్టర్ అనూష డెంటిస్ట్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా ఉచిత వైద్య సహాయ శిబిరం నిర్వహించారు శిబిరంలో 100 మంది కాలనీవాసులకు వైద్యులు దంత బీపీ షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ముఖ్యాతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించినారు శిబిరం అసోసియేషన్ అధ్యక్షుడు లోకోడాస్ కార్యదర్శి నాగేశ్వరరావు సహాయ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి ఉపాధ్యక్షుడు రాంచందర్ రావు రాధాకృష్ణ నితిన్ మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటాం : సీఐ సీతయ్య

నవతెలంగాణ - ముషీరాబాద్
ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సినిమా థియేటర్‌లలో ఆకతాయిలు ప్రేక్షకులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి సీఐ సీతయ్య తెలిపారు. ఇటీవల దేవర సినిమా విడుదల సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు సుదర్శన్ థియేటర్లో బాణాసంచా కాల్చి ప్రేక్షకులను భయభ్రాంతులకు గురి చేయడంపై పోలీస్ స్టేషన్‌లో సుదర్శన్ థియేటర్ మేనేజర్ రావుల శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐ సీతయ్య మాట్లాడుతూ.. సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో దేవర సినిమా విడుదల సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు బాణాసంచా కాల్చడంతో సినిమా హీరో జూనియర్ ఎన్టీఆర్ హోర్డింగ్‌కు మంటలు అంటుకొని హోర్డింగ్ పూర్తిగా కాలిపోయిందని తెలిపారు. థియేటర్‌లో ఆకతాయిలు చేసిన పని వల్ల సినిమా చూడడానికి వచ్చిన ప్రేక్షకులు భయభ్రాంతులకు గురయ్యారని ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ చర్యకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆకర్షిస్తున్న భారతీయ కళా ఉత్సవ్



నవతెలంగాణ-కంటోన్మెంట్
బొల్లారంలోని రాష్ట్రపతి పతి నిలయంలో మొదటిసారిగా రాష్ట్రపతి నిలయం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న భారతీయ కళ మహోత్సవ్ అందరినీ ఆకర్షిస్తోంది ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 300 మంది కళాకారులు ఈ ఉత్సవాల్లో పాల్గొని వారి రాష్ట్రాలకు సంబంధించి వారి జీవనం విధానానికి సాంస్కృతికి సంబంధించిన ప్రదర్శనలు ఇస్తున్నారు అంతేకాకుండా వారి రాష్ట్రాలకు సంబంధించినటువంటి అరుదైన వంటకాలు చేత్తో తయారుచేసిన కళ కాడాలను కూడా ఈ ఈ మహోత్సవంలో నెలకొల్పటం విశేషంగా కనిపిస్తోంది. స్వయంగా ఈ మహోత్సవాలను ప్రారంభించడంతో ప్రత్యేకత సంతరించుకుంది కాగా ఈ మహోత్సవం వచ్చే నెల ఆరో తేదీ వరకు ఉంటుందని ఇందులో పేర్కొన్నారు తిలకించే వారందరూ నిలయం నుండి తగిన ఆశలు పొంది వీక్షించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు ఇందుకు సంబంధించిన పాసులు నిలయం వెబ్సైట్లో ద్వాం తీసుకోవచ్చని చెప్తున్నారు.

గ్లామన్ మిసెస్ ఇండియా అవార్డు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది

- హేమలత రెడ్డి



నవతెలంగాణ- బంజారాహిల్స్
టీవీ జర్నలిస్ట్, యాంకర్, నిన్ను చూస్తూ అనే సినిమాలో హీరోయిన్‌గా నటించిన హేమలతారెడ్డిని గ్లామన్ మిసెస్ ఇండియా 2024 అవార్డు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని అన్నారు. మలేషియాలో జరిగిన మిసెస్ ఇండియా 2024 కార్యక్రమంలో మిసెస్ ఇండియా-2024 అవార్డు దక్కించుకోవడంతోపాటు బెస్ట్ టాలెంట్ అండ్ ఫొటోజెనిక్ విభాగంలో అవార్డును గెలుచుకున్న సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఈ అవార్డు తనకు రావడం ఎంతో ఆనందంగా ఉందని సాధారణంగా గ్లామర్ ఇండస్ట్రీలో ఫ్యాషన్‌షోలలో తెలుగువారు తక్కువగా పాల్గొంటారని ఈ అవార్డు రావడంతో తనలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగిందని భవిష్యత్‌లో మరిన్ని వేదికలపై తాను అవార్డులు గెలుచుకుంటానని తెలిపారు.

పేదల జోలికి వెళ్లొద్దని ముందే చెప్పాను

- ఎమ్మెల్యే దానం నాగేందర్



నవతెలంగాణ-బంజారాహిల్స్
తాను కబ్జా చేశానని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ కబ్జాలు హుస్సేన్ సాగర్ చుట్టూనే ఉన్నాయి ముందు వాటిని కూల్చండనీ ప్రభుత్వాన్ని కోరుతూ పేదల జోలికి వెళ్ళద్దు వారికి ప్రత్యామ్నయం చూపించిన తర్వాతే పూర్తిగా చేపట్టాలని తాను ముందే సూచించినట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఆదివారం బంజర హిల్స్‌ని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హైడ్రాపై దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు హైడ్రా స్లమ్‌ల జోలికి వెళ్లకూడదని ముందే చెప్పాను. జలవిహార్, ఐమాక్స్‌లాంటివి చాలా ఉన్నాయనీ పేదల ఇళ్లను కూల్చడం సరికాదనీ మూసీ నిర్వాసితులకు కౌన్సిలింగ్ ఇవ్వాల్సిందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఖాళీ చేయించాల్సినా అవసరం ఎంతైనా ఉందని ఇళ్లకు రెడ్‌మార్క్, సర్వే తొందరపాటు చర్యలే అన్నారు. ఎప్పుడో డిసైడ్ చేసిన బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇప్పుడు ఎలాంటి ఇబ్బందీ లేదనీ కూల్చిన ఇళ్లకు అక్కడే నివాసం ఏర్పాటు చేస్తే మంచిదనీ ఈ అంశాన్ని సీఎందృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా మారి శవల మీద ప్యాలలు ఎరికునెల రాజకీయాలు చేస్తున్న ఆ పార్టీ నాయకులు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తు ప్రజలని రెచ్చగొడుతు చీఫ్ పాలిటిక్స్ ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని రాజకీయాల్లో అనుభవం నుండి కూడా మాజీ మంత్రి హరీష్ రావ్ ప్రజల్ని తప్పుదోవ పట్టించడం కరెక్ట్ కాదన్నారు.హస్తం గుర్తు తీసేసి బుల్డోజర్ గుర్తు పెట్టుకోమనడం వంటి వ్యాఖ్యలు తగదని హరీష్ రావ్ ఇలాంటివి మానుకోవాలనీ ప్రభుత్వానికి ఎప్పుడు ఏం చేయాలో తెలుసు అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ



నవతెలంగాణ-కంటోన్మెంట్
ప్రజల కోసమే పనిచేస్తున్న , సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జన్నావుల రామకృష్ణ చెప్పారు ఆదివారం నాడు ఐదో వార్డు పరిధిలోని శాంతి దీపు కాలనీలో మీట్ యువర్ వెయిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, కాలనివాసులతో సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానికులు తెలిపిన మురుగు కాలువలు మంచినీరు విద్యుత్, రోడ్డు సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

రహమత్ నగర్ డివిజన్ సీపీఐ(ఎం) మహాసభ

- ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ - జూబ్లీహిల్స్
రహమత్ నగర్ డివిజన్ ఎస్ఎస్‌బీ నగర్ వద్ద సీపీఐ(ఎం) శాఖ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాస్ హాజరైజెండా ఆవిష్కరణ చేశారు. పార్టీ రహమత్ నగర్ డివిజన్ శాఖ కార్యదర్శిగా జె.స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం పెరుగుతుందని దానివల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందని, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మికులను, కర్షకులను అందరిని ఏకం చేసి పోరాటం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేద ప్రజల నివాసాలను కూల్చి వేస్తే ఊరుకునేది లేదని , పేద ప్రజల పక్షాన పోరాటాలను ఉధృతం చేస్తామని తెలపడం జరిగింది. మూసి పరివాహక ప్రాంతంలో పేదలందరికీ ప్రత్యేక న్యాయం, ప్రత్యామ్నాయం కల్పించిన తర్వాతనే వారిని అక్కడి నుండి తరలించాలని తెలపడం జరిగింది. కొందరికి దాని పక్కనే ఇండ్లు కట్టించి ఇవ్వాలని తెలిపారు. అభివృద్ధి అంటే పేదలను హైదరాబాదులో లేకుండా చేయడం కాదని ,అభివృద్ధిలో పేదలకు కూడా వాటా ఉండాలని తెలిపారు. పేద ప్రజల పక్షాన రహమత్ నగర్ డివిజన్ కమిటీ ఎల్లవేళలా కృషి చేయాలని, పోరాటాలు చేసినప్పుడే కమ్యూనిస్టులకు గుర్తింపు వస్తుందని ఈ సందర్భంగా తెలపడం జరిగింది . రహమత్ నగర్ డివిజన్ సీపీఐ(ఎం) పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందని ,మూడు సంవత్సరాలు చేసిన పోరాటాలను సమీక్షించుకొని ,భవిష్యత్తు పోరాటాలను చేసేందుకు సిద్ధం కావాలని అన్నారు. కమిటీ సభ్యులుగా బి దేవదాస్ ,టి భాగ్యరాజ్ , లక్ష్మణ్ , నరసింహ, రాము, పార్వతమ్మ ,సువర్ణ ,ఆదిలక్ష్మి కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి రాపర్తి అశోక్ ,నాయకులుసాయి శేషగిరిరావు, పాపారావు, భిక్షపతి పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ సర్కార్

- ఓయూలో బతుకమ్మ సంబరాలు
- ఎమ్మెల్యే లు యశస్విని రెడ్డి, పర్ణికరెడ్డి

పలువురు ప్రముఖుల హాజరు

- ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహణ

నవతెలంగాణ-ఓయూ
తెలంగాణ రాష్ట్రంలోని ఆడబిడ్డలకు తమ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, గద్దర్ కుమార్తె వెన్నెల, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్, ప్రముఖ గాయకురాలు వేముల పుష్ప,ధనసారి భవాని ,చిగిరింత పరిజాత నర్సింహ రెడ్డి బడంగ్పేట్ మేయర్ కుతాడి కుమార్ టిపివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఎన్ ఎస్ యు ఐ ఓయూ అధ్యక్షుడు మేడ శ్రీను ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీలుతో పాటు అధ్యాపకులు, సిబ్బంది భారీ సంఖ్యలో హాజరై బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ముందుగా గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో ఏమేమి పువ్వప్పునే గౌరమ్మ ఏమేమి కాయప్పునే గౌరమ్మ.. చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మా ' అంటూ లయబద్ధంగా పాటలు పాడారు. సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువెత్తు రూపం బతుకమ్మ అని అన్నారు. ప్రకృతిని పండుగగా జరుపుకొనే సందర్భం ఒక్క తెలంగాణకే దక్కిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మహిళకు సముచిత గౌరవం దక్కిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, వంట గ్యాస్ సిలిండర్ల రాయితీ హామీలను అమలు చేసిందని, త్వరలో మిగతా హామీలు అమలు అవుతాయన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు పూర్వ వైభవం వస్తుందన్నారు. పదవుల్లో మహిళలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరు





ద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు.

సీఎం రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి మాట నిలబెట్టుకున్నారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో అభిజిత్ యాదవ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్ ఎస్ యుఐ శ్రీకర్, ఓయూ ఇంచార్జ్ అవైజ్, వెంకట్ చౌహాన్ మాజీ టీపీసీసీ అధికార ప్రతినిధి,పుష్ప గౌడ్ తెలంగాణ జన సమితి మహిళ ఆర్గనైజింగ్ సెక్రటరీ, శైలజ టి పి వై ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, పల్లపు చందు, నాయకుడు, రెడ్డి శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకుడు నర్సింహ టీజేసీ అధ్యక్షుడు, లత టీజేసీ మహిళ అధ్యక్షురాలు, శరత్ నాయక్ గిరిజన శక్తి అధ్యక్షుడు, అశోక్ రాష్ట్ర అధ్యక్షుడు, కొమనబోయిన సైదులు విద్యార్థి నాయకుడు, భారీ అశోక్ , అధ్యక్షుడు, రచన రెడ్డి, నాయకురాలు, వినయ్ , నాయకుడు,వికాస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సాయి ఓంకార్ గౌడ్ వైస్ ప్రెసిడెంట్,వెంకట్ ముదిరాజ్ వైస్ ప్రెసిడెంట్, ప్రకాష్ జనరల్ సెక్రెటరీ,అజయ్, వినయ్, శంకర్ ఆర్ట్స్ కళాశాల ఇంచార్జి, మోహన్ సికింద్రాబాద్ కాలేజ్ టీమ్, రాణి రాథోడ్ భాషీర్బగ్ లా ఇంచార్జ్,ఎన్ఎస్‌యూఐ ఆర్ట్స్ కళాశాల టీమ్ కార్తిక్, సురేష్, అభి,ప్రవీణ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ భిన్న సంస్కృతులకు నిలయం

- ఓనం వేడుకల్లో తెలంగాణ మంత్రి సీతక్క

నవతెలంగాణ-బంజారాహిల్స్
హైదరాబాద్ నగరం ప్రతి ఒక్కరిని అక్కున చేర్చుకుంటుందని, అందుకే వివిధ రాష్ట్రాలకు, ప్రాంతాలకు చెందినవారు ఇక్కడికి రావడానికి ఇష్టపడటమే కాకుండా వారి సొంత ప్రాంతంగా భావిస్తారని మంత్రి సీతక్క అన్నారు. నగర్లోని మళయాళీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓనం వేడుకలను 20 గెటెడ్ కమ్యూనిటీలకు చెందిన దాదాపు 800లకుపైగా ఉన్న మళయాలీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి నల్లగండ్లలోని ఎపిస్టెమో స్కూల్‌లో వేడుకలాను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీక్కతోపాటు ప్రత్యేక అతిధిగా అన్విత గ్రూప్ సీఎండీ



అచ్యుత రావు బొప్పన పాల్గొనీ ప్రసంగించారు. సీతక్క మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన నగరమన్నారు. ఇక్కడ ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి సంప్రదాయాలను ఎంతో ఘనంగా జరుపుకుంటారన్నారు. ప్రభుత్వం సైతం ఎలాంటి భేషజాలకు పోకుండా ప్రతి ఒక్కరిని కడుపున పెట్టుకొని చూసుకుటుందన్నారు. ఈ కారణంగానే ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరానికి భారీ సంస్థలు పెట్టుబడి పెట్టడానికి, తమ వ్యాపారాలను విస్తరించడానికి ముందుకొస్తున్నాయన్నారు. వేడుకలో బాగంగా ఇక్కడ పుష్పాలంకరణ, గోషయాత్ర, స్థానిక క్రీడలతో కూడిన ఓనంకలి, అరిటాకులతో నిర్వహించే సద్య, మళయాలీల సంస్కృతిక నృత్యమైన కథాకళి తదితర వేడుకలతో అందరిని ఆకట్టుకున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులను అందించారు.



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి మృతి పట్ల మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం తెలిపారు. కొండాపూర్ లోని ఉత్తమ్ కుమార్ రెడ్డి నివాసానికి వెళ్లి పురుషోత్తం రెడ్డి పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. నవతెలంగాణ-బేగంపేట

నేడే పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

- ఓయూను అలంకరించిన నేతలు

నవతెలంగాణ-ఓయూ
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 వసంతాల స్వర్ణోత్సవ సభను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నేడు నిర్వహిస్తున్నామని పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ నామాల ఆజాద్ లు తెలిపారు.ఓయూలో తోరణాలు, బిగిపిడికిలి జెండాలతో భారీ స్థాయి కటౌట్లతో యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం, ఎన్ సి సి గేట్ వరకు తోరణాలతో యూనివర్సిటీ ప్రాంగణాన్ని ఎరుపుమయం చేశారు. స్వర్ణోత్సవ సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.విద్యార్థుల తలలో నాలుకల కోట్లాదిమంది విద్యార్థులకు చలనాన్ని కథనాన్ని అందించిన జార్జిరెడ్డి అధికార యంత్రాంగపు అవినీతి, నిరంకుశంకు వ్యతిరేకంగా మహా ఉద్యమంతో పిడిఎస్ ఏర్పరిచాడు. 1972లో ఏప్రిల్ 14న మతోన్మాద గుండాలు జార్జ్ ను కిరాతకంగా వెన్నుపోటుతో కత్తులతో దాడి చేసి హత్య చేశారని గుర్తు చేశారు. జార్జ్ హత్యతో జంపాల ఆ పోరాట వారసత్వాన్ని అందుకుని



రాష్ట్రవ్యాప్తంగా ప్రగతిశీల భావాలతో కూడిన సంస్థలను పిడిఎస్యుగా ఐక్యం చేసి 12, 13 అక్టోబర్ 1974లో మొదటి మహాసభ తో రాష్ట్రవ్యాప్తంగా చేశాడన్నారు.ఈ 50 ఏళ్ల పోరాట ప్రస్థానంలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, చేరాలు, కోలాశంకర్, రమణయ్య, సాంబయ్య, స్నేహలత త్యాగాల అమరత్వంతో చరిత్ర లిఖించిందన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యార్థుల సమస్యల నుండి అధిక ధరలు , రాజకీయ సమస్యలు , ర్యాగింగ్ , దళితులు బలహీన వర్గాలపై వివక్షలతో కూడిన దాడులకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసింది అనేక మెదళ్లను చైతన్యం బాగుట అందించిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించింది. శాస్త్రీయ, సమాన, విద్యాసాధనకై 50 ఏళ్లుగా సమస్యల పోరాటాలు నిర్వహిస్తుంది స్వదేశీ ప్రైవేటు యూనివర్సిటీలను వ్యతిరేకిస్తూ స్వదేశీ యూనివర్సిటీల బలోపేతం కోసం ఉద్యమిస్తుంది. అనేక విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తన అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగిస్తుంది.50 ఎలా ఉద్యమ క్రమంలో ఎన్నో విజయాలను సాధించింది. ఈ తరుణంలో ఠాగూర్ ఆడిటోరియం ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే స్వర్ణోత్సవ సభకు వేలాదిమంది విద్యార్థులు హాజరు కానున్నారు. ముఖ్య వక్తలుగా జస్టిస్ జిబి కొలిచే పార్టీ ముంబై హైకోర్టు జడ్జ్ ప్రొఫెసర్ హరగోపాల్, కె శ్రీనివాస్, సతీష్ చందర్, గుమ్మడి నరసయ్యలతో పాటు ప్రముఖులు, పూర్వ, పిడిఎస్యు నాయకులు, ప్రస్తుత నాయకులు హాజరుకానున్నారు అని వారు వెల్లడించారు. ఈ సభలను జయప్రదం చేయాలని వారు కోరారు.స్వర్ణోత్సవ సభ ఏర్పాట్లు పర్యవేక్షణ చేసిన వారిలో పి డి ఎస్ యు రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శిలు పోటు రంగారావు, ఎస్ఎల్ పద్మ, కెఎస్ ప్రదీప్, పి ఓ డబ్ల్యు రాష్ట్ర నాయకురాలు కే రమా, పూర్వ ఉపాధ్యక్షులు హన్మేశ్, పీ డీ ఎస్ యు ఉపాధ్యక్షులు ఎస్ అనిల్ సహాయ కార్యదర్శి కే ప్రవీణ్ రాష్ట్ర నాయకులు రాకేష్,కావ్య, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు రవి, కార్యదర్శి కృష్ణ, పీ డీ ఎస్ యు నవీన్, సాయి ప్రసాద్, అనిల్, పాల్గొన్నారు.

70వ, శ్రీనివాస కల్యాణం



నవతెలంగాణ-ఓయూ
70వ, శ్రీనివాస కళ్యాణం శ్రీ వెంకటేశ్వర మహా మంత్ర పీఠం ఆధ్వర్యంలో ఆదివారం హబ్సిగూడ యస్ యస్ నగర్‌లో కమ్యూనిటి హాల్ లో ఘనంగా నిర్వహించారు.111 కళ్యాణం లో భాగంగా ఈ కళ్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోదండ రామాలయం కమిటీ సౌజన్యం తో పుల్లగుర్ల వేదాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పూజ దంపతులు నిర్వహించారు. భారీగా హాజరైన స్థానికులు, భక్తులు కళ్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పి.సాయి రెడ్డి , సురేఖ రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

కమలా నగర్‌లోని 'డబుల్' ఇండ్లను అర్హులకు ఇవ్వాలి

- నిరసన తెలిపిన బాధితులు

నవ తెలంగాణ- జూబ్లీహిల్స్
జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్ నగర్ డివిజన్ లోని కమలానగర్లో రెండు బ్లాకులుగా (120090) 210 డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్ లను, ఐదు అంతస్తుల లో నిర్మించారు. అసలైన లబ్ధిదారులు శనివారం, ఆదివారం, కమలానగర్ లోని డబల్ బెడ్ రూమ్ అపార్ట్మెంట్ల వద్ద సుమారు 56 మంది వెంటనే మా ఇండ్లు మాకు కేటాయించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మీడియాతో మాట్లాడుతూ, 2017 సంవత్సరంలో అప్పటి ఖైరతాబాద్ ఎమ్మార్వో ,కలెక్టర్ ,ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అక్కడ రేకుల గదులు, గుడిసెలు వేసుకుని నివసిస్తున్న కుటుంబాల వారిని ఖాళీ చేయించి ,ఒక సంవత్సరంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ఒకవేళ సంవత్సరంలో ఇండ్లు నిర్మించని యెడల, అందరికీ ఇంటి కిరాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందని వాగ్దానం చేసి, అక్కడ నుండి పేదలను ఇండ్లు ఖాళీ



చేయించి పంపించి వేశారు. ఆరు సంవత్సరాలుగా ఇండ్లు కోల్పోయిన పేదలు ఇంటి కిరాయిలు చెల్లిస్తూ అనేక ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్నారు. అయితే 2023 మే నెలలో అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు పాల్గొని 102 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చి వెళ్లిపోయారు. మిగిలిన ఫ్లాట్లు ఎవరికి పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఎలక్షన్ ను సాకుగా చూపెట్టి ఇప్పటివరకు ఎవరికి పంపిణీ చేయలేదు. అయితే కమలా నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హైదర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, అసలైన లబ్దిదారులు వాస్తవంగా అక్కడ నివసించి ఇండ్లు కోల్పోయిన వారు 56 మంది ఉన్నారని, వారికి ఇండ్లు కేటాయించాలని అనేకసార్లు కలెక్టర్, ఆర్డిఓ, ఎంఆర్ఓ లను లబ్దిదారులతో కలిసి వెళ్లి కలవడం జరిగింది. అయితే అప్పుడు కేటాయించిన వారిలో కూడా 22 మంది అనర్హులు ఉన్నారని, అసలు వారు అక్కడ నివసించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, అయినా కూడా బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు , అర్హులు కాని వారికి ఇండ్లు కేటాయించారు . అప్పటినుండి పోరాటం చేస్తూనే ఉన్నామని, అర్హులైన వారికి వెంటనే డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు కేటాయించాలని గత రెండు రోజులుగా నిరసనలు తెలుపుతున్నారు. అర్హులైన 56 మందికి ఇల్లు కేటాయించి, మిగిలిన ఇండ్లు ఎవరికి ఇచ్చిన మాకు అభ్యంతరం లేదని, మాకు అన్యాయం జరిగితే ఎలాంటి పోరాటం చేయుటకు అయినా సిద్ధంగా ఉన్నామని, అధికారులను ,నాయకులను అసలైన లబ్దిదారులు హెచ్చరించారు. ఈ నిరసనలో ఇండ్లు కోల్పోయిన మహిళలు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ రాణిగంజ్ లోని ఎంజి కార్ల షోరూంలో బుల్లితెర నటుడు మానస నూతన ఎంజి ఎలక్ట్రికల్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మనస్సు మాట్లాడుతూ.... కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని,... నేటి ఆధునిక కాలంలో ఎలక్ట్రాన్ వాహనాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు., నూతన ఎలక్ట్రికల్ వాహనం సామాన్యుడికి అందుబాటు ధరలో ఉందని... ఈ సందర్భంగా నటుడు మానస తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.
- నవతెలంగాణ-బేగంపేట

మహంకాళి సికింద్రాబాద్ జిల్లాలో జోరుగా బీజేపీ సభ్యత్వ కార్యక్రమం

- మేకల సారంగపాణి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే

జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-ఓయూ
భారతీయ జనతా పార్టీలో యువకులు నేడు పెద్ద ఎత్తున సభ్యత నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కులాలు మతాలకు అతీతంగా బిజెపిలో సభ్యత్వం తీసుకుంటున్నారని మేకల సారంగపాణి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా నరేంద్ర మోడీ మీద అపారమైన నమ్మకంతో, మహిళలు యువకులు రెట్టింపు ఉత్సాహంతో బిజెపిలో చేరుతున్నారని గతంలో కంటే ఎక్కువ మెంబర్షిప్ పూర్తి చేస్తామని సారంగపాణి అన్నారు.టీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలు అక్రమాలు అవినీతి ప్రజలు విసిగి వేసారి పోయారని ప్రత్యామ్నయంగా దేశం కోసం ధర్మం బిజెపిని ఎంచుకుంటున్నారని రానున్న రోజులో బిజెపి దే తెలంగాణలో అధికారం అని నమ్ముతున్నారని సారంగపాణి తెలిపారు.గతంలో నిధులు నీళ్లు నిధులు నియామకాల పేరుతో కెసిఆర్ మోసం చేశాడని అందుకే ఆయనని ఇంటికి పంపించారని,ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదవారు నమ్మి ఓటేస్తే దిక్కులేని వారిగా వారి జీవితాలను రోడ్డుపాలు చేస్తున్నారని మేకల అన్నారు. ప్రజల ఇచ్చిన వాగ్దానాలు మరిచి ప్రజా సమస్యలను పక్కదారి మళ్లించడానికి చేయడానికి కుట్రలు చేస్తున్నారని, వారి కష్టాల్లో పేదల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందని వారికి అండగా ఉంటుందని మేకల సారంగపాణి తెలిపారు. బిజెపి కార్యకర్తలందరూ గడపగడపకు తిరిగి మహంకాళి సికింద్రాబాద్ జిల్లాలో 3 లక్షల మెంబర్ షిప్ చేపిస్తామని సారంగపాణి అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం అవసరమని గుర్తించారని అందుకే బిజెపి సభ్యత్వంలో అందరు పాల్గొంటున్నారని తెలిపారు. రానున్న ఏ



ఎన్నికలైన బిజెపి గెలుపే లక్ష్యంగా సభ్యత్వం సాగుతుందని మా టార్గెట్ ను కంప్లీట్ చేయడమే కాకుండా నిర్మాణాత్మకంగా బిజెపిని తీర్చిదిద్దుతామని మేకల సారంగపాణి అన్నారు. 6 గ్యారంటీలు అటకెక్కయి అని అభివృద్ధికి నిధులు లేవని అక్రమ పద్ధతుల ద్వారా భయాందోళనకు గురి చేస్తూ ప్రజా పోరాటాలను నిర్వీర్యం చేస్తున్నారని కాంగ్రెస్ దానికి సమాధానం చెప్పాలని మేకల సారంగపాణి అన్నారు. నరేంద్ర మోడీ గారు, కిషన్ రెడ్డి సహకారంతో సికింద్రాబాద్ పార్లమెంటులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ కార్యక్రమాలు నిత్యం అమలు చేస్తున్నామని ప్రజలు పెద్ద ఎత్తున బిజెపిలో చేరాలని సారంగపాణి విజ్ఞప్తి చేస్తున్నారు.

అమ్మమ్మల పాత్ర కుటుంబ వ్యవస్థలో కీలకం

నవతెలంగాణ-కల్చరర్

తల్లి జన్మ నిస్తే ప్రసవ అనంతరం బిడ్డ బాగోగులు చూసే బాధ్యత మన కుటుంబ వ్యవస్థలో అమ్మమ్మ లేనని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. అమ్మమ్మలు తల్లి పాత్ర పోషించి బిడ్డను ఆరోగ్యంగా తల్లికి అందిస్తారని వివరించారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై సరసిజ థియేటర్ ఫర్ ఉమెన్, లేఖిని మహిళా రచయిత్రులు వేదిక ఆధ్వర్యంలో ముగురమ్మలు - అమ్మమ్మలు పేరిట ఆత్మీయ పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వోలేటి పార్వతీశం దేవులపల్లి కృష్ణ శాస్త్రి సతీమణి రాజహంస పేరిట మనుమరాలు ఏర్పరచిన పురస్కారం విఖ్యాత గాయని వేదవతి ప్రభాకర్‌కు వోలేటి పార్వతీశం తన అమ్మమ్మ కందుకూరి రామ లక్ష్మి పేరిట ఏర్పరచిన పురస్కారం విఖ్యాత సినీ రచయిత ముళ్ళ పూడి వెంకట రమణ సతీమణి ముళ్ల పూడి శ్రీదేవి కి గుడివాడ అన్నపూర్ణ ఆత్మీయ సత్కారం చిత్ర కారిణి డాక్టర్ కె లక్ష్మీ రాఘవకు ప్రదానం చేసి మాట్లాడారు. ముగ్గురు పురస్కార గ్రహీతలు వారి వారి రంగాల్లో స్వయం శక్తి తో ఎదిగి రాణించిన వారని తెలిపారు. అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ విజయ లక్ష్మి మాట్లాడుతూ.. లేఖిని సంస్థను విఖ్యాత రచయిత్రి దివంగత డాక్టర్ వాస ప్రభావతి మహిళా రచయిత్రులు అందరినీ కలిపి లేఖిని సంస్థ ఏర్పాటు చేశారని ఆమె ఆశయాలు మేరకే సంస్థ ను నడిపిస్తున్నామనీ వివరించారు. వేదిక పై వంశీ రామరాజు డాక్టర్ ముక్తేవి భారతి , ఆలూరి విజయలక్ష్మి కృష్ణ కుమారి గౌరీ లక్ష్మీ మునిపల్లె వీణ పాల్గొన్నారు.



పేదలకు పునరావాసం కల్పించాక మూసీ ప్రక్షాళన చేపట్టాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ. అబ్బాస్

నవతెలంగాణ - ధూల్ పేట్

పేదలకు పునరావాసం కల్పించాకే మూసి సుందరీకరణ చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసి ప్రక్షాళన హైడ్రా నిరసిస్తూ సీపీఐ(ఎం) సౌత్ కమిటీ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునరావాసం కల్పించకుండా పేదల ఇళ్లను కూల్చివేస్తుంటే సీపీఐ(ఎం) పార్టీ చూస్తూ ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మూసి ఇరువైపులా 50 మీటర్ల దూరం నుంచి ఉన్న ఇండ్లను కూల్చివేస్తామంటూ ప్రభుత్వం ఇచ్చిన నోటీసుల కారణంగా ప్రజలు తమ భవిష్య జీవితాల కోసం ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆ నోటీసు చూసిన తర్వాత కొంతమంది హార్ట్ ఎటాక్ తో ఆసుపత్రి పాలయ్యారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్లాన్ అని, ఆ ప్లాను మేము అమలు పరచాల్సి వస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఈ మూడు పార్టీలే పరిపాలించాయని ఈ పార్టీల ఆధ్వర్యంలోనే చెరువుల ఆక్రమణ అయినా, మూసి ఇరువైపులా స్థలాలైనా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు ఉంటే వాటిని మేరి ఇష్టం వచ్చినట్టు చేసుకోండి అని కానీ మురికి కాలువల చుట్టూ చిన్న చిన్న గుడిసెలు నిర్మించుకొని 40, 50 సంవత్సరాల నుంచి చాలీచాలని సంపాదనతో జీవితాలీడుస్తున్న పేద ప్రజల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. దశాబ్దాల తరబడి ఇంత డబ్బు సమకూర్చి కొందరు గ్రామాలలో ఉన్న అర, ఒక ఎకరం భూములు అమ్ముకొని రోజువారి కూలీలుగా జీవనం సాగిస్తున్న వారు చిన్న చిన్న స్థలాలు కొనుక్కొని గుడిసెలు వేసుకొని బతుకుతున్న వారికి అన్యాయం చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తాము, ఇందిరమ్మ ఇల్లు ఇస్తాము, కట్టుకోవడానికి ఖర్చులు భరిస్తాము... అని చెప్తే ఇక్కడి నుంచి వాళ్ళు ఎటు వెళ్తారు? ఎక్కడ కట్టుకుంటారు? ఇక్కడ స్థిరపడి జీవనం కొనసాగిస్తున్న వారు నగరం అవతలకి వెళ్లి ఎలా బతుకుతారని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు నాణ్యత లేదని అవి ఎంత కాలం ఉంటాయో కూడా తెలియని పరిస్థితి ఉందని అన్నారు. అలాంటి ఇల్లు మాకు వద్దని మాకు ఇక్కడే మంచి భవనాలు కట్టించి మీరే వ్యాపారం చేసుకోండి అని అప్పజెప్తే అది అభివృద్ధి అవుతుంది కానీ లక్షల మందికి అన్యాయం చేసి వ్యాపార సంస్థలను నిర్మిస్తామంటే అది అభివృద్ధి ఎలా అవుతుందని ప్రశ్నించారు ఆ వ్యాపారమేంటో ఇక్కడి ప్రజల తోనే చేయించుకుంటే వారు బాగుపడతారు మీ ఆధ్వర్యంలో నగరం అభివృద్ధి అవుతుంది అని సూచించారు. సిపిఎం పార్టీ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు జి.విటల్, ఎం.మీనా మాట్లాడుతూ హైదరాబాదులోని బహదూర్పుర, కార్వాన్, గోషామాల్, చార్మినార్ మలక్పేట్ అంబర్పేట్ నుండి ఉప్పల్ ఆవుతలి వరకు లక్షల కుటుంబాలు చిన్నచిన్న రేకుల ఇంళ్ళు వేసుకొని ఉన్నారని తెలిపారు. అక్కడ ఇండ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్లు ఇచ్చిన పేపర్లు ఉన్నాయని, కరెంట్ మీటర్లు ఉన్నాయని, వాటర్ సప్లై ఉన్నదని అప్పుడు ఈ బఫర్ జోన్ అన్న విషయం తెలియదా? అని ప్రశ్నించారు. ఆ ప్రభుత్వాలే ఇప్పుడు తిరిగి తీసుకుంటామంటే అది వారిగోతి వారే తవ్వుకోవడం అని అన్నారు. ఇక్కడున్న పేద ప్రజలకు పక్కా ఇల్లు కట్టించి వారికి పని కల్పించిన తర్వాతనే ఈ మూసీ నది సుందరీకరణ అయినా బఫర్ జోన్ అభివృద్ధి అయినా చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు లేదా సీపీఐ(ఎం) పార్టీ ప్రజలను ఐక్యం చేసి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సభ్యులు ఎల్ కోటయ్య, అబ్దుల్ సత్తార్, జంగయ్య, పద్మానగర్ బస్తీ కమిటీ అధ్యక్షులు కె.నర్సిమ చారి, రాజు, సురేష్, గోవింద్ మూసి ఇరువైపులా కుటుంబాల ప్రజలు 150 మంది ఈ ధర్నాలో పాల్గొన్నారు.



రెడ్ల రాజ్యంలో మాల, మాదిగలు బలి

-పబ్బతి కృష్ణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉన్న ఉద్యోగాలు నింపకుండా రాజకీయ సమాధి చేసి మాల మాదిగల మధ్య తెగని పంచాయతీ పెట్టి 60 శాతం విద్య, ఉద్యోగం, రాజకీయ అధికారం పొందిన రెడ్లు ఎస్సీలలోని 60కులాల మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టారని పబ్బతి శ్రీకృష్ణ విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..తనకు అనుకూలమైన కుల సంఘాలను పిలిచి బుజ్జగించి నోరుమూసుకుని ఉండాలని ఉకూం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికి లేని మనువాదం రేవంత్‌కు ఉందన్నారు. 3శాతం ఉన్న రెడ్లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు, పార్టీ అధినేతలు, నామినేషన్ పదవులు ఎందుకు పొందుతున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. రేవంత్ వైకరి మార్చుకోకపోతే జరగబోయే ఎన్నికల్లో మాలలు తకిన బుద్ధి చెప్తామన్నారు.

భవిష్యత్తులో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మహ్మద్ అబ్బాస్

నవతెలంగాణ - ధూల్ పేట్

భవిష్యత్తులో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ అన్నారు. సీపీఐ(ఎం) చార్మినార్, బహదూర్పురా జోన్ మహాసభలు విజవంతంగా జరిగాయి. ఈ మహాసభలు కామ్రేడ్ రఘు జెండా ఆవిష్కరణ చేశారు. బాబర్ ఖాన్, గులాం నసీర్, జాహిదా బేగం అధ్యక్షత వహించిన ఈ మహసభలో కామ్రేడ్ విఠల్ రాజకీయ రిపోర్టు పెట్టారు. అనంతరం జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్ జోన్ రిపోర్టు ప్రవేశ పెట్టారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో నిర్వహించిన అనేక ఉద్యమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, సామాజికంగా రాజకీయంగా పోరాటాలు గుర్తు చేశారు. పై కమిటీల పిలుపులు కూడా అమలు చేయడం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోన్లో పార్టీని బలోపేతం చేయడానికి ప్రజా సంఘాలు సామాజిక సంఘాలు కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కోరారు. ప్రజాసంఘాల నిర్మాణం, శాఖ జోన్ కమిటీల సమావేశం నిరంతరం జరగాలని, దానికై మనమందరం కలిసి కృషి చేయాలని కోరారు. ఇప్పటివరకు మా జోన్లో హై స్కూల్స్ లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యంతో మాట్లాడి అనేక విద్యార్థులకు ఫీజులు తగ్గించగలిగామన్నారు. వైద్యం సమస్యలపై అనేక హాస్పిటల్స్ లో స్వయంగా వెళ్లి మాట్లాడి అక్కడ కూడా ఫీజులు తగ్గించడం జరిగిందన్నారు. ఫ్యామిలీ గొడవల్లో పోలీస్ స్టేషన్ వరకు వెళ్లి పోలీసులతో మాట్లాడి కుటుంబ సమస్యల్ని పరిష్కరించామన్నారు. పేదలకి పింఛన్లు ఇప్పించడంలో,రేషన్ షాపుల సమస్యలపై అనేక మంది పేద ప్రజల కు రేషన్ ఇప్పించామన్నారు. జహనుమా ప్రాంతంలో డ్రైనేజీ, మంచినీరు, విద్యార్థుల ఫీజుల పై, కరెంటు సమస్యపై కార్యాలయానికి వెళ్లి సమస్య పరిష్కరించడంలో కృషి చేశామన్నారు. పురాణపుల్లో మంచినీటి సమస్యలపై వాటర్ వర్క్స్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమాలు చేసి సమస్య పరిష్కారం చేశామని తెలిపారు. దూద్ బోలి సెంటర్ శాఖలో అనేక సంస్కృతి కార్యక్రమాలు నిరసన కార్యక్రమాలు అధిక ధరలపై ఆందోళనలు చార్మినార్ దగ్గర సెంటర్ ఆఫీస్ దగ్గర నిర్వహించామని గుర్తుచేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రెండోసారి కార్యదర్శిగా అబ్దుల్ సత్తార్ ఎన్నికయ్యారు. 11 మందితో జోన్ కమిటీ ఎన్నుకున్నారు. కమిటీలో కామ్రేడ్. మీనా, బాబర్ ఖాన్, గులాం నసీర్, షేక్ యాకూబ్, జాహిదా బేగం,మహేందర్, మహమ్మద్ మాజిద్ అలి, శామేష్, ఆబిద్అలి, యూనుస్ బేగం తదితరులున్నారు. కొత్త కమిటీ మెరుగైన ఫలితాలు సాధించాలని సలహాలు ఇస్తూ జిల్లా కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ సమావేశం ముగించారు. ఈ మహాసభలో స్థానిక జిల్లా కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఒత్తిడితో గుండె పోటు

అడ్వకేట్ డా.పి.స్వరూపారాణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఒత్తిడి ఎక్కువైతే గుండె పోటు వచ్చే అవకాశం ఉందని అడ్వకేట్, ఎం.ఎల్.సి భార్య డా.పి.స్వరుపా రాణి అన్నారు. సెప్టెంబర్ 29 న ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ , నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లో " ఒత్తిడి తో గుండె పోటు" అనే అంశంపై ముషీరాబాద్ రెయిన్ బో హెూం లో సెమినార్ నిర్వహించారు. బాలికలకు జి.కృష్ణవేణీ స్పాన్సర్ చేయగా సి. హెచ్.గోపాలకృష్ణ, పి.స్వరుపా రాణి, జ్యోతి రాజా, డా.హిప్నో పద్మా కమలాకర్ 3 నెలలకు విటమిన్ ట్యాబ్లెట్లు, పోషకాహారం, జోక్స్ పుస్తకాలు ఇవ్వడం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఒత్తిడి గుండె ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతూ గుండెపోటు వచ్చేలా చేస్తుందన్నారు. ప్రస్తుతం సమస్త రోగాలకు ఇదే కారణమని తెలిపారు. అసలు ఒత్తిడి అనేది ఎక్కడ మొదలవు తుందంటే..? నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఒత్తిడి మనిషిని నీడలా వెంటాడుతూనే ఉంటుందన్నారు. సిగరెట్లు, ఆహారపు అలవాట్లు, తగ్గిన శారీరక శ్రమ, మద్యపానం, ఒత్తిడి,అధిక వ్యాయామం ఇవన్నీ అనారోగ్యాలకు దోహదం చేస్తాయన్నారు.



అధిక రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, ఊబకాయం, చెడు జీవనశైలి యొక్క దుష్ప్రభావాలు గుండెకు హాని కలిగిస్తాయన్నారు. డా.హిప్నో పద్మా కమలాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారతదేశంలో 7,00,000 కంటే ఎక్కువ మంది వ్యక్తులు ఆకస్మిక గుండె పోటు ఫలితంగా మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలకు అవగాహన కోసం ప్రపంచ హృదయ దినోత్సవం 2024 యొక్క థీమ్ "యూజ్ హార్ట్ ఫర్ యాక్షన్" , ప్రపంచవ్యాప్తంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి చురుకైన చర్యలను ప్రోత్సహించడంపై దృష్టి సారించిందని తెలిపారు. శరీరాన్ని, మనసు ను రిలాక్స్‌గా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. సంతోషకరమైన జీవితాన్ని కోరుకుంటే మీ హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలన్నారు. ధూమపానం మానేయాలి, ఉప్పు, చక్కెరను తగ్గించాలన్నారు. డబ్బు మోజు లో మానవ సంబంధాలు పట్టించుకోవటం లేకపోవడం వల్ల గుండె పోటు వస్తుందన్నారు. 6 గంటల నిద్ర, చురుకుగా ఉండటమే కాకుండా హాయిగా నవ్వాలన్నారు. నవ్వు గుండెను ఆరోగ్యంగా ఉంచుతుందని అందుకే జోక్స్ పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. లయన్ సి.హెచ్.గోపాలకృష్ణ మాట్లాడుతూ మూడేళ్ళ వయసున్న చిన్నారుల దగ్గర నుంచి నూరేళ్ళ వృద్ధుల వరకు అందరూ అన్ని వయసులవాళ్ళు ఒత్తిడి బారీన పడుతూనే ఉన్నారన్నారు. చిన్న తనం నుంచే జంక్ ఫుడ్స్ అధికంగా తీసుకోవడం వల్ల యుక్తవయసులో గుండె పోటు వచ్చే అవకాశం ఉందన్నారు . పిల్లలు మరియు యువత లో నాళాలలో ఫలకాలు ఏర్పడి,చివరికి అవి మూసుకుపోయి గుండె పోటు వస్తుందన్నారు. అధిక బరువు, టైప్ 2 మధుమేహం మరియు అనేక రకాల ఇతర సమస్యలు టీనేజ్ మరియు మధ్య వయస్కులైన వ్యక్తులలో ఉండవచ్చని, టెస్ట్ లు చేయించుకోవాలిన్నారు. పిల్లలకు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేయాలన్నారు.ప్రపంచ హృదయ దినోత్సవం ప్రతి ఒక్కరూ గుండె వ్యాధులను నివారించడానికి గుండె-ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి చురుకైన చర్యలు తీసుకోవటానికి రిమైండర్ గా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సి. హెచ్. గోపాల్ కృష్ణ, లయన్ కృష్ణ వేణి, లయన్ జ్యోతి రాజా, రెయిన్ బో హెూం హెడ్ సదాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమతా నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-సిటీబ్యూరో



పాత బోయినపల్లి ఆర్‌బీఐ కాలనీ సమతానగర్‌లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో డాక్టర్ అనూష డెంటిస్ట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నుండి డాక్టర్ యశ్వంత్ వారి సిబ్బంది సంయుక్తంగా ఉచిత వైద్య సహాయ శిబిరం నిర్వహించినారు దాదాపు 100 మంది కాలనీవాసులకు దంత బీపీ షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ గారు ప్రారంభించినారు ఈ వైద్య సహాయ శిబిరం అసోసియేషన్ అధ్యక్షుడు బంతు లోహిదాస్ కార్యదర్శి గొట్టిపాటి నాగేశ్వరరావు సహాయ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి ఉపాధ్యక్షుడు రాంచందర్ రావు రాధాకృష్ణ నితిన్ మహిళా నాయకురాలు ఝాన్సీ సదాలక్ష్మి సుధా ప్రమీల మీనాక్షి కిరణ్మయి యువజన కన్వీనర్ రాకేష్ తదితరుల ఆధ్వర్యంలో దిగ్విజయంగా నిర్వహించబడినది. జిహెచ్ఎంసి సిబ్బంది సంపత్ కుమార్ సహకరించారు.

అక్కినేని జీవితం నటన విజ్ఞాన సర్వస్వం

ప్రణాళికా సంఘం ఉప అధ్యక్షుడు చిన్నారెడ్డి

నవతెలంగాణ- కల్చరర్



అక్కినేని నాగేశ్వరరావు జీవితం నటన రెండూ విజ్ఞాన సర్వస్వం నేటి తరాలకు పాఠ్య గ్రంథం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉప అధ్యక్షుడు డాక్టర్ జి చిన్నా రెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సీల్ వెల్ కార్పొరేషన్ శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ ఆదర్శ ఫౌండేషన్ ఆర్ఆర్ ఫౌండేషన్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్ వెల్ శ్రుతి లయ అక్కినేని జీవన సాఫల్య పురస్కారాలు బైస దేవ దాసు,వినాయక రావు, ఇమంది రామా రావు, షరీఫ్, హనుమంత రావు, మణి, మహేష్‌లకు మీడియా ప్రతిభా అవార్డ్సను పీవీ రమణారావు, ఏమ్ మనోహర్, రాజేష్ ఎండీ అబ్దుల్, ఎం. నాగరాజు శాంతి మంగి శెట్టి కృష్ణ వేణి భవాని సుష్మ ఈశ్వరి తేజస్వి వర ప్రసాద్‌లకు చిన్నారెడ్డి బహుకరించి మాట్లాడారు. మీడియాలో వివిధ స్థాయిలలో పని చేస్తున్న వారికి గురుతర బాధ్యత ఉంటుందని మారుతున్న కాలానికి అనుగుణంగా సామాజిక మాధ్యమాల పోటీలో తట్టుకొని నిలబడటానికి వారికి దీక్ష నిబద్ధత అవసరం అన్నారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అధ్యక్షత వహించిన వేదిక పై వంశీ రామరాజు పి బల్ రెడ్డి బొక్క భీం రెడ్డి కుసుమ భోగరాజు కళా రఫీ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భం గా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు సీల్ అక్కినేని స్ఫూర్తి పురస్కారాలు బహుకరించారు. ఆమని కార్యక్రమాన్ని నిర్వహించారు తొలుత ఆమని సుభాష్ రాజన్ నవిత శ్రీనివాస్ అనుష తదితరులు అక్కినేని సినిమా లలో నీ పాటలు సినీ సుస్వరాలు 63 శీర్షికన ఆలపించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
హైదరాబాద్
సోమవారం | సెప్టెంబర్ 30, 2024 | www.navatelangana.com

'హైడ్రా పేదల పాలిట కరోనాగా మారింది'

● భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరు వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేద ప్రజల పాలిట కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో బీభత్సం సృష్టిస్తున్న హైడ్రా పేదల పాలిట కరోనాగా మారిందని భారత లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరు వెంకట రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పట్టాలు ఉన్న మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేద నివాసితులకు ప్రత్యామ్నయం చూపించిన తర్వాతే అక్కడి నిర్మాణలను కూల్చాలని, పట్టా కలిగిన వారికి మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.వ్యాపార సముదాయాలకు ఆర్థిక సహాయం ప్రభుత్వమే అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళ చేతిలో మోసపోయా.. న్యాయం చేయండి

● ప్రభుత్వానికి బాధితుడు విజ్ఞప్తి

నవతెలంగాణ - బంజారా హిల్స్

ఉన్నత విద్యాభ్యాసం చేసి ఉన్నత ఉద్యోగం సంపాదించినా ఒక మహిళ చేతిలో మోసపోయానని, తనపై తప్పుడు కేసులు పెట్టడమే కాకుండా ఆమె వద్ద తన గాడ్జెట్‌లను పెట్టుకుందని కెవిన్ అనే యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉన్నత చదువులు చదివడమే కాకుండా సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూనే చలన చిత్ర రంగంలో ప్రొడ్యూసర్ గా కూడా రాణిద్దామని కలలు కన్నానని, ఒక మహిళ పరిచయం తనను ఇంతటి దీనస్థితికి తీసుకు వచ్చిందని అతను వాపోయాడు. మోసపోయిన విధానాన్ని వార్త పత్రికలో అచ్చును చూపిస్తున్న దృశ్యం.

బాలచెలమి గ్రంథాలయాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్తా..

● తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డా. రియాజ్



నవతెలంగాణ-అంబర్‌పేట

బాలచెలమి గ్రంథాలయ ప్రాముఖ్యతను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డా. రియాజ్ అన్నారు. ఆదివారం హిమాయత్ నగర్ ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్లో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ బాలచెలిమి గ్రంథాలయాల నిర్వహణపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చిల్డ్రన్స్ ఎడ్యుకేషల్ అకాడమీ, బాలచెలిమి, దక్కన్ ల్యాండ్ పత్రికల సంపాదకులు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డా.రియాజ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.వేదకుమార్ మాట్లాడుతూ చిల్డ్రన్స్ ఎడ్యుకేషల్ అకాడమీ లక్ష్యాలు, కార్యాచరణ గురించి అందులో భాగంగా సృజనాత్మక కార్యక్రమాల నిర్వహణతో 15 జిల్లాలలో బాల చెలిమి గ్రంథాలయాలు ఏర్పాటు చేశామని, 100 బాల చెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం తమ లక్ష్యమని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డా.రియాజ్ మాట్లాడుతూ బాల చెలిమి తెలంగాణ చైతన్యాన్ని కలిగించే ప్రదేశంగా చూస్తామని అనేక కోణాలలో కనిపించే అతి కొద్ది మందిలో వేదకుమార్ ముఖ్యులని కొనియాడారు. అతను వ్యక్తి కాదు, వ్యవస్థ అన్నారు. రాబోయే గ్రంథాలయ వారోత్సవలలో భాగంగా బాల చెలిమి వారియర్స్‌తో ఒక పూట సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. పుస్తక ప్రదర్శనశాలలో కూడా బాలచెలిమి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. బాలచెలమి గ్రంథాలయ ప్రాముఖ్యతను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట డిగ్రీకాలేజ్ లైబ్రేరియన్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, గవర్నమెంటు సిటీ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చెకోని రవికుమార్ గారు, రచయిత్రి డాక్టర్. అమరవాది నీరజ మహా అకాడమీ, డైరెక్టర్ మల్లికార్జున రావు సంఘసేవకుడు రాజలింగం తదితరులు విద్యార్థుల చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. ఈబాలచెలిమి గ్రంథాలయాల రాష్ట్ర కన్వీనర్ గరిపల్లి అశోక్, బాలా చెలిమి గ్రంథాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యనారాయణ యాదవ్ సేవలు మరువలేనివి



● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నవతెలంగాణ-అంబర్‌పేట

బద్దుల సత్యనారాయణ యాదవ్ యాదవ కులానికి తెలంగాణ ఉద్యమానికి కాచిగూడ డివిజన్‌లో ఎంతోమందికి సహాయ సహకారాలు అందించారని వారి సేవలు మరువలేని అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారంకాచిగూడ డివిజన్ పరిధిలోని బర్కత్‌పుర్‌లో తెలంగాణ యువతి మండలిలో బద్దుల సత్యనారాయణ యాదవ్ దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శరీరాన్ని నడిపించే ఇంజిన్ 'హృదయం'



● ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ అమన్ సాల్వాన్
● ఇందిరా పార్క్‌లో వరల్డ్ హార్ట్ డే వాక్

నవతెలంగాణ - ముషీరాబాద్

శరీరాన్ని నడిపించే ఇంజిన్ 'హృదయం' అని ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ అమన్ సాల్వాన్ తెలిపారు. ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) తెలంగాణ రాష్ట్ర చాప్టర్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని ఇందిరా పార్క్‌లో ఆదివారం వరల్డ్ హార్ట్ డే వాక్ నిర్వహించారు. ఈ వాక్ ను ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ అమన్ సాల్వాన్, కార్యదర్శి డాక్టర్ కృష్ణ మోహన్ లాలుకోట జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది రక్తాన్ని పంప్ చేస్తుందన్నారు. కణజాలం, అవయవాలకు ఆక్సిజన్, పోషకాలను అందిస్తుంది. ఆరోగ్యకరమైన గుండె లేకుండా శరీరం సరైన రీతిలో పని చేయదన్నారు.

హృదయ సంబంధ వ్యాధులు గుండె, రక్త నాళాలను ప్రభావితం చేసే అనేక రకాల పరిస్థితులు కలిగి ఇది హృదయ కండరానికి రక్తాన్ని సరఫరా చేసే కొరోనరీ ధమనులలో ఫలకం ఏర్పడటం వల్ల సంభవించే కరోనరీ ఆర్టరీ వ్యాధి (సీఏడీ)గా వర్గీకరించబడిందని తెలిపారు. ఇది గుండె నొప్పి, గుండెపోటు, గుండె వైఫల్యానికి దారితీస్తుందని అన్నారు. గుండె భాగానికి రక్తం సరఫరాలో అంతరాయం కలిగినా, తగ్గిపోయినా గుండెపోటు వస్తుంది. గుండె కణజాలం ఆక్సిజన్, పోషకాలను పొందకుండా నిరోధించడం, శరీర అవసరాలను తీర్చడానికి తగినంత రక్తాన్ని పంప్ చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఇది గుండెపోటు, అధిక రక్తపోటు, గుండె కండరాలతో సహా వివిధ పరిస్థితుల వల్ల సంభవించవచ్చని చెప్పారు.

క్యాన్సర్, హెచ్ఐవీ, మలేరియాతో ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ప్రపంచంలో ఈ మరణాలకు హృదయ సంబంధ వ్యాధులు ప్రధాన కారణమన్నారు. ఇది అవగాహన, నివారణ చర్యల ఆవశ్యకతను తెలియజేస్తుందన్నారు. గుండె ఆరోగ్యం ప్రాముఖ్యతపై అవగాహన కోసం ప్రతి సంవత్సరం ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. హృదయం పోషిస్తున్న కీలక పాత్రను గుర్తు చేయడానికి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ఏర్పాటు చేసిందన్నారు.

ప్రతి ఒక్కరూ అవయవదానం ప్రాముఖ్యతను తెలుసుకోవాలి



● అమ్మ ఐ అండ్ ఆర్గాన్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ గంజి ఈశ్వర లింగం

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రతి ఒక్కరరూ అవయవదానం ప్రాముఖ్యతను తెలుసుకోవాలని అమ్మ ఐ అండ్ ఆర్గాన్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ గంజి ఈశ్వర లింగం అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా అవయవ దానం దాని ప్రాముఖ్యత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా వసుధ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ వరలక్ష్మి, గంజి ఈశ్వర లింగం హాజరై మాట్లాడుతూ.. అవయవ దానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడి కొత్త జీవితాన్ని ప్రసాదించడానికి అవకాశం ఉంటుంది అని తెలిపారు. ఒక అవయవ దాత దాదాపు ఏడుగురి ప్రాణాలను కాపాడగలరని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరు అవయవదానం ప్రాముఖ్యతను తెలుసుకుని, ఇతరులకు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంన్నారు. అవయవ దానానికి సంబంధించిన అపోహలను నివృత్తి చేయడం ద్వారా మరింతమందికి అవయవదానంపై అవగాహన పెంచడమేకాకుండా లక్షలాది మంది జీవితాలను కాపాడవచ్చు అని అన్నారు. సాంప్రదాయాలు మూఢనమ్మకాలతో మనిషి చనిపోయిన తర్వాత ఎవరు నేత్రదానానికి చనిపోయిన బాడీని మెడికల్ కాలేజీకి ఇవ్వడం లేదన్నారు. మా అమ్మ ఆర్గాన్స్ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ మొత్తం ఆంధ్ర తెలంగాణ రెండు రాష్ట్రాలే కాక కర్ణాటక మహారాష్ట్రలో కూడా దీని యొక్క ఆవశ్యకతను ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు మా సంస్థ ద్వారా 1569 నేత్రాలను సేకరించి వందలాది మందికి కంటిచూపునదించడం జరిగిందన్నారు. బ్రెయిన్ డేట్ అయిన వ్యక్తుల వద్ద నుంచి 12 కిడ్నీలు ఆరు లివర్స్ లను ఒక హార్ట్ తెలంగాణ జీవన్ ద్వారా ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించామన్నారు. 183 డెడ్ బాడీలను ఆంధ్ర తెలంగాణలో ఉన్న అన్ని మెడికల్ కాలేజీలకు వైద్య విద్యార్థుల ప్రయోగాల కొరకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ సుబ్బరాజు, గత జోష్ణ, లక్ష్మణ్ రెడ్డి, పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన ఎస్ఐ.శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలి'



● కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

పోలీస్ ఉన్నతాధికారుల వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి డిమాండ్ చేసింది. సమితి ఆధ్వర్యంలో.. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో దళిత ప్రజా సంఘాల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, వికేసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర శ్రీనివాస్, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గద్దం సదానందం మాట్లాడుతూ ఎస్ఐ శ్రీనివాస్ చనిపోయి రెండు నెలలు కావస్తున్నా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. అతను చనిపోవడానికి కారకులైన సీఐ, కానిస్టేబుల్స్‌ను ఇంత వరకు అరెస్ట్ చేయకపోవడం శోచనీయమన్నారు. కేసును నిర్వీర్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల నష్టపరిహారం, అతని భార్య కృష్ణవేణికి గ్రూప్-2 ఉద్యోగం, పిల్లలను రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాస్ భార్య కృష్ణవేణి మాట్లాడుతూ.. నా భర్త చనిపోయి రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి సహాయం చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నా భర్త చావుకు కారకులైన వారి ముందస్తు బెయిల్ రద్దు చేసి నా కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షులు గురుమిళ్ళ రాజు, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, ప్రముఖ గాయకుడు మచ్చ దేవేందర్, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన, మాల మహానాడు జాతీయ నాయకులు పిల్లి సుధాకర్, బాధిత కుటుంబ సభ్యులు తల్లి కందిక కోమల, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలి'



● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నె శ్రీధర్
● కమిటీ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన, ధర్నా

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నె శ్రీధర్ డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నె శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేకమైన ఈ తీర్పుపై దేశ వ్యాప్తంగా నిరసన, ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ కులగణన చేపట్టకుండా ఎలా తీర్పు ఇస్తారని ఆయన ప్రశ్నించారు.రాష్ట్రంలో మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వర్గీకరణపై ఆర్డినెన్స్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు.వర్గీకరణపై ప్రభుత్వం వేసిన మంత్రుల కమిటీలో మాల ప్రతినిధులకు ఎందుకు చోటు కల్పించలేదని ప్రశ్నించారు. ఆ కమిటీ వల్ల మాలలకు ఒరిగేది ఏమి లేదన్నారు. వెంటనే ఆ కమిటీని రద్దు చేయాలని, వర్గీకరణపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ తో జ్యూడిషియల్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ జరిగితే మాలల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని, దీంతో మాల కులం అంధకారంలోకి నెట్టివేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓసీలకు ఏ ప్రాతిపదికన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు జనాభాకు మించి కల్పించేలా చేశారో మోడీ సర్కార్, సుప్రీంకోర్టు ధర్మాసనం ఎలా సమర్థిస్తున్నారో తెలపాలని ఆయన ప్రశ్నించారు. వెంటనే వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వేసిన మంత్రుల కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర కన్వీనర్లు పి.బల్వంత్ రావు, తాలూకా రాజేష్, చంద్రశేఖర్, నర్సింగ్ రావు, మల్లికార్జున్, జనార్ధన్, శ్రీకాంత్, కళ్యాణ్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో మానసిక ఆరోగ్యం..

● వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



నవతెలంగాణ - ధూల్ పేట్

చెడులకు దూరంగా ఉంటూ నైతిక విలువలతో జీవితం గడిపితే మానసిక ఆరోగ్యం కలుగుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జమాఅతె ఇస్లామీహింద్ ఉమెన్స్ వింగ్ నిర్వహించిన సభలో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అంశంపై ఆమె మాట్లాడారు. ముస్లిమ్ మహిళలు ఇంత పెద్ద ఎత్తున నైతిక విలువల ప్రచారం కోసం ఉద్యమించడం అభినందనీయమన్నారు. మహిళా సాధికారత అంటే ఆర్థిక సాధికారత మాత్రమే కాదని ఆరోగ్య సాధికారతనూ సాధించాలన్నారు. స్త్రీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. నలభై ఏళ్ల దాటిన మహిళలు క్రమంగా ఆరోగ్య పరీక్షలు చేసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే సమాజమూ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. రానున్న సమాజం బాగుంటాలంటే మన పిల్లల్ని నైతికంగా తీర్చిదిద్దాలన్నారు. ఒక సోదరిగా తనను ఆదరించిన జమాఅతె ఇస్లామీహింద్ మహిళా నాయకులను ఆమె అభినందించారు. జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి షాయిస్తా రఫత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రఫత్ మాట్లాడుతూ.. సొసైటీలో విద్యార్థులు వ్యసనాలకు బానిసై అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. తద్వారా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. నైతిక మార్గదర్శకాలు సంతోకర జీవితానికి మార్గం చూపుతాయని ఆమె పేర్కొన్నారు. బలమైన నైతిక భావాలు బలమైన సమాజానికి పునాదులని ఆమె అన్నారు. ఎంపీ కావ్యకు జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ విభాగం మహిళలు ఖుర్‌ఆన్ బహుకరించారు. ఈ సమావేశంలో ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు నాయకురాలు జలీసా సుల్తానా, ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్, నాసిరా ఖానమ్, పాల్గొన్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలి



● జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ నిరసన దీక్ష సన్నాహక కమిటీ

నవతెలంగాణ - ముషీరాబాద్

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను వెంటనే అక్కడి నుంచి తొలగించాలి అని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ నిరసన దీక్ష సన్నాహక కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద సన్నాహక కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, దమ్మాయిగూడ 13 వ వార్డు కౌన్సిలర్ రమేష్ గౌడ్, నిరసన దీక్ష సన్నాహక కమిటీ కన్వీనర్ పద్మాచారి, హాజరై మాట్లాడుతూ. జవహర్ నగర్ లోని డంపింగ్ యార్డ్ వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఈ డంపింగ్ యార్డ్ ను తొలగించాలని గత 11 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. డంపింగ్ యార్డ్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో చుట్టూ వాతావరణం పూర్తిగా కలుషితమై విషయమవుతుందన్నారు. మల్కాజ్గిరి కాప్రా పరిధిలో దాదాపు 18 లక్షల మంది జనాభా ఉన్నారని అనునిత్యం ఈ డంపింగ్ యార్డ్ వలన రోగాల బారిన పడుతూ తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నారన్నారు. భూగర్భ జలాలు కలుషితమై చర్మ సంబంధించిన వ్యాధులు ఆ నీటిని తాగిన ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి డంపింగ్ యార్డు ను తొలగిస్తాను అని చెప్పి మీడియా ముఖంగా హామీ ఇచ్చిన 8 నెలలు గడిచినా ఈ సమస్యపై స్పందించకపోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు.వెంటనే డంపింగ్ యార్డ్ తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాము అని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షలో కమిటీ సభ్యులు రామకృష్ణ గొగుల, మరం సామ్ రెడ్డి, సంజీవరెడ్డి శైలేష్ సందీప్, తదితర నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సేవలు చిరస్మరణీయం



● ఏపీ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (జీపీ) వివేకానంద

నవతెలంగాణ - ముషీరాబాద్

న్యాయవాదుల సేవలు చిరస్మరణీయమని వాటిని వెలకట్టలేమని ఏపీ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్(జీపీ) వివేకానంద అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బ్రాహ్మణ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన కేవీ సత్యనారాయణ వి.పరబ్రహ్మ శాస్త్రి పి.యాదగిరిరావు టీఎస్ ఆనంద్ అడ్వకేట్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భం గా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివేకానంద మాట్లాడుతూ.. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులు సమాజహితమే లక్ష్యంగా చేపట్టిన సేవా కార్యక్రమాలు అనేకం ఉన్నాయన్నారు. వివిధకేసుల్లో బాధితులకు ఉచి తంగా న్యాయ సేవలూ అందించి.. న్యాయవాద వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. వారి సేవలు ఎప్పటికీ మరువలేనివని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎల్. రవిచందర్, అంబడి పూడి సత్యనారాయణ, గిరిధ రావు, చెల్లా ధనుంజయ్, సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఎస్పీ సురేష్ కుమార్, ప్రభుత్వ న్యాయవాది మహేశ్, బార్ కౌన్సిల్ సభ్యుడు మధుసూదన్ రావు పాల్గొన్నారు.

బెదిరింపు.. బుల్డోజర్ ప్రభుత్వాల ఏకపక్ష నిర్ణయాలు తగవు..

● బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

బెరింపు.. బుల్డోజర్ ప్రభుత్వాల ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం సిక్స్ నెంబర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైడ్రా ద్వారా ప్రభుత్వ చర్యలకు వ్యతి రేకంగా చాలా మంది ప్రజలు తనను సంప్రదిస్తున్నారని చెప్పారు. దురదృష్టవశాత్తు హైడ్రా, ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా బాధితుల పక్షాన వాదించవద్దని న్యాయవాదులకు ఆర్ఆర్ బృందం నుండి ఆదేశాలు వెళ్లాయని ఆరోపించారు. న్యాయస్తానాలు కూడా ఈ సమస్యపై విచారణకు వెనకాడుతున్నాయ న్నారు. మానవతా ప్రాతి పదికన కాకపోయినా చట్టబద్ధతను పరిగణలోకి తీసుకున్నా అది ప్రభుత్వ భూమి తప్పా ప్రైవేటు పట్టా భూములు ప్రజాస్వా మ్యంలో బుల్డోజర్ చేయబడవని తెలిపారు. దుబాయ్ వంటి దేశాలు అత్యాధునిక సాంకేతికతతో మహాసముద్రాలలో ద్వీపా లను నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. నిజాం హయాంలో కేటాయించిన బఫర్ జోన్ కోసం పట్టుబట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. నిజాం హయాంలో కంటే ప్రస్తుతం హైదరాబాద్లో జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. పూర్వం హైదరాబాద్‌లో వ్యవసాయం సాగేది. చెరువులు, కుంటలు ఉండేవి. నేడు హైదరాబాద్ మొత్తం పట్టణీ కరణ కేంద్రంగా చెందిందని, నిజాం హయాంలో 15 లక్షల జనాభా ఉంటే నేడు 120 లక్షలకు చేరిందని, ఇప్పుడు ఈ చెరువులు, కుంటలు ఎందుకు అవసరమని ప్రశ్నించారు. నగర ప్రజలకు ఇంటి అవస రాలకు మాత్రమే నీరు అవసరమని, అది గోదావరి, కృష్ణా జలాల ద్వారా అందుతుందని వెల్లడించారు. హైడ్రా బుల్డోజర్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

స్మార్ట్ ఫోన్ వెలుగు నుంచి...

ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ లేకుండా జీవితం కొనసాగించడం కష్టంగా మారింది. అయితే మీకు తెలుసా మీ స్మార్ట్ ఫోన్ మీకు తెలియకుండానే ఎంతో నష్టాన్ని కలిగిస్తోంది. స్మార్ట్ ఫోన్ నుంచి వచ్చే వెలుగు నుంచి కంటి చూపును, ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలుసుకుందాం...

▸▸ మీరు ఎక్కువ సమయం ఫోన్‌తో గడిపేలా యాప్స్‌ను డిజైన్ చేస్తారు. కనుక యాప్స్ కు బదులుగా వెబ్ సైట్స్ విజిట్ చేయడం ప్రారంభించండి.



▸▸ మీ ఫోన్ లో ఉన్న Do Not Disturb అనే ఆప్షన్ ను తరచూ వినియోగించండి.

▸▸ బ్లూ టూత్ హెడ్ సెట్ వాడటం వల్ల మీ కళ్ల నుంచి ఫోన్ ను కాస్త దూరంగా ఉంచవచ్చు.

▸▸ టైమ్ చూసుకోవడానికి కూడా చాలా మంది స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. దానికి బదులు మీ రెగ్యులర్ వాచ్‌ను చూడటం ప్రారంభించండి. ఈ విధంగా మీ లైఫ్ స్టైల్లో ఈ చిట్కాలు పాటించి మీ కంటిచూపును కాపాడుకోవచ్చు. ■

భావోద్వేగాలు.. హార్మోన్లు

ఉమెన్ హెల్త్

సాధారణంగా భావోద్వేగాల గురించి మాట్లాడినప్పుడు లేదా ఆలోచించినప్పుడు వాటి దుష్ప్రభావాలపై మాత్రమే దృష్టిపెడతాం. ఎమోషనల్‌గా ఉంటే వారు బలహీనులు అనే భావన ఉంటుంది. ముఖ్యంగా స్త్రీలను భావోద్వేగపరులు అంటూ వారిని బలహీనులుగా అభివర్ణిస్తుం టారు. కానీ ఈ వ్యాసంలో నేను భావోద్వేగాలు, హార్మోన్ల సానుకూల అంశాల గురించి చర్చించాలనుకుంటున్నాను. భావోద్వేగాల ప్రాముఖ్యత, అవి కలిగించే ప్రయోజనాలు, మన ఆరోగ్యంపై అవి చూపించే సానుకూల ప్రభావాలు, మన శరీరంలోని హార్మోన్లపై వాటి ప్రభావం తదితర విషయాలను మానవి పాఠకులకు తెలియజేయాలనుకుంటున్నాను.





మనం సంతోషంగా, సానుకూలంగా ఆలోచించినప్పుడు మన శరీరంలో ఆక్సిటోసిన్, ఎండార్ఫిన్స్ వంటి హార్మోన్లు విడుదల అవుతాయి. ఇవి మన శరీరంలో పలు సానుకూల మార్పులను కలిగిస్తాయి. ఉదాహరణకు ఆక్సిటోసిన్ శరీరానికి విశ్రాంతిని అందించడంతో పాటు అనుబంధం, సంతోషం, ప్రేమ వంటి భావోద్వేగాలను పెంపొందిస్తుంది. ఎండార్ఫిన్స్ మానసిక ఆందోళనను తగ్గించి, మంచి ఆరోగ్యానికి దారితీస్తుంది. అలాగే మన లక్ష్యాలను సాధించినప్పుడు లేదా టార్గెట్లను పూర్తి చేసినప్పుడు డోపమైన్ అనే న్యూరోపెప్టైడ్ విడుదల అవుతుంది. ఇది మనకు సంతృప్తిని కలిగించే హార్మోన్. డోపమైన్ మానసిక ఉల్లాసాన్ని, ఫోకస్‌ను మెరుగుపరుస్తుంది.

ఆందోళనను తగ్గిస్తుంది

మనకు ఇష్టమైన రంగుల బట్టలు ధరించినప్పుడు ముఖ్యంగా పింక్ లేదా లావెండర్ కలర్‌తో మన శరీరంలో మెలటోనిన్ విడుదల అవుతుంది. ఇది మనకు గాఢ నిద్రను అందించడంలో సహాయపడుతుంది. అదే విధంగా ఆందోళనను తగ్గిస్తుంది. ఇంకా మనకు ఇష్టమైన వంటలు చేసుకున్నప్పుడు లేదా మన కుటుంబ సభ్యులకు ఇష్టమైన వంటలు చేసినప్పుడు, శరీరంలో విడుదలయ్యే న్యూరోపెప్టైడ్లు మనకు సంతోషాన్ని, ప్రశాంతతను కలిగిస్తాయి. మనకు ఇష్టమైన వ్యక్తులను కౌగిలించుకున్నప్పుడు మనకు రక్షణ, సురక్షితమైన అనుభూతి కలుగుతుంది. ఇది మన ఆందోళనను తగ్గించి, నెగిటివ్ భావోద్వేగాలను తగ్గిస్తుంది. రక్తపోటు కూడా తగ్గిస్తుంది.

ప్రతి కణంపై ప్రభావం

మన శరీరంలో భావోద్వేగాలకు సంబంధించిన అనేక మాలిక్యూల్స్ ఉంటాయి. ఈ మాలిక్యూల్స్ మన శరీరంలోని ప్రతి కణంపై ప్రభావం చూపుతాయి. ప్రఖ్యాత న్యూరోసైంటిస్ట్ డా. కాండేస్ పర్ట్ రాసిన 'మాలిక్యూల్స్ ఆఫ్ ఎమోషన్స్' అనే పుస్తకం ఈ అంశంపై లోతుగా చర్చిస్తుంది. ప్రతి ఒక్కరు చదవవలసిన పుస్తకమిది. ఇదే సమయంలో ఈ వ్యాసం మహిళలకు ప్రధానంగా ఉద్దేశించబడినందున వారికి సంబంధించి కొన్ని హార్మోన్ల ప్రభావాలను వివరించాలి. ముఖ్యంగా రుతుచక్ర సమయంలో, ఎస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ వంటి హార్మోన్లు విడుదలై వాటి స్థాయిల్లో ఎన్నో మార్పులు జరుగుతాయి. ఇవి మహిళల భావోద్వేగాలపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతాయి.

సానుకూలంగా మార్చుకోవడం



మన భావోద్వేగాలను మనం సానుకూలంగా ఎలా మార్చుకోవాలి? ఆనందాన్ని, ప్రశాంతతను పొందేందుకు మన శరీరంలో సహజసిద్ధంగా జరిగే ఈ హార్మోన్ల ప్రభావాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి? మన ఆలోచనలు, పనులు, ప్రవర్తన సానుకూలంగా ఉంటే, శరీరం కూడా అదే పద్ధతిలో స్పందిస్తుంది. భావోద్వేగాలు మన ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. రాబోయే వ్యాసాల్లో, ఈ సానుకూల భావోద్వేగాలను ఇంకా మెరుగ్గా ఎలా పెంపొందించుకోవచ్చో చర్చిస్తాను. ■



Dr.Prathusha. Nerella
MD(General Medicine) CCEBDM;
CCGDM; NLP; FID
Award winning Holistic Health Physician; 12+ years of Experience; 10000+ patients treated.
8897684912/040-49950314



సక్సెస్ సాధించాలంటే...

జీవితంలో సక్సెస్ అనేది ఎవ్వరికీ అంత ఈజీగా వచ్చేది కాదు. ఎంతో కష్టపడితే కానీ అనుకున్నది సాధించలేం. ఇంతకీ విజయం సాధించడానికి ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయాలు ఏంటి ? జీవితాన్ని ఎలా మల్చుకుంటే విజయం సాధించగలమో తెలుసుకోవాలంటే ఇదిగో ఈ 10 పాయింట్లపై ఓ లుక్కేయండి!

సంతోషం: సంతోషం, ఆనందం అనేవి కేవలం ఫీలింగ్స్ మాత్రమే కావు.. అదొక లైఫ్ స్టైల్ లాంటిది. మీరు చేసే పనితో మీకు సంతృప్తి లేనట్టయితే, అందులో విజయాన్ని పొందడం కష్టం. అందుకే చేసే పనిని ఇష్టంగా చేయడం అలవాటు చేసుకోండి. అందులోనే సగం విజయం మీ సొంతమైపోతుంది.

నమ్మకం: నమ్మకం ఒక్కటే మిమ్మల్ని బలంగా మార్చగలదు. చేసేపని పట్ల నమ్మకం కలిగి వుండండి. ఏదైనా సాధించగలం అని బలమైన నమ్మకం కలిగి వుండండి. అప్పుడే అసాధ్యం కూడా సుసాధ్యం అవుతుంది.

లక్ష్యం: లక్ష్యం లేని జీవితం వ్యర్థం. జీవితంలో పైకి ఎదగాలంటే ముందుగా ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఆ లక్ష్య సాధనకి కృషి చేయాలి.

పట్టుదల: మీరు చేసే పని ఏదైనా పట్టుదల ప్రదర్శించండి. మనం చేయడానికి ఇప్పుడు ఇదొక్క పనే వుందన్నట్టుగా పట్టుదలతో పనిచేయండి. మీకున్న పట్టుదలే మీకు విజయాన్ని సాధించిపెడుతుంది.

స్ఫూర్తి: నచ్చిన విషయాల నుంచి, వ్యక్తుల నుంచి స్ఫూర్తి పొందండి. ఆ ప్రేరణే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. విజయం వరకు వెంట తీసుకెళ్తుంది.

విశ్వాసం: మీరు తలుచుకుంటే చేయలేనిది అంటూ ఏదీ లేదు. దృఢమైన విశ్వాసం ఒక్కటే మిమ్మల్ని విజయవంతమైన మనిషిగా తీర్చిదిద్దుతుంది. మీలో వున్న శక్తిని మీరే నమ్మకపోతే ఇంకెవరు నమ్ముతారు. అది గ్రహించినప్పుడే విజయం మీ దరి చేరుతుంది.

విలువలు: విలువలు పాటించే విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దు. ఎందుకంటే విలువలు లేకుండా అడ్డదారిలోనూ విజయం సాధించొచ్చేమో కానీ ఆ విజయాలకి అంత విలువ వుండదు అని గ్రహించాలి. విలువలు లేని విజయం మీకు సరైన వ్యక్తిత్వం లేకుండా చేస్తుందనే సత్యాన్ని తెలుసుకోవాలి.

జీవితం పట్ల అవగాహన: జీవితం ఎలా వుండాలి అనే విషయంలో ఒక సరైన అవగాహన వుండాలి. జీవితం అలా వుండటం కోసం కృషిచేయాలి. అప్పుడే మీ కలలు నిజం అవుతాయి.

సిద్ధంగా వుండాలి: జీవితంలో ఎప్పుడైనా, ఏ సవాళ్లయినా ఎదురు కావచ్చు. ఆ సవాళ్లను ఎదుర్కోవడానికి వెనుకాడకుండా సిద్ధంగా వుండాలి.

వినయం, మర్యాద: జీవితంలో ప్రతీదీ నాకే తెలుసు! ఇక నేను నేర్చుకోవాల్సింది అంటూ ఏమీ లేదు అని అనుకోవద్దు. ఒకవేళ అలా అనుకున్నట్టయితే, ఆ క్షణమే సర్వం కోల్పోగలవు. అవతలి వారి నుంచి నేర్చుకోవాలనే జిజ్ఞాస, వారి పట్ల వినయ విధేయతలు, మర్యాదలు కలిగి వుండటమే అసలైన విన్నర్ లక్షణం. ■

లీగల్ నోటీసులకు భయపడేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. "సీఎం బావమరిదికి చెందిన శోధ కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ కట్టబెట్టింది నిజం. అవినీతి నిరోధక చట్టంలోని 7, 11, 13 సెక్షన్లను సీఎం ఉల్లంఘించారు. బావమరిదితో లీగల్ నోటీసు పంపితే భయపడతాననుకున్నారా? బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోం. రెండేండ్లలో రూ.2కోట్లు మాత్రమే లాభం ఆర్జించిన చిన్న కంపెనీ శోధ. ఆ కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ ఎలా కట్టబెట్టారు? ఢిల్లీలో ఉన్న బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడటం కష్టమే. ఈ దేశంలో న్యాయవ్యవస్థ బలంగా, నిజాయితీగా ఉన్నది. ఆదర్శ్ కుంభకోణంలో అశోక్‌చవాన్‌లాగా నీకు శిక్ష తప్పదు" అని కేటీఆర్ ఎక్స్ వేదికగా మరోసారి ఆరోపణలు చేశారు.

బీఆర్ఎస్‌ది మొసలి కన్నీరు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయం చూపిస్తామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా బాధితులకు ఉపాధి కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించి, అందులో చిన్నారులను ఆరేండ్లపాటు చదివిస్తామని తెలిపారు. స్వయం సహాయక మహిళా గ్రూపులకు వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తామన్నారు. రివర్ బెడ్ గుర్తించే నివాసాలకు కూడా భూసేకరణ చట్టం 2013 ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. మూసీ మాస్టర్ ప్లాన్ బ్లూ ప్రింట్ తయారు చేశామన్నారు, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న సంస్థలనే ఆహ్వానిస్తున్నామనీ, బీఆర్ఎస్ పార్టీ సమస్యను భూతద్దంలో పెట్టి చూపించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. మల్లన్న సాగర్ భూనిర్వాసితుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో అందరికీ తెలుసన్నారు. మల్లారెడ్డి అనే రైతు చితిపెట్టుకుని చనిపోయారని గుర్తు చేశారు. 2013 భూనిర్వాసితుల చట్టాన్ని అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జీవో తీసుకువచ్చిందని విమర్శించారు. మల్లన్న సాగర్ భూనిర్వాసితుల విషయంలో బీఆర్ఎస్ సర్కారుకు అనేక సార్లు హైకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. భూనిర్వాసితులపై మాట్లాడే నైతిక హక్కు వారికి లేదని స్పష్టం చేశారు. డబ్బులిచ్చి ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. బిల్డర్ల చేతిలో మోసపోయిన పేదలు, మధ్యతరగతి వారి నివాసాల విషయంలో ప్రభుత్వం తొందరపడబోదని, ఎవరూ ఆందోళన పడొద్దని చెప్పారు. మూసీ, హైడ్రా విషయంలో అనుమానాలు ఉంటే అన్ని కలెక్టరేట్లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తామన్నారు. చట్టబద్ధంగా, ప్రణాళికాయుతంగా మూసీ, హైడ్రాపై సర్కారు ముందుకు పోతున్నదని వెల్లడించారు. అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు ఉంటాయని చెప్పారు. అపార్ట్‌మెంట్ నిర్వాసితులకు ఏ రకంగా న్యాయం చేయాలన్న దానిపై సీఎం ఆలోచిస్తున్నారన్నారు. 1920లో కూడా మూసీపై కట్టడాలు తొలగించి ప్రత్యామ్నాయం చూపించారని గుర్తు చేశారు. రాష్ట్రానికే గ్రోత్ ఇంజన్ ఇవ్వాలన్న ఉద్దేశంతోనే మూసీ ప్రక్షాళన జరుగుతున్నదని వెల్లడించారు.

సీపీఐ(ఎం) సమన్వయకర్తగా ప్రకాశ్ కరత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) సమన్వయకర్తగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్‌ను కేంద్ర కమిటీ నియమించింది. ఈ మేరకు ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. రెండు రోజుల పాటు జరిగే కేంద్ర కమిటీ సమావేశాలు ఆదివారం హరికిషన్ సింగ్ సుర్జీత్ (హెచ్‌కేఎస్) భవన్‌లో ప్రారంభమయ్యాయి. తొలుత ఇటీవలి మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఎం లారెన్స్, పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు ఆర్.సత్యనారాయణ రాజు (ఆర్ఎస్), త్రిపుర రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు సమీర్ చక్రవర్తి, సమర్ ఆద్య, అసోం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు నూరుల్ అమిన్, త్రిపథ్ నాథ్ చక్రవర్తి, వియత్నాం కమ్యునిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి న్గుయెన్ ఫు ట్రోంగ్, త్రిపురలో బిలోనియా సబ్ డివిజన్ కమిటీ సభ్యులు బాదల్ షిల్ మరణానికి సంతాపం తెలుపుతూ కేంద్ర కమిటీ తీర్మానాన్ని ఆమోదించింది. అనంతరం జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై చర్చ ప్రారంభమయింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీలకు సమన్వయ కర్తగా ప్రకాశ్ కరత్‌ను ఉంచాలని నిర్ణయించింది. 2025 ఏప్రిల్‌లో తమిళనాడులోని మధురైలో పార్టీ 24వ మహాసభ వరకు ఆ బాధ్యతల్లో ప్రకాశ్ కరత్ కొనసాగనున్నారు. పార్టీ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆకస్మిక మరణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటనలో పేర్కొంది. ఈ సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, బి.వి. రాఘవులు, సూర్యకాంత్ మిశ్రా, సుభాషిణి అలీ, ఎండీ సలీం, ఎంఏ బేబి, తపన్ సేన్, జి.రామకృష్ణ, ఎ. విజయరాఘవన్, నీలోత్పల్ బసు, అశోక్ ధావలే, రామచంద్రడోమ్, గోవిందన్ మాస్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్, హేమలత, పుణ్యవతి, జి.నాగయ్య, సీహెచ్ సీతారాములు, బి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉదయనిధి స్టాలిన్

(మొదటిపేజీ తరువాయి)



బెయిల్‌పై విడుదలైన మాజీమంత్రి సెంథిల్ బాలాజీ మంత్రిగా ప్రమాణం

భాగంగా మొత్తం నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. మనీలాండరింగ్ కేసులో జైలుకు వెళ్లి, రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన మాజీమంత్రి సెంథిల్ బాలాజీ మంత్రిగా ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. గోవి చెళియన్, ఎస్ఎం నాజర్, ఆర్.రాజేంద్రన్‌లు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సెంథిల్‌కు విద్యుత్, ఎక్సైజ్ శాఖ, చెళియన్‌కు విద్యాశాఖ, నాజర్‌కు మైనార్టీ వ్యవహారాలు, రాజేంద్రన్‌కు పర్యాటక శాఖలను కేటాయించారు. పునర్వ్యవస్థీకరణ సాధారణమైనదే అయినప్పటికీ.. ఈసారి ఉదయనిధికి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు అప్పగించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న ఉదయనిధి ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మళ్లీ ప్రమాణం చేయలేదు.ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడిన ఆయన ఉపముఖ్యమంత్రి అనేది తనకు పదవి కాదని, ఓ పెద్ద బాధ్యతని అన్నారు. మరోవైపు ఉదయనిధికి డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. ప్రజాస్వామ్యం పేరుతో కుటుంబం పాలన కొనసాగుతుందని, రాష్ట్రానికి ఇదో చీకటి రోజు అని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి.

సినిమా నుంచి డిప్యూటీ సీఎం..

నవంబర్ 27, 1977లో జన్మించిన ఉదయనిధి స్టాలిన్.. డిగ్రీ పూర్తైన తర్వాత సినిమా రంగంలో అడుగుపెట్టారు. ప్రొడ్యూసర్/ డిస్ట్రిబ్యూటర్‌గా.. చివరకు నటుడిగా మారారు. డీఎంకే తమిళ వార్తా పత్రిక మురసోలీ బాధ్యతలు చూశారు. కొంతకాలానికి పార్టీ కార్యక్రమాలు చూసుకోవడం మొదలుపెట్టారు. 2019లో డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేస్తూ అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచారానికి మరింత పదును పెంచిన ఆయన..కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏని లక్ష్యంగా చేసుకొని '29 పైసా పీఎం' పేరుతో ప్రచారంలో దూసుకెళ్లారు.అయితే, దివంగత కరుణానిధి తన కుమారుడు ఎంకే స్టాలిన్‌ను డిప్యూటీ సీఎంగా చేసినట్టుగానే ఉదయనిధి కూడా ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, మూడు దశాబ్దాల పాటు రాజకీయ అనుభవం పొందిన (నాలుగుసార్లు ఎమ్మెల్యే, చెన్నై మేయర్) తర్వాత ఎంకే స్టాలిన్‌కు కీలక పదవి దక్కగా.. ఉదయనిధి మాత్రం అనతికాలంలోనే డిప్యూటీ సీఎం పగ్గాలు చేపట్టడం గమనార్హం.

పెద్దలకో న్యాయం.. పేదలకో న్యాయమా?

(మొదటిపేజీ తరువాయి)

విశ్వాసం కోల్పోవద్దని సూచించారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, న్యాయపరంగా కూడా కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. బుల్డోజర్లు ఇండ్లు కూల్చాల్సి వస్తే ముందుగా తమ మీది నుంచే వెళ్లాలని అన్నారు. పెద్దలకు ఓ న్యాయం.. పేదలకు ఓ న్యాయమా.. అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని హైదర్షాకోట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకుల బృందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా మూసీ బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా హైదర్‌షాకోట్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడును బీఆర్ఎస్ నాయకులతో చెప్పుకున్నారు. అన్నీ పర్మిషన్లతో ఇండ్లు కట్టుకున్నామని, తమ ఇండ్లను కూల్చొద్దని వేడుకున్నారు. అర్ధాంతరంగా తమ ఇండ్లను కూల్చితే ఎటు పోవాలని.. తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకున్నారు. ప్రాణాలు పోయినా ఇండ్లను వదులుకోబోమని స్పష్టం చేశారు. తమ బాధలు చెప్తూ నిండు గర్భిణి, చిన్నారి కంటతడి పెట్టడం అందరినీ కలిచివేసింది.


ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి హిట్లర్‌లా వ్యవహరిస్తున్నారని అన్నారు. సుందరీకరణ పేరుతో పేదలను రోడ్డు పాలు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. దేశాన్ని కాపాడే సైనికులకే వారి ఇండ్లను కాపాడుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. కొడంగల్‌లోని రెడ్డికుంటలో సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు ఉందని, అతని సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ముందుగా అవి కూల్చిన తరువాతే పేదల వద్దకు రావాలన్నారు. ఇందిరమ్మ పాలన అంటే పేదలకు బతుకులను కూల్చడమా.. అని ప్రశ్నించారు. ఒకవైపు ఢిల్లీలో రాహుల్ గాంధీ బుల్డోజర్ల పాలనపై పోరాడుతుంటే.. ఇక్కడ సీఎం రేవంత్ మాత్రం బుల్డోజర్ల పాలన సాగిస్తున్నారని అన్నారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. పార్టీ హస్తం గుర్తు తీసేసి బుల్డోజర్ గుర్తు పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడానికి డబ్బులు లేవు గానీ మూసీ సుందరీకరణకు లక్ష కోట్లు ఎక్కడివని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, కౌశిక్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, మధుసూదనచారి, నవీన్‌కుమార్‌రెడ్డి, శాసన మండలి మాజీ చైర్మెన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, బండ్లగూడ కార్పొరేషన్ అధ్యక్షులు రావులకోళ్ళ నాగరాజు, కోశాధికారి, కార్పొరేటర్ మంద రవీందర్‌రెడ్డి, బండ్లగూడ, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతం మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునేలా ఖరారు చేస్తున్నట్టు తెలిపారు. వివిధ ప్రత్యామ్నాయాల గురించి లోతైన చర్చల తర్వాత, ముఖ్యమంత్రి మెట్రో రెండో దశ కారిడార్‌లను ఆమోదించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్ 4.. నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు దాదాపు 36.6 కి.మీ కవర్ చేస్తుంది. ఎల్బీ నగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ ఆస్పత్రి, డీఆర్‌డీవో, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్, న్యూహైకోర్టు, శంషాబాద్ జంక్షన్ ద్వారా ఎన్‌హెచ్ మీదుగా ఈ మార్గం ఉంటుంది. ఈ ఎయిర్‌పోర్ట్ లైన్ వరుసగా నాగోల్, ఎల్బీ నగర్, చాంద్రాయణగుట్ట వద్ద ఉన్న అన్ని మెట్రో లైన్‌లకు అనుసంధానిస్తారు. అలాగే 1.6 కి.మీ భూగర్భంలో వెళ్తుంది. ఈ మార్గంలో భూగర్భ స్టేషన్ అయిన ఎయిర్‌పోర్ట్ స్టేషన్‌తో సహా మొత్తం 24 మెట్రో స్టేషన్లు ఉంటాయి. అలాగే, రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు కారిడార్-5 మార్గం ఉంటుంది. బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్‌రామ్ గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ నియోపోలిస్ మీదుగా బ్లూ లైన్ పొడిగింపుగా నిర్మితమవుతుంది. ఇది మొత్తం ఎలివేటెడ్ కారిడార్. ఇందులో దాదాపు 8 స్టేషన్లు ఉంటాయి.

ఓల్డ్ సిటీ మెట్రో కారిడార్-6.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ లైన్.. గ్రీన్‌లైన్ పొడిగింపుగా నిర్మించనున్నారు. ఓల్డ్ సిటీలోని మండి రోడ్ మీదుగా దారుల్‌షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నుమా మీదుగా ప్రయాణిస్తుంది. కారిడార్ సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఈ పేర్లనే వాటి చారిత్రక ప్రాముఖ్యత కారణంగా స్టేషన్ పేర్లుగా ఉంచనున్నారు. ప్రస్తుతం దారుల్‌షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మధ్య 60 అడుగుల రోడ్డు.. శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 80 అడుగుల రోడ్డు ఏకరీతిగా 100 అడుగులకు విస్తరించనున్నారు. స్టేషన్ ఉండే ప్రాంతాల్లో మాత్రం 120 అడుగులకు రోడ్లు విస్తరిస్తారు. రోడ్డు విస్తరణ, మెట్రో అలైన్‌మెంట్‌లో దాదాపు 1100 ఆస్తులు ప్రభావితమవుతున్నాయి. ప్రభావితమైన 400 ఆస్తులకు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశారు. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. ఈ మార్గంలో దాదాపు 103 మతపరమైన, వారసత్వ, ఇతర సున్నితమైన నిర్మాణాలున్నాయి. వాటన్నింటికీ తగిన ఇంజినీరింగ్ పరిష్కారాలు, మెట్రో పిల్లర్ స్థానాల సర్దుబాటు ద్వారా వాటికి భంగం కాకుండా చూస్తున్నారు. 6 స్టేషన్లతో పూర్తి ఎలివేటెడ్ మెట్రో కారిడార్ ఇది. ముంబై హైవేపై రెడ్‌లైన్ పొడిగింపుగా కారిడార్-7ను నిర్మించనున్నారు. ప్రస్తుతమున్న మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి ప్రారంభించి, పటాన్‌చెరు వరకు 13.4 కి.మీ లైన్ ఇది. ఆల్విన్ క్రాస్ రోడ్, మదీనాగూడ, చందానగర్, బీహెచ్‌ఈఎల్, ఇక్రిసాట్ మీదుగా



వెళ్తుంది. ఇది దాదాపు 10 స్టేషన్లతో ఉండే పూర్తి ఎలివేటెడ్ కారిడార్. అలాగే, విజయవాడ హైవేపై ఎల్బీ నగర్ వైపు నుంచి రెడ్ లైన్ పొడిగింపుగా కారిడార్ 8ని నిర్మించనున్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఈ 7.1 కిమీ కారిడార్ ఇది. చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, ఆర్టీసీ కాలనీ మీదుగా వెళుతుంది. ఈ పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌లో దాదాపు 6 స్టేషన్లు ఉంటాయి.

ఇక సీఎం ప్రత్యేక దృష్టి సారించిన ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీ లైన్ కోసం అనేక ఆకర్షణీయమైన ఫీచర్లతో వినూత్న రీతిలో డీపీఆర్ తయారు చేస్తున్నారు. ఇది ఆర్జీఐఏ- ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) వరకు ఉంటే ఈ కారిడార్ 9.. 40 కి.మీ.. ఉంటున్నట్టు అంచనా. ఈ కొత్త లైన్ డీపీఆర్ మినహా మిగిలిన డీపీఆర్‌లను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీ కోసం సుమారు రూ.8,000 కోట్లతో కలిపి మొత్తం రెండవ దశ ప్రాజెక్ట్‌కు అయ్యే వ్యయం దాదాపు రూ.32,237 కోట్లుగా అంచనా వేశారు. ఇతర భారతీయ నగరాల్లోని ఇతర మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్‌గా దీన్ని అమలు చేయడానికి ప్రతిపాదించారు. ఇదిలావుంటే మొదటి దశలో 3 కారిడార్లలో 69 కి.మీ. మేర మెట్రో సేవలందిస్తోంది. రెండో దశలో మరో 6 కారిడార్లలో 116.2 కి.మీ. మేర మెట్రో ప్రయాణించనుంది. రెండో దశ పూర్తయితే మొత్తం 9 కారిడార్లలో 185 కి.మీ. మెట్రో పరుగులు పెట్టనున్నది.

మూడు రకాల మట్టితో 86 పిచ్‌లు

40 ఎకరాల సువిశాల ప్రాంగణం. దేశంలోని భిన్న ప్రాంతాల నుంచి సేకరించిన మూడు రకాల మట్టితో 86 పిచ్‌లు ఏర్పాటు. క్రికెట్ నైపుణ్యంతో పాటు ఫిట్‌నెస్ సాధనకు అథ్లెటిక్స్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ సహా మరెన్నో సదుపాయాలతో బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆదివారం ఆవిష్కరించింది. బెంగళూర్ విమానాశ్రయానికి చేరువగా ఉన్న బీసీఈ 2025 నుంచి భారత క్రికెట్‌కు చిరునామాగా నిలువనుంది.

- అవుట్‌డోర్, ఇండోర్‌లో 45 ప్రాక్టీస్ పిచ్‌లు
- అధునాతన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆవిష్కరణ
- 40 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు

నవతెలంగాణ-బెంగళూర్



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 16 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. బెంగళూర్ శివారు ప్రాంతంలో 40 ఎకరాల సువిశాల క్యాంపస్‌లో బీసీసీఐ నేషనల్ క్రికెట్ అకాడమీని ఆదివారం ప్రారంభించింది. కొత్త ప్రాంగణంలో ఎన్‌సీఏ ఇక నుంచి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉండనుంది. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్ని, కార్యదర్శి జై షా, ఆఫీస్ బేరర్లు రాజీవ్ శుక్లా తదితరులు ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. 2025 ప్రథమార్థం నుంచి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెటర్లకు అందుబాటులోకి రానుంది. ట్రైనింగ్, స్పోర్ట్స్ సైన్స్, రిహాబిలిటేషన్, ఇంజూరీ మేనేజ్‌మెంట్‌కు ఇక నుంచి బీసీఈ కేంద్రంగా పని చేయనుంది. ప్రస్తుతం చిన్నస్వామి స్టేడియం ప్రాంగణంలోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)ని దశల వారీగా బీసీఈకి తరలించనున్నారు. బీసీసీఐ, కర్నాటక క్రికెట్ సంఘం (కెఎస్‌సీఏ) అభ్యర్థన మేరకు కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం 2008లో 40 ఎకరాల భూమి కేటాయించింది. కానీ న్యాయపరమైన చిక్కులతో భూమి బీసీసీఐ చేతికి రాలేదు. 2020లో లీగల్ సమస్యలను అధిగమించి 2022 ఫిబ్రవరిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు భూమిపూజ చేశారు. చిన్నస్వామి స్టేడియం ప్రాంగణంలో 2000 నుంచి ఎన్‌సీఏ కొనసాగుతుంది. ఇటువంటి సదుపాయాలు ఇప్పటివరకు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాకు మాత్రమే ఉండేవి. తాజాగా ఆ జాబితాలోకి భారత్ సైతం చేరింది.

ముచ్చటగా మూడు గ్రౌండ్లు

ఐసీసీ నిబంధనలకు అనుగుణంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు ఆతిథ్యం ఇవ్వగల మూడు గ్రౌండ్లను ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రధాన గ్రౌండ్‌కు అత్యాధునిక ఫ్లడ్‌లైట్లు, సబ్ ఎయిర్ డ్రైనేజీ వ్యవస్థ, ప్రసార సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ముంబయి నుంచి తెప్పించిన ఎర్ర మట్టితో 13 ఎర్ర మట్టి పిచ్‌లను తయారు చేశారు. ఇక నుంచి భారత్-ఏ జట్టు మ్యాచులను ఇక్కడే నిర్వహించనున్నారు. గ్రౌండ్ బి, సిలు ప్రాక్టీస్ మైదానాలుగా ఉంటాయి. ఈ రెండు గ్రౌండ్స్‌లో కర్నాటకలోని మాండ్య, ఒడిశాలోని కల్హానండి నుంచి తెప్పించిన నల్ల మట్టితో పిచ్‌లు తయారు చేశారు.



ప్రపంచ శ్రేణి ఇండోర్ సదుపాయం

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రపంచ శ్రేణి ఇండోర్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఇండోర్ ట్రైనింగ్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా నుంచి తెప్పించిన మట్టితో పిచ్‌లు తయారు చేశారు. దేశవ్యాప్తంగా తెప్పించిన మూడు రకాల మట్టితో 45 ప్రాక్టీస్ పిచ్‌లను సిద్ధం చేవారు. స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ బ్లాక్ సహా బస చేసేందుకు క్యాంపస్‌లో ప్రత్యేకంగా నిర్మాణాలు చేపట్టారు. ఇండోర్, అవుట్‌డోర్ అథ్లెటిక్స్ ట్రాక్ సహా స్విమ్మింగ్‌పూల్, రికవరీ సౌకర్యాలు ఇందులో భాగంగా ఉన్నాయి. క్రికెటేతర అథ్లెట్లకు సైతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇండోర్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. 40 ఎకరాల క్యాంపస్‌లో భవిష్యత్ ప్రణాళికల కోసం ఏడు ఎకరాలను ఖాళీగా ఉంచారు.

నైపుణ్య కేంద్రం

ఎన్‌సీఏ అనగానే అందరూ రిహాబిలిటేషన్ సెంటర్ అనుకుంటారు. గాయం నుంచి కోలుకునేందుకు మాత్రమే క్రికెటర్లు ఇక్కడకు వస్తారని భావిస్తారు. కానీ క్రికెటర్లు తమ నైపుణ్యాలను పెంచుకునేందుకు, స్కిల్స్‌ను మెరుగుపర్చుకునేందుకు ఎక్కువగా ఎన్‌సీఏలో అడుగు పెడతారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రాకతో ఇక నుంచి మరిన్ని శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆస్కారం ఉంటుంది. అండర్-15 బాలికలు, అండర్-15 బాయ్స్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారిని ఎంపిక చేసి ఇక్కడ శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు ఉన్నాయి. ఇప్పటివరకు ఎన్‌సీఏ నిర్వహించిన 32 క్యాంప్‌లు దేశవ్యాప్తంగా భిన్న వేదికల్లో జరిగాయి. ఇక నుంచి క్యాంప్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోనే నిర్వహిస్తాం. భారత-ఏ జట్ల మ్యాచులకు సైతం ఈ గ్రౌండ్‌ను వినియోగిస్తామని ఎన్‌సీఏ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ తెలిపారు.

ఏ పరిస్థితుల్లోనైనా రాణించేలా

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతిముఖ్యమైన అంశం.. మూడు రకాల మట్టితో తయారు చేసిన పిచ్‌లు. జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించే క్రికెటర్లు భిన్న పరిస్థితులకు అలవాటు పడేందుకు.. ఎన్నో ప్రదేశాలకు ప్రయాణం చేసి సాధన చేయాల్సి వచ్చేది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా వాడుతున్న మట్టి, పిచ్‌లను అధ్యయనం చేసి ఇక్కడ తయారు చేశారు. ఇక్కడ సాధన చేసి క్రికెటర్లు తమ నైపుణ్యాలను పెంచుకోవచ్చు. వర్ధమాన క్రికెటర్లకు మాత్రమే కాదు ప్రస్తుత క్రికెటర్లకు సైతం ఇది ఒక వరమని చెప్పవచ్చు. ప్రపంచంలో నేను ఎన్నో అకాడమీలు చూశాను. అందులో ఇతర క్రీడలకు సంబంధించిన అకాడమీలు సైతం ఉన్నాయి. కానీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తరహా స్పోర్ట్స్ అకాడమీని ఎక్కడా చూడలేదని లక్ష్మణ్ అన్నారు.



ధోనికి లైన్ క్లియర్

పాత రూల్ మళ్లీ తెచ్చిన బీసీసీఐ

బెంగళూర్ : భారత క్రికెట్ దిగ్గజం ఎం.ఎస్ ధోని ఐపీఎల్ కెరీర్‌పై కొన్ని సీజన్లుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 43 ఏండ్ల వయసులో మహేంద్రుడు మరొక సీజన్ అంటూ ప్రతిసారి అభిమానులను థ్రిల్‌కు గురి చేస్తున్నాడు. ఈ ఏడాది ఆటగాళ్ల మెగా వేలం ముంగిట ధోని నిలుపుకునే అంశంపై చెన్నై సూపర్‌కింగ్స్ డైలామా ఎదుర్కొంది. ఐదేండ్లుగా భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించిన క్రికెటర్ల కోసం బీసీసీఐ 2021లో రద్దు చేసిన రూల్‌ను ఈ ఏడాది తిరిగి తీసుకొచ్చింది. ఆ ఆటగాళ్లను అన్‌క్యాప్డ్ జాబితాలో చేర్చింది. వేలంలో అందుబాటులోకి రావటంతో పాటు రూ.4 కోట్లకు అట్టిపెట్టుకునే అవకాశాన్ని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కల్పించింది. 2022 వేలంలో ధోనిని రూ.12 కోట్లకు రెండో ఆటగాడికి చెన్నై సూపర్‌కింగ్స్ నిలుపుకుంది. 2019 వరల్డ్‌కప్ సెమీఫైనల్ తర్వాత ధోని మళ్లీ భారత జట్టుకు ఆడలేదు. ఈ ఏడాది రుతురాజ్ గైక్వాడ్‌కు సూపర్‌కింగ్స్ కెప్టెన్సీ పగ్గాలు అప్పగించిన ధోని జట్టులో ఆటగాడిగా కొనసాగాడు. రూ.4 కోట్లకు అట్టిపెట్టుకుంటే.. ధోని వేలంలోకి వచ్చే అవకాశం లేదు.



శంకర్‌కు గోల్ఫ్ టైటిల్

నవతెలంగాణ-హైదరాబాద్ : కోల్‌కత ప్రొఫెషనల్ గోల్ఫ్ ఆటగాడు శంకర్ దాస్ 2024 తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. సంయుక్తంగా మూడో స్థానంతో ఆఖరు రోజు వేటకు వచ్చిన శంకర్ దాస్ కండ్లుచెదిరే ప్రదర్శన చేశాడు. కెరీర్‌తో ఎనిమిదో టైటిల్ దక్కించుకున్న శంకర్ దాస్.. ఏడెండ్ల నిరీక్షణకు తెరదించుతూ మెడల్ పోడియంపై నిలిచాడు. ఈ విజయంతో పీజీటీఐ ర్యాంకింగ్స్‌లో శంకర్ దాస్ 42వ ర్యాంక్ నుంచి 14వ స్థానానికి ఎగబాకాడు. తెలంగాణ రాష్ట్ర టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చాంపియన్‌కు టైటిల్, రూ.15 లక్షల చెక్‌ను అందజేశారు.



చినుకు పడలే..అయినా ఆట రద్దు

- తడి అవుట్‌ఫీల్డ్‌తో సాగని ఆట
- భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు

నవతెలంగాణ-కాన్పూర్ :

భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టులో వరుసగా రెండో రోజు ఆట సాధ్యపడలేదు. తొలి రోజు వెలుతురు లేమి, వర్షంతో మధ్యాహ్నం ఆట నిలిచిపోగా.. రెండో రోజు భారీ వర్షంతో 90 ఓవర్ల ఆట వర్షార్పణమైంది. కానీ మూడో రోజు ఒక్క చినుకు పడలేదు. అయినా, గ్రీన్‌పార్క్ స్టేడియంలో ఆట సాధ్యపడలేదు. తడి అవుట్‌ఫీల్డ్ కారణంగా మూడో రోజు ఆట రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. కాన్పూర్ టెస్టులో మూడు రోజులు ముగియగా.. బంగ్లాదేశ్ 35 ఓవర్లలో 107/3తో నిలిచింది. టెస్టు మ్యాచ్‌లో మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. 8 సెషన్ల ఆట తుడిచి పెట్టుకుపోగా కాన్పూర్ టెస్టులో ఇక ఫలితం తేలటం కష్టమనే చెప్పాలి.

నిర్వహణ వైఫల్యం : గ్రీన్‌పార్క్ స్టేడియం సిబ్బంది వైఫల్యం సుస్పష్టం. ఆదివారం వర్షం చినుకు కూడా కురవలేదు. అయినా, గ్రౌండ్స్‌మెన్ 10 గంటలకు కవర్లను తొలగించారు. అవుట్‌ఫీల్డ్‌లో మిడ్ ఆన్, మిడ్ ఆఫ్, మీడియా బాక్స్ ఎండ్‌లో బౌలర్ల రనప్ బాగా తడిగా ఉన్నాయి. దీంతో అంపైర్లు క్రిస్ బ్రౌన్, రిచర్డ్ అవుట్‌ఫీల్డ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తడిగా ఉన్న ప్రదేశాలను మెరుగు పర్చేందుకు గ్రౌండ్స్‌మెన్ ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. సూర్యుడే ఆ పని చేసుకోవాలనే రీతిలో వ్యవహరించారు. ఆదివారం కావటంతో అభిమానులు భారీ సంఖ్యలో స్టేడియానికి వచ్చినా నిరాశ తప్పలేదు. మధ్యాహ్నం 2 గంటలకు మూడో రోజు ఆటను రద్దు చేసినట్టు అంపైర్లు ప్రకటించారు. ఆ వెంటనే సూర్యుడు తొంగిచూడటం అభిమానులను మరింత అసంతృప్తికి లోనుచేసింది.

షూటింగ్‌లో రెండు స్వర్ణాలు

జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ : ఐఎస్-ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్ (రైఫిల్/పిస్టల్/షాట్‌గన్)ను భారత యువ షూటర్లు ఘనంగా మొదలెట్టారు. తొలి రోజు రెండు స్వర్ణాలు సొంతం చేసుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మెన్స్, ఉమెన్స్ జట్లు బంగారు పతకాలు సాధించాయి. మెన్స్ త్రయం ఉమేశ్ చౌదరి, ప్రద్యుమ్ సింగ్, ముకేశ్‌లు జట్టు విభాగంలో టాప్ లేపారు. 1726 పాయింట్లతో సిల్వర్ సాధించిన రోమానియా కంటే పది పాయింట్ల ముందంజలో నిలిచారు. మహిళల త్రయం కనిష్క, లక్షిత, అంజలి చౌదరి 1708 పాయింట్లతో స్వర్ణం గెల్చుకుంది. అజర్‌బైజాన్, ఉక్రెయిన్‌లు సిల్వర్, బ్రాంజ్ దక్కించుకున్నారు. మెన్స్ వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఉమేశ్ చౌదరి పతకం సాధించే అవకాశం కోల్పోయాడు. షూటింగ్ రేంజ్‌కు ఆలస్యంగా వచ్చినందుకు అతడిపై నిర్వాహకులు రెండు పాయింట్ల కోత విధించారు. దీంతో పతక పోరులో ఉమేశ్ ఆరో స్థానానికి పరిమితమై మెడల్ చేజార్చుకున్నాడు.

నవచిత్రం



మాధవ్, సిమ్రాన్ శర్మ

మిస్టర్ ఇడియట్

పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ హీరోగా నటిస్తున్న సినిమా 'మిస్టర్ ఇడియట్'. ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. జేజేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జేజేఆర్ రవిచంద్ నిర్మిస్తున్నారు.

'పెళ్లి సందడి' దర్శకురాలు గౌరీ రోణంకి దీనికి డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బాగుంది. నిర్మాత రవిచంద్ నా మిత్రుడు. గతంలో 'హ్యాష్ ట్యాగ్ బ్రో' అనే సినిమా చేశాడు. అది ఓటీటీలో రిలీజైంది. మరో సినిమా చేయాలను కున్నప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథతోనే సినిమా నిర్మించాలని ప్లాన్ చేశాడు. 'పెళ్లి సందడి' సినిమా వంటి చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేసిన గౌరీ దగ్గర ఉన్న స్క్రిప్ట్ నచ్చి ఈ చిత్రాన్ని ప్రారంభించాడు. ఈ సినిమాలో మాధవ్, సిమ్రాన్ పోటా పోటీగా నటించారు.సినిమా డెఫినెట్‌గా మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.

'గౌరీ వండర్ ఫుల్ డైరెక్టర్. మాధవ్, సిమ్రాన్ ఈ చిత్రంతో తెరకు పరిచయం అవుతున్నారు. వారితో పాటు మా టీమ్ అందరికీ ఈ సినిమా బిగ్ హిట్ ఇవ్వాలని కోరుకుంటున్నా' అని మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ చెప్పారు.

నిర్మాత జేజేఆర్ రవిచంద్ మాట్లాడుతూ, 'డైరెక్టర్ గౌరీ రోణంకి అందరికీ నచ్చేలా మూవీ రూపొందించారు. అనూప్ ఇచ్చిన మ్యూజిక్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. త్వరలోనే సాంగ్స్ రిలీజ్ చేయ బోతున్నాం. సినిమాటోగ్రాఫర్ రామ్ రెడ్డి, ఎడిటర్ విప్లవ్ మా ఇతర టీమ్ అంతా మూవీకి మంచి అవుట్‌పుట్ తీసుకొచ్చారు. మాధవ్ నటనలో వారి పెదనాన్న రవితేజ ఫీచర్స్ కొన్ని వచ్చాయి. మా సినిమాలో అది చూస్తారు' అని తెలిపారు. హీరో మాధవ్ మాట్లాడుతూ, 'అనూప్ మ్యూజిక్, రామ్ రెడ్డి బ్యూటిఫుల్ విజువల్స్ హైలెట్ అవుతాయి. మా డైరెక్టర్ గౌరి నాకు ఒక మంచి మూవీ ఇస్తున్నారు. నిర్మాత రవిచంద్‌కి థ్యాంక్స్. మా పెదనాన్న రవితేజ నాకు ఎప్పుడూ సపోర్ట్ చేస్తుంటారు' అని అన్నారు.

> మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ మా కథను అర్థం చేసుకుని, మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఫైట్స్, డ్యాన్స్ విషయాల్లో నాకు ఎక్కువగా తెలియదు. కానీ నేను చెప్పిన సజెషన్స్ తీసుకుంటూనే వాళ్లంతా మంచి అవుట్ పుట్ ఇచ్చారు. ఈ మూవీ చేసే అవకాశం ఇచ్చిన మా ప్రొడ్యూసర్ రవిచంద్‌కి థ్యాంక్స్. మాధవ్, సిమ్రాన్ నటన మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఆడియెన్స్‌కు బాగా రీచ్ అయ్యే అంశాలతో మూవీ రూపొందించాను.
>
> - దర్శకురాలు గౌరి రోణంకి

అరుదైన గౌరవం



రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్ అరుదైన గౌరవం దక్కించుకున్నారు. మేడమ్ టుస్సాడ్స్‌లో ఆయన మైనపు విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. సింగపూర్‌లోని మ్యూజియంలో చరణ్‌తో పాటు ఆయన పెంపుడు శునకం రైమీ విగ్రహాన్ని కూడా పెట్టనున్నారు. దీనికి సంబంధించిన ఫొటో షూట్ ఇప్పటికే పూర్తయింది. టుస్సాడ్స్ టీమ్ ఐఫా ఉత్సవం వేదికగా ఈ విషయాన్ని తెలియజేసింది. 'టుస్సాడ్స్ కుటుంబంలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నా' అని రామ్ చరణ్ పేర్కొన్నారు. దీంతో హీరో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మన తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ప్రభాస్, మహేష్‌బాబు, అల్లు అర్జున్ మైనపు విగ్రహాలు మేడమ్ టుస్సాడ్స్‌లో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

క్రిస్మస్ కానుకగా..

రామ్‌చరణ్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం క్రిస్మస్ సందర్భంగా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'రా మచ్చా మచ్చా..' సాంగ్ ప్రోమో అందరి దృష్టిని విశేషంగా ఆకట్టుకుంది. నేడు (సోమవారం) పూర్తి వీడియో సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేయబోతున్నారు. తెలుగు, తమిళంలో పాటు ఈ పాట హిందీలో 'ధమ్ తు దికాజా..' అంటూ అలరించనుంది. రామ్‌చరణ్ ఇంట్రడక్షన్ సాంగ్‌గా ఈ పాటను ఇండియన్ సినీ హిస్టరీలో నెవ్వర్ బిఫోర్ అనేలా డైరెక్టర్ శంకర్ తన మార్క్‌ను చూపిస్తూ తెరకెక్కించారని ప్రోమో చూస్తుంటే అర్థమవుతుంది. ఇందులో ఏకంగా 1000కి పైగా జానపద కళాకారులు రామ్ చరణ్‌తో కలిసి డాన్స్ చేయటం విశేషం. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్.

యూనివర్సల్ కాన్సెప్ట్‌తో జిగ్రా



ఆలియా భట్

సినిమాకు భాషతో, హద్దులతో సంబంధం లేదు. అందుకు ఉదాహరణగా నిలుస్తోంది 'జిగ్రా' మూవీ. ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంపై బాలీవుడ్‌లో మంచి అంచనాలున్నాయి. ఇప్పుడు ఈ అంచనాలు దక్షిణాదికీ వ్యాపించనున్నాయి. మంచి సినిమాలకు తన వంతు మద్దతు తెలియజేసే హీరో రానా దగ్గుబాటి ఈ సినిమాను తెలుగులో విడుదల చేయటానికి సిద్ధమయ్యారు.

ఈ చిత్రాన్ని తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్ మెంట్ ద్వారా రానా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా హిందీ ట్రైలర్ విడుదలై అంచనాలను పెంచిన సంగతి తెలిసిందే. కాగా తెలుగు ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ధర్మ ప్రొడక్షన్స్ సి.ఇ.ఒ అపూర్వ మెహతా మాట్లాడుతూ, 'ప్రతిష్టాత్మక చిత్రమైన బాహుబలి, ఘాజి ఎటాక్ వంటి సినిమాలతో ధర్మ ప్రొడక్షన్స్‌తో రానా దగ్గుబాటికి మంచి అనుబంధం ఏర్పడింది. ఇప్పుడు 'జిగ్రా' తెలుగు విడుదల కోసం రానాతో, ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థతో చేతులు కలపటం గర్వంగా ఉంది. దేశ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రేక్షకులకు మంచి సినిమాలను అందించాలనే మా అంకితభావం మరోసారి దీంతో స్పష్టమవుతోంది. తెలుగు ప్రేక్షకులకు సుపరి చితురాలైన ఆలియా భట్‌తో పాటు వేదాంగ్ రైనా అద్భుతమైన నటన ప్రేక్షకులకు ఓ గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించ నుంది. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా బ్రహ్మాండంగా విడుదల చేయటానికి సమాయత్తమవుతున్నాం' అని తెలిపారు.

'ఈ కథలో మంచి సోల్ ఉంది. భాషతో సంబంధం లేకుండా ఎవరికైనా ఇది కనెక్ట్ అవుతుంది. ఇలాంటి వైవిధ్యమైన కథతో రూపొందిన ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించాలని భావించాం. అందుకనే ధర్మ ప్రొడక్షన్స్‌తో కలిసి నేను, ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నామని గర్వంగా తెలియజేస్తున్నాం. జిగ్రా అనేది కేవలం యాక్షన్ చిత్రం మాత్రమే కాదు. కుటుంబంలోని అనుబంధాలను తెలియజేసే చిత్రం. మనం ఎంతగానో ప్రేమించే వ్యక్తులను మనం ఎలా కాపాడుకోవాలో తెలియజెప్పే సినిమా' అని రానా దగ్గుబాటి చెప్పారు.

ఊహించలేదు..



హేమలత రెడ్డి

జెమినీ టీవీ యాంకర్‌గా చేసి, నిన్ను చూస్తూ సినిమాతో హీరోయిన్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన హేమలత రెడ్డి గ్లామన్ మిసెస్ ఇండియా 2024 అవార్డుల్లో బెస్ట్ టాలెంట్, బెస్ట్ ఫోటోజెనిక్ విభాగాల్లో పురస్కారాలను సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన గ్రాండ్ సెలబ్రేషన్స్‌లో హీరోయిన్ హేమలత రెడ్డి మాట్లాడుతూ, 'నేను ఎప్పటి నుండో ఇండస్ట్రీలో ఉన్నాను. జెమిని టీవీలో యాంకర్‌గా మొదలుపెట్టి సీరియల్స్ చేశాను. ఆ తరువాత ప్రొడక్షన్ మీద ఇంట్రెస్ట్‌తో ప్రొడ్యూసర్‌గా ఒక సినిమా తీశాను. ఆ తర్వాత ఫ్యాషన్ సైడ్ ట్రై చేశాను. వర్చువల్ రౌండ్స్‌ని కంప్లీట్ చేసి, ఫైనల్ సెలక్షన్స్‌కి మలేషియా వెళ్లాను. అక్కడ పోటీ చాలా గట్టిగా నడిచింది. దక్షిణాది నుండి నేను మాత్రమే వెళ్లగలిగాను. చివరికి గెలిచాను. మన మాతృ భాష తెలుగులోనే నేను అక్కడ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను. నేను గెలుస్తానని అనుకోలేదు. నేను హీరోయిన్‌గా నటిస్తూ నిర్మించిన సినిమా 'నిన్ను చూస్తూ'. ఆ సినిమాలో సుహాసిని, సుమన్, షాయాజీ షిండే లాంటి సీనియర్ నటులతో నటించాను. వాళ్ల దగ్గర నుంచి ఎంతో నేర్చు కున్నాను. ముఖ్యంగా సుహాసిని ఎన్నో మంచి టిప్స్ ఇచ్చారు. ఆవిడ నాకు స్ఫూర్తి. అలాగే నాకు మా కుటుంబం నుండి మంచి సపోర్ట్ లభించింది. ఆఫర్ వస్తే ఎలాంటి రోల్స్ అయిన చేస్తాను' అని తెలిపారు.

'గ్లామన్ మిస్ అండ్ మిస్సెస్ ఇండియా పోటీని నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. 39 సిటీలలో 60 మంది కంటెస్టెంట్స్‌ని సెలెక్ట్ చేసాం. 35 మందిని మలేషియా తీసుకెళ్లాం. టైటిల్ విన్నర్‌గా హైదరాబాద్ అమ్మాయి హేమలత రెడ్డి గెలిచారు. ఇప్పుడు గ్లామన్ మిస్ అండ్ మిస్సెస్ వరల్డ్ కాంపిటీషన్ చేస్తున్నాం. 149 దేశాల నుంచి ఎంట్రీస్‌ని తీసుకుంటున్నాం. ఆ ఫినాలేని ప్యారిస్‌లో ప్లాన్ చేస్తున్నాం. ఈపోటీకి హేమలతరెడ్డిని కూడా తీసుకెళ్తున్నాం' అని గ్లామన్ డైరెక్టర్ మన్ దువా చెప్పారు.

విజయవంతంగా 4వ హెల్త్ క్యాంప్



మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) సభ్యులందరికీ ఉచిత మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. 'మా' ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ విష్ణు మంచు, వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి ఈ హెల్త్ క్యాంప్‌ను జీవీకే హెల్త్ హబ్ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ ఫ్రీ హెల్త్ చెకప్‌లో 'మా' సభ్యులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ,'డా.శాస్త్రి, జీవీకే హెల్త్ హబ్‌కు థ్యాంక్స్. 'మా' సభ్యులం దరికీ ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఉదయం 7 గంటల నుంచి హెల్త్ క్యాంప్ ప్రారంభమైంది. వేల ఖర్చుతో కూడుకున్న ఈ హెల్త్ చెకప్‌ను ఫ్రీగా అందిస్తున్నందుకు థ్యాంక్స్. ఇది ఇకపై ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

మాదాల రవి మాట్లాడుతూ, 'జీవీకే హెల్త్ హబ్‌తో కలిసి మాస్టర్ హెల్త్ చెకప్‌ను గ్రాండ్‌గా నిర్వహిస్తున్నాం. ఇది 'మా ఆధ్వర్యంలో నాలుగో హెల్త్ క్యాంప్. 'మా' సభ్యుల ఆరోగ్యం, సంక్షేమం కోసం హెల్త్ కార్డ్‌లను జారీ చేశాం. వాటిని అందరూ వినియోగించుకోవాలి' అని అన్నారు. "మా' ఆధ్వర్యంలో ఇది నాలుగో ఫ్రీ హెల్త్ క్యాంప్. జీవీకే హెల్త్ హబ్ ద్వారా ఇది చాలా సక్సెస్‌ఫుల్‌గా జరిగింది' అని శివ బాలాజీ చెప్పారు.

డా॥ శాస్త్రి మాట్లాడుతూ, 'ఈ రోజు వరల్డ్ హార్ట్ డే. హార్ట్ ఎటాక్‌లు రాకుండా నిరోధించాలి. డైట్, హెల్త్ పట్ల అందరూ అవగాహనతో ఉండాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఆర్టిస్టులకి ఎక్కువగా స్ట్రెస్ ఉంటుంది. అందుకే వీరి కోసం స్పెషల్‌గా మాస్టర్ చెకప్ చేస్తున్నాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

డీవీసీ కేసులో రిలయన్స్ ఇన్‌ఫ్రాకు ఉపశమనం



కోల్‌కత్తా : అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఓ కీలక కేసులో కోల్‌కత్తా హైకోర్టు ఉపశమనం కల్పించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) వివాదంలో కోర్టు తమకు అనుకూలంగా తీర్పును ఇచ్చిందని రిలయన్స్ ఇన్‌ఫ్రా ఆదివారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాకు రూ.780 కోట్ల డీవీసీ చెల్లించాలని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును కోల్‌కత్తా హైకోర్టు సమర్థించినట్లు వెల్లడించింది. పదేండ్ల క్రితం అనిల్ అంబానీ సంస్థ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పశ్చిమ బెంగాల్‌లోని పురూలియాలో 1200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను నెలకొల్పడానికి రూ.3,750 కోట్ల కాంట్రాక్టును పొందింది. ఇది అర్ధంతరంగా ఆగిపోవడంతో తమకు నష్టపరిహారం కింద కొంత చెల్లించాలని డీవీసీని కోరింది. దీనిపై 2019లో ట్రిబ్యునల్ విచారణ జరిపి అనిల్ అంబానీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాకు డీవీసీ రూ.896 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పును తిరిగి కోల్‌కత్తా హైకోర్టులో డివిసి సవాలు చేసింది. దీనిపై హైకోర్టు విచారించి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాకు రూ.780 కోట్లు చెల్లించాలని ఆదేశించింది.

స్వల్ప అస్థిరతలో మార్కెట్లు

- పీఎల్ అసెట్ మేనేజ్‌మెంట్

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప అస్థిరత వైపు మళ్లుతున్నాయని పిఎల్ కాపిటల్ ప్రభుదాస్ లిల్లాధర్‌కు చెందిన అసెట్ మేనేజ్‌మెంట్ అంచనా వేసింది. ఆ సంస్థ విడుదల చేసిన పీఎంఎస్ స్ట్రాటజీ అప్‌డేట్స్ అండ్ ఇన్‌సైట్స్ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యత, తక్కువ అస్థిరత కారకాలు సూచిస్తున్నాయని పేర్కొంది. జూన్, జులైలోనూ మార్కెట్లలో తక్కువ అస్థిరత ధోరణి కనబడిందని తెలిపింది. ఆగస్టులో నిఫ్టీ 200 సూచీ 2.40 రాబడిని, నిఫ్టీ 50 సూచీ 1.73 శాతం, నిఫ్టీ 500 ఇండెక్స్ 1.14 శాతం చొప్పున రాబడిని అందించిందని పేర్కొంది. "ప్రస్తుత మార్కెట్ డైనమిక్స్ ప్రకారం.. రిటర్న్‌ల గరిష్టీకరణ కంటే రిస్క్ కనిష్టీకరణ వ్యూహం ఉండాలని మేము నమ్ముతున్నాము. ఈ విధానం క్రమబద్ధమైన ప్రక్రియల ద్వారా బలమైన రిస్క్ సర్దుబాటు పనితీరును స్థిరంగా అందిస్తుంది." అని పీఎల్ క్యాపిటల్ ఫండ్ మేనేజర్ సిద్ధార్థ్ వోరా పేర్కొన్నారు.

కీర్తిలాల్స్ డైరెక్టర్ శాంత కుమార్‌కు జీజేసీ అవార్డు



హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ అయినా కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్‌కు ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డు దక్కినట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) ఈ అవార్డును ప్రధానం చేసింది. ఆభరణాల పరిశ్రమకు అందించిన విశేషమైన సేవలకు గుర్తింపుగా, డిజైన్, నవ్యావిష్కరణ, వ్యాపార నాయకత్వాల్లో కీలకమైన నైపుణ్యాలకుగాను ఈ అవార్డును పొందారు.

విభిన్న కోణాల్లో దర్యాప్తు

- లడ్డూ కేసు ప్రాథమిక దశలోనే : 'సిట్' చీఫ్ త్రిపాఠి



తిరుపతి : తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి వాడినట్లు అందిన ఫిర్యాదుపై విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఇతర అంశాలనూ పరిశీలిస్తున్నామని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ఈ బృందం ఆదివారం కూడా దర్యాప్తు కొనసాగించింది. పద్మావతి అతిథి గృహంలో టిటిడి ఇఒ శ్యామలరావుతో సమావేశమైంది. అనంతరం మీడియాతో త్రిపాఠి మాట్లాడారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా విచారణ ప్రారంభించామని, ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉందని తెలిపారు. నెయ్యి సరఫరా చేసిన తమిళనాడులోని ఎఆర్ డెయిరీపై ప్రధానంగా ఫిర్యాదు అందిందని, దీనిపై సిట్ విచారణ చేస్తోందని చెప్పారు. విచారణకు మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రికార్డుల స్వాధీనం, పరిశీలన

శ్రీవారి లడ్డూ కోసం వాడే నెయ్యి, యాలకులు, కలకండ, చక్కెరతోపాటు నైవేధ్యానికి వాడే నూనె, ఇతర సరుకుల కొనుగోలు రికార్డులను టిటిడి మార్కెట్ విభాంగం నుంచి సిట్ బృందం స్వాధీనం చేసుకుంది. వీటిని తిరుపతిలోని పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఒక బృందం పరిశీలిస్తోంది. గత ఐదేళ్లలోనూ, అంతకు ముందు ఐదేళ్లలోనూ టిటిడికి ఎంత నెయ్యి వచ్చింది? ఎన్ని రకాల సరుకులు వచ్చాయి? వాటి నాణ్యతపై ఆరా తీస్తోంది. టిటిడికి నెయ్యి సరఫరా చేసిన చెన్నయ్‌లోని ఎఆర్ డెయిరీకి మరో బృందం వెళ్లి విచారణ చేస్తోంది. మూడో బృందం సోమవారం ఉదయం తిరుమలలోని లడ్డూపోటు, అన్నదానం తయారీ విభాగం, లడ్డూ విక్రయశాలను పరిశీలించనుంది.

దీనికన్నా వేరే సాక్ష్యం కావాలా..?

సత్యమేవ జయతే అంటూ వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ట్వీట్ చేశారు. లడ్డూ ప్రసాదంపై మాట మార్చిన ఇఒ, సిఎం చంద్రబాబుపై ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ వీడియోలు పోస్టు చేశారు. దీని అర్థం ఏమిటి చంద్రబాబు.. దీని కన్నా వేరే సాక్ష్యం కావాలా..? అంటూ వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సెప్టెంబరు 18న సిఎం చంద్రబాబు తిరుమల లడ్డూలో యానిమల్ ఫ్యాట్ కలిసిందంటూ ఒకసారి, యాత్రికులకు పెట్టే ప్రసాదం అపవిత్రం చేసే విధంగా ఉంది, ఓసారి బాధేస్తుంది నాసిరకమైన ఇంగ్రిడియంట్స్ కాకుండా యానిమల్ ఫ్యాట్ కూడా వాడారని, తిరుమలకు నాలుగు నెయ్యి ట్యాంకర్లు వచ్చాయని, దానిని వాడారని చంద్రబాబు మళ్లీ అబద్ధాలను నిజం చేసే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. టిటిడి ఇఒ శ్యామలరావు.. ఆ ట్యాంకర్లను వాడలేదని, వెనక్కి పంపామని చెబితే, ఏకంగా ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు.. ఆ నెయ్యి వాడారంటూ అసత్య ప్రచారానికి దిగారని జగన్ తెలిపారు.

పాలేరు నిండా నిర్లక్ష్యం



- వరద ఉధృతికి తోడు ఇంజినీరింగ్ వైఫల్యంతోనే ప్రధాన కాల్వకు గండ్లు
- ఎస్కేప్ గేట్ల ముందస్తు మరమ్మతులు శూన్యం
- రెగ్యులేటర్లు, యూటీలు, ఇన్‌ఫాల్ గేట్లు గాలికే..
- కారణమైన అధికారులపై చర్యలకు ప్రభుత్వం సిద్ధం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

వరదల ఉధృతికి తోడు ఇంజినీరింగ్ వైఫల్యం కారణంగానే పాలేరు రిజర్వాయర్ దిగువన ఉన్న నాగార్జునసాగర్ ఎడుమ (ప్రధాన) కాల్వకు గండిపడినట్టు తెలుస్తోంది. కాల్వ మరమ్మతుల విషయంలోనూ సంబంధిత ఇంజినీర్లు నిర్లక్ష్యం వహించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. సర్కారు ప్రతిష్టకు మచ్చతెచ్చేలా వ్యవహరించిన ముగ్గురు ఇంజినీరింగ్ అధికారుల తీరుపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని అంటున్నారు.

ఎస్కేప్ గేట్లు ఎత్తే అవకాశం లేకపోవడమే కారణం?

రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రవాహాన్ని నియంత్రించే ఎస్కేప్ గేట్లు ఎత్తే అవకాశం లేకపోవడం వల్ల మెయిన్ కాల్వకు అండర్ టన్నెల్ (యూటీ)తో పాటు జెన్కో దాటాక కుడి, ఎడమ వైపున గండ్లు పడ్డాయి. మెయిన్ కెనాల్ రంగుల బ్రిడ్జి (ఖమ్మం బార్డర్ ప్రవేశించే చోటు) వద్ద ఎస్కేప్ లేపకపోవడంతో అడుగు మేర రిజర్వాయర్ బ్యాక్ వాటర్ రావడానికి అవకాశం ఏర్పడింది. ఒకవేళ ఎస్కేప్ లేపి ఉంటే వరద ఉధృతి తగ్గేదని అంటున్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా 32 ఫీట్లు నిండి సాగర్ నుంచి వచ్చే వాటర్ రివర్స్ పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో ఎస్కేప్ గేట్లు ఎత్తి ఉంటే మూడు, నాలుగు వేల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్లేది. ఇలా జరిగివుంటే కెనాల్ దెబ్బతినేది కాదు. దీనికి సంబంధించి ప్రభుత్వం మరమ్మతుల కోసం వేసవికి ముందే నిధులు విడుదల చేసినా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైందని నిపుణులు చెబుతున్నారు.

ముందస్తు మరమ్మతులు చేయకపోవడంపై విమర్శలు..

పాలేరు రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ 23 అడుగులు కాగా ఈసారి 32 అడుగుల నీరు వచ్చిన మాట వాస్తవమే. కానీ ముందస్తు మరమ్మతులు చేసి ఉంటే కొంతలో కొంత పరిస్థితి మెరుగ్గా ఉండేది. యూటీలు, ఇన్‌ఫాల్ గేట్లు, రెగ్యులేటర్ మరమ్మతులు ముందస్తుగా చేపట్టకపోవడంతో గండ్లు పడ్డాయనే అభిప్రాయం ఉంది. నాయకన్‌గూడెం ఇన్‌ఫాల్ గేట్లకు విపరీతంగా లీకేజీలున్నాయి. వీటి మరమ్మతులు కూడా చేయకపోవడంతో గేట్లు మూసినా 500 క్యూసెక్కుల నీరు వెనక్కి తన్నింది. ఖమ్మం వచ్చే ఔట్‌ఫాల్ రెగ్యులేటర్‌కు సైతం మరమ్మతులకు పర్మిషన్ ఇచ్చినా చేయించలేదు. తద్వారా 500 క్యూసెక్కుల నీరు వెనక్కి తన్నాయి. యూటీ వద్ద కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ కూడా ముందస్తు మరమ్మతులు చేయలేదు. ముఖ్యంగా కాల్వలకు గండ్లు పడకుండా ఉండేందుకు ఉపయోగించే ఎస్కేప్‌ల విషయంలో నిర్లక్ష్యమే పాలేరు కెనాల్స్‌కు నష్టం చేసిందని చెప్పాలి. అగ్రిమెంట్ పూర్తయినా వీటిని రిపేర్ చేయించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని నిపుణులు అంటున్నారు. వీటిని మానిటరింగ్ చేయాల్సిన సీఈ, ఈఈల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి దారితీసిందనే వాదన ఉంది.

రెగ్యులర్ సీఈ లేకపోవడంతో పర్యవేక్షణా లోపం

జిల్లా నీటిపారుదల శాఖకు రెగ్యులర్ చీఫ్ ఇంజినీర్ లేకపోవడం కూడా ఓ కారణమనే చెప్పాలి. పైగా ప్రస్తుత సీఈ విద్యాసాగర్ సివిల్ ఇంజినీర్ కాకపోవడంతో ఆయనకు నీటిపారుదల రంగంపై అంతగా అవగాహన లేనట్టుగా తెలుస్తోంది. ఐడీసీ ఎండీగా కూడా ఈయన బాధ్యతలు నిర్వహిస్తుండటంతో పూర్తి సమయాన్ని ఇక్కడ వెచ్చించలేని పరిస్థితి. ముగ్గురు మంత్రులున్నా ఒక్క రెగ్యులర్ సీఈని నియమించుకోలేకపోవడాన్ని కూడా పలువురు తప్పుబడుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఓ రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి ఏఈఈలు, డీఈఈలు ఇతర అధికారులకు సూచనలు చేయాల్సిన సీఈకి నీటిపారుదల రంగంపై అవగాహన లేకపోవడం కూడా పాలేరుకు నష్టం చేసిందని చెప్పాలి. మార్చి, ఏప్రిల్ నెలల్లో అంచనాలు రూపొందించుకొని, టెండర్లు పిలిస్తే మే, జూన్‌లో మరమ్మతు పనులు నిర్వహించుకునే అవకాశం ఉండేది. కానీ ఇవేవీ లేకపోవడం పాలేరును ముంచింది.

20 రోజుల సమయమున్నా ఎస్కేప్ మరమ్మతులు శూన్యం

ఇప్పటికే కాల్వలకు పడిన గండ్లు పూడ్చినా ఎస్కేప్‌ల మరమ్మతుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం కాల్వలకు నీరు విడుదల చేయడంతో ఎస్కేప్‌లను కిందకు దించాల్సి వచ్చింది. కానీ దీనికి ముందు 20 రోజుల సమయం ఉన్నా పట్టించుకోకపోవడం నిర్లక్ష్యాన్ని చాటుతోంది. వాస్తవానికి వేసవిలో చేయాల్సిన మరమ్మతులను ఇప్పటికీ చేయకపోవడం అధికారుల లోపాన్ని ఎత్తిచూపుతోంది. ఎస్కేప్ గేట్లు పనిచేయాలంటే మిషన్ అవసరం ఉంటుంది. కాల్వలకు గండ్లు పడిన నేపథ్యంలో రిజర్వాయర్ కొంతమేరకు ఖాళీ అయింది. ఆ సమయంలో ఎస్కేప్ గేట్లు మరమ్మతులు చేసి ఉంటే ప్రయోజనం ఉండేది.

కూలిన యూటీ స్థానంలో కొత్త నిర్మాణానికి సన్నాహాలు

ప్రస్తుతం ఉన్న యూటీ మొన్నటి వరదలకు కూలడంతో దాని స్థానంలో కొత్తదాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నీరు ఆగిపోయేలోపే డిజైన్ రూపొందించి, పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. 1969 డ్రాయింగ్ ఆధారంగా దీన్ని నిర్మించేందుకు ఎస్ఈఈ, డీఈఈలు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

వరద ఉధృతి కారణంగానే గండ్లు

వరద ఉధృతి కారణంగానే గండ్లు పడ్డాయి. పాలేరు రిజర్వాయర్ కెపాసిటీ 23 అడుగులు కాగా ఈసారి 32 ఫీట్ల నీరు వచ్చింది. పడిన గండ్లన్నింటికీ మరమ్మతులు చేసి 24వ తేదీ నుంచి నీరు వదిలాం. 2.5 టీఎంసీ వాటర్ కాగా 25 టీఎంసీల వాటర్ ఒకేసారి వచ్చాయి. జెన్కోలో లోయర్ లెవల్ 28 అడుగులు కాగా 32 ఫీట్లు వచ్చాయి. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో గేట్లు కూడా తట్టుకోలేకపోయాయి. అండర్ టన్నెల్ నుంచి వచ్చిన వరద ఉధృతితో రెండు, మూడు చోట్ల గండ్లు పడ్డాయి. షట్టర్లు, రెగ్యులేటర్లు మాత్రమే మరమ్మతులు చేసుకుంటాం. కెనాల్ మంచిగానే ఉంది. ఓవర్ ఫ్లో వల్లనే గండ్లు పడ్డాయి.

అననయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

అత్యాశ..!





- ట్రేడింగ్ జూదంలో యువత దివాలా
- ఎక్కువగా తెలుగు రాష్ట్రాల ఇన్వెస్టర్లే బలి
- ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌లో వారికే అధిక నష్టాలు
- వ్యసనంలో 2.1 లక్షల మదుపర్లు
- కేవలం 7 శాతం మందికే లాభాలు
- సెబీ రిపోర్ట్‌లో వెల్లడి

నవతెలంగాణ - హైదరాబాద్

స్టాక్ మార్కెట్లలో సులభంగా లాభాలు సంపాదించవచ్చనే మోజులో తెలుగు రాష్ట్రాల ఇన్వెస్టర్లు భారీగా నష్టపోతున్నారు. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) ట్రేడింగ్‌లో 93 శాతం మంది ఇండ్లు గుల్ల చేసుకుంటున్నారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్సేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) 2023-24 ఆర్థిక సంవత్సరం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. ఇందులో పలు విస్తుపోయే విషయాలను వెల్లడించింది. ఈ ట్రేడింగ్‌లో అత్యధికంగా తెలుగు రాష్ట్రాల వాళ్లే బలి అవుతున్నారని తేలింది. ముఖ్యంగా తాము టెక్నాలజీలో ఎంతో స్మార్ట్ అని భావించే యువత స్టాక్ మార్కెట్ జూదంలో భారీగా నగదు పోగొట్టుకుంటున్నారు. అత్యధికంగా రిస్కు కలిగిన ఎఫ్అండ్ఓల్లో పెట్టుబడులు పెట్టి దివాలా తీస్తున్నారు. ప్రతీ 10 మందిలో 9 మందికి పైగా నష్టపోతున్నారని సెబీ స్వయంగా వెల్లడించింది.

సెబీ తాజా రిపోర్ట్ ప్రకారం.. ఎఫ్అండ్ఓలో నష్టాలు చవిచూస్తున్న వారిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. ఇక్కడి సగటు ఇన్వెస్టర్ అత్యధికంగా రూ.1.97 లక్షలు నష్టపోయాడు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఏపీ ఇన్వెస్టర్లు సగటున రూ.1.45 లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌లో అత్యధికంగా నష్టపోయిన రాష్ట్రాల్లో తొలి నాలుగు స్థానాల్లో దక్షిణాది రాష్ట్రాలే ఉండటం బాధాకరం. తమిళనాడు ఇన్వెస్టర్లు సగటున రూ.1.37 లక్షలు కోల్పోయి.. మూడో స్థానంలో ఉండగా.. కర్నాటక మదుపర్లు సగటున రూ.1.35 లక్షల పోగొట్టుకోవడంతో.. ఆ రాష్ట్రం నాలుగో స్థానంలో ఉంది. 2023-24లో ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌లో తెలుగు రాష్ట్రాల్లోని 93 శాతం మంది నష్టాలే చవిచూశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆంధ్ర, తెలంగాణలో మొత్తంగా 2.1 లక్షల మంది ఎఫ్అండ్ఓ ట్రేడింగ్ చేసినట్టు సెబీ వెల్లడించింది. ఇందులో దాదాపు 1.85 లక్షల మంది తమ సొమ్మును పోగొట్టుకున్నారని స్పష్టం అవుతోంది.

టెకీల కంటే మార్కెట్ స్మార్ట్ : సిహెచ్ కుటుంబ రావు

టెకీల కంటే స్టాక్ మార్కెట్లు స్మార్ట్ అని ఏపీ ప్లానింగ్ బోర్డు మాజీ వైస్ చైర్మెన్, స్టాక్ మార్కెట్ నిపుణులు సిహెచ్ కుటుంబ రావు అన్నారు. దక్షిణాది నుంచి ఎక్కువ మంది ఐటీ, టెక్ పరిశ్రమలో పని చేస్తున్నారని.. తాము తెలివైన వాళ్లమని అనుకుంటారని.. అయితే వారి కంటే మార్కెట్ తెలివిగా ఉందన్నారు. కాగా.. ఉత్తర, ఈశాన్య భారత ప్రజలు స్టాక్స్‌ల్లో పెట్టుబడులు పెడుతున్నప్పటికీ.. తమ సొమ్ము పట్ల ఎంతో అప్రమత్తంగా ఉంటారన్నారు. దక్షిణాది వాళ్లతో పోల్చితే ఉత్తరాది వాళ్లకు స్టాక్ మార్కెట్ల పట్ల ఎక్కువగా అనుభవం ఉందన్నారు. కరోనా తర్వాత దక్షిణాది నుంచి ఎక్కువ మంది మార్కెట్లలోకి వచ్చారన్నారు. ఇక్కడి యువత స్టాక్ మార్కెట్ల పరిస్థితులను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారన్నారు. ముఖ్యంగా టెకీలు తాము డిజిటల్ అవగాహన కలిగి ఉన్నామని, మార్కెట్లలో అస్థిరతను ఎదుర్కోగలమని భావించే వాళ్లు ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌లో రిస్క్‌లు తీసుకుంటున్నారన్నారు. అయితే మార్కెట్‌లోని అస్థిరత, ప్రమాదాన్ని ఎలా సమతూల్యం చేయాలో, ఎదుర్కోవాలో తెలియకపోతే నష్టాలను చవి చూస్తారన్నారు. గత దశాబ్ద కాలంలో స్టాక్ మార్కెట్లలో తీవ్రమైన అనిశ్చిత్తిని చూశామన్నారు.

అధిక రిస్కు కలిగిన ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) ట్రేడింగ్‌లో మూడేండ్లలోనే దేశ వ్యాప్తంగా పెట్టుబడులు పెట్టిన వారిలో 1.13 కోట్ల మంది మొత్తంగా రూ.1.81 లక్షల కోట్లు పోగొట్టుకున్నారని ఇటీవల సెబీ ఓ రిపోర్ట్‌ను వెల్లడించింది. 2021-22 నుంచి 2023-24 మధ్య మూడేండ్ల కాలంలో ఒక్కో ఇన్వెస్టర్ సగటున రూ.1.60 లక్షలు పోగొట్టుకున్నారని వెల్లడించింది. 93 శాతం రిటైల్ ట్రేడర్లు (కోటి పైగా మంది) సగటున రూ.2 లక్షల నష్టాన్ని చవిచూశారు. అత్యధికంగా నష్టాలు చవిచూసిన 3.5 శాతానికి సమానమైన 4 లక్షల మంది సగటున రూ.28 లక్షలు పోగొట్టుకున్నారంటే ఎఫ్అండ్ఓ ట్రేడింగ్ ఎంత ప్రమాదకరమో స్పష్టమవుతోంది.

కష్టాల్లో లేయర్ కోళ్ల పరిశ్రమ

- బేజారెత్తిస్తున్న మేత ధరలు
- పెంపకంపై తీవ్ర ప్రభావం



కృష్ణా : గుడ్లు ఉత్పత్తి చేసే లేయర్ కోళ్ల పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోతోంది. మేత ధర ఆకాశాన్నంటడం, గుడ్డు ధరలు ఎగుడు దిగుడులతో ఉత్పత్తిదారులు నష్టపోతున్నారు. క్రమేణా లేయర్ కోళ్ల పెంపకానికి దూరమవు తున్నారు. దీంతో, కొన్ని ప్రాంతాల్లో ఇందుకు సంబంధించిన షెడ్లను సైతం తొలగిస్తున్నారు. గుడ్లు ఉత్పత్తి చేసే లేయర్ ఫౌల్ట్రీ ఫారాల్లో కోళ్లకు అందించే దాణాలో 55 శాతం మొక్కజొన్న, నూకలు వాడతారు. గత రెండేళ్లగా నూకలు, బియ్యం, మొక్కజొన్న తదితరాలు ఇథనాల్ పరిశ్రమలకు ఎక్కువగా తరలిపోతుండడంతో వాటి ధరలు పెరిగిపోతున్నాయి. రెండేళ్ల క్రితం మొక్కజొన్న ధర టన్ను రూ.19,500 ఉండేది. ప్రస్తుతం రూ.27 వేలకు చేరింది. నూకలు ధర రూ.18 వేల నుంచి రూ.28 వేలకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గత ఆగస్టులో ఎన్నడూ లేనివిధంగా కోళ్ల మేత ధర టన్ను రూ.30 వేలకు చేరుకుంది. ప్రస్తుతం కొద్దిగా తగ్గినా గతేడాదితో పోలిస్తే టన్నుకు రూ.2 వేలు అధికంగా ఉంది. గతేడాది టన్ను మేత రూ.25 వేలకు విక్రయించగా, తాజాగా రూ. 27 వేలకు విక్రయిస్తున్నారు. కోళ్ల ఫారం నిర్వహణ, గుడ్ల ఉత్పత్తికి ముందు కోడి పెంపకం, రోజువారీ మేతలు, విద్యుత్, ఇతర ఖర్చులన్నీ కలుపుకుంటే ఒక గుడ్డు ఉత్పత్తికి సగటున రూ.4.95 వ్యయం అవుతోందని ఫౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25 వరకు రైతులకు గుడ్ల ధర సగటున రూ.4.90 మాత్రమే వచ్చింది. ఒక్కో గుడ్డుకు సగటున ఐదు పైసల వరకు నష్టపోయారు. కృష్ణా జిల్లా చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, మొవ్వ, బాపులపాడు, గన్నవరం మండలాల్లో, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు, మైలవరం, విస్సన్నపేట తదితర మండలాల్లో కోటీ 25 లక్షల సామర్థ్యం కలిగిన గుడ్ల ఉత్పత్తి (లేయర్) చేసే కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 80 లక్షల కోళ్లను మాత్రమే పెంచుతున్నారు. రాష్ట్రంలో ఆరు కోట్ల లేయర్ కోళ్ల పెంపకానికి సామర్థ్యం ఉన్నా, నాలుగు కోట్ల కోళ్లు మాత్రమే పెంపకం జరుగుతోంది. గిట్టుబాటు కాకపోవడంతో ఏలూరు జిల్లా నూజివీడులో 1.40 లక్షలు, కంకిపాడు, ప్రొద్దుటూరులలో 30 వేల సామర్థ్యం ఉన్న లేయర్ కోళ్ల షెడ్లను తొలగించారు.

'ఆత్మహత్య అంచుకు' పశ్చిమ దేశాలు



రష్యాను "వ్యూహాత్మక పరాజయం" పాలుచేసే ప్రయత్నానికి వ్యతిరేకంగా పశ్చిమ దేశాలను రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హెచ్చరించాడు. ఇది ఆ దేశాలను "ఆత్మహత్య అంచుకు"తీసికెళుతుందని ఆయన అన్నాడు. శనివారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి లావ్‌రోవ్ చేసిన ప్రసంగంలో ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాలు ఇస్తున్న మద్దతును నిలిపివేయాలని, రష్యా తన అణ్వాయుధాలను రక్షణగా ఉపయోగించవలసి వస్తే సంభావ్య ఫలితం గురించి ఆలోచించాలని కోరాడు.

ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ ప్రకారం, మాస్కో దాదాపు 5,500 వార్‌హెడ్‌లతో ప్రపంచంలోనే అతిపెద్ద అణు ఆయుధాగారాన్ని నియంత్రిస్తుంది. ఉక్రెయిన్ అణుశక్తి కానప్పటికీ దాని ప్రధాన పాశ్చాత్య స్పాన్సర్ అయిన అమెరికా దాదాపు 5,000 ధవీకరించబడిన వార్‌హెడ్‌లతో రెండవ స్థానంలో ఉంది. "ఆంగ్లో-సాక్సన్ వ్యూహకర్తలు తమ ప్రణాళికలను దాచుకోరు. రష్యాను వ్యూహాత్మక పరాజయం పాలుచేయడమే వారి ప్రకటిత లక్ష్యం.. ప్రస్తుతానికి వారు చట్టవిరుద్ధమైన నయా-నాజీ కీవ్ పాలనతో రష్యాను ఓడించాలని భావిస్తున్నారు. అయితే వారు ఈ ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు యూరప్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు" అని లావ్‌రోవ్ పేర్కొన్నాడు. మాస్కో అణు సిద్ధాంతానికి మార్పుల మధ్య గత కొన్ని రోజులుగా మాస్కో నుంచి వచ్చిన ఇలాంటి ప్రకటనలను అనుసరించి అతను ఈ హెచ్చరిక చేశాడు.

ఈ వారం ప్రారంభంలో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తమ దేశ భద్రతా మండలిలో రష్యా తన అణు నిరోధకాన్ని మోహరించడానికి అనుమతించబడే నిర్దిష్ట నిబంధనను చేర్చడానికి ప్రణాళికను సవరించాల్సిన అవసరం ఉందని చెప్పాడు. ఉదాహరణకు, రష్యా గడ్డపై తీవ్రస్థాయిలో దాడులు చేసేందుకు కీవ్‌కు పాశ్చాత్య గ్రీన్‌లైట్ లేదా దాని కీలక మిత్రదేశమైన బెలారస్‌పై దాడి చేయడంపై చర్చనీయాంశమైన పాశ్చాత్య గ్రీన్‌లైట్ ఇప్పుడు అణు ప్రతిస్పందనను ప్రేరేపిస్తుందని పుతిన్ చెప్పాడు. ఎందుకంటే దాడులకు నాటోలోని అణు శక్తుల మద్దతు ఉంటుంది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ తరువాత అణు సిద్ధాంతాన్ని నవీకరించడానికి ఉద్దేశింపబడిన పుతిన్ ప్రతిపాదన పెరిగిన ఉక్రేనియన్ దూకుడుకు పాశ్చాత్య దేశాల మద్దతు ఇవ్వడంపైన హెచ్చరికగా ఉపయోగపడుతుందని వివరించాడు.

అదే సమయంలో పాశ్చాత్య ఎత్తుగడలు కూడా మరింత యుద్ధ సన్నద్ధత వైపు మారుతున్నాయని లావ్రోవ్ చెప్పాడు. "రష్యా పట్ల పాశ్చాత్య విధానం అసాధారణ దురహంకారం, దూకుడుతనం ఐక్యరాజ్య సమితి ద్వారా ప్రోత్సహించబడిన 'ప్రపంచ సహకారం' ఆలోచనను తిరస్కరించడమే కాకుండా, మొత్తం ప్రపంచ పాలనా వ్యవస్థ పనితీరును మరింత ప్రమాదంలో పడేస్తుంది... పశ్చిమ దేశాలు ఈ ధోరణిని ఆపకపోతే, ప్రతిఒక్కరూ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని మంత్రి హెచ్చరించాడు. కీవ్ 'శాంతి సూత్రాన్ని' గుడ్డిగా సమర్థిస్తున్నందుకు, వివాదానికి దౌత్యపరమైన పరిష్కారాన్ని కనుగొనే లక్ష్యంతో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను విస్మరించినందుకు ఉక్రెయిన్ పాశ్చాత్య మద్దతుదారులను లావ్రోవ్ నిందించాడు. ఉక్రెయిన్ భూభాగాలన్నింటి నుంచి మాస్కో తన దళాలను ఉపసంహరించుకోవాలనే డిమాండ్ వాస్తవికతకు అనుగుణంగా లేదని రష్యా పదేపదే నిందించింది. ఉక్రెయిన్ ఫార్ములాకు మద్దతు ఇవ్వడం ద్వారా, పశ్చిమ దేశాలు "ఈ విచారకరమైన అల్టిమేటమ్‌ను సమర్థిస్తున్నాయి" లావ్రోవ్ తన ఉపన్యాసంలో పేర్కొన్నాడు.

ప్రపంచ గమనం

లెబనాన్ పై దాడికి ఇజ్రాయెల్ సిద్ధం

మీడియా



ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) త్వరలో దక్షిణ లెబనాన్‌లోకి ప్రవేశించాలని యోచిస్తోందని పేరు చెప్పని ఒక అమెరికన్ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ అమెరికన్ న్యూస్ చానల్ ఏబీసీ న్యూస్ శనివారం రిపోర్ట్ చేసింది. ఈ దాడి "చాలా పరిమితమైనది"గా ఏబీసీ న్యూస్ అభివర్ణించింది. అయితే దాని స్వభావం గురించి లేదా అది ఎప్పుడు ప్రారంభమవుతుంది అనే దాని గురించి కొన్ని వివరాలను అందించింది. ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దులో ఉన్న దళాలతో బుధవారం ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలేవి మాట్లాడుతున్నప్పుడు పొరుగు రాష్ట్రంలో సంభావ్య గ్రౌండ్ ఆపరేషన్‌ను ప్రకటించాడు. గత వారంలో లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై వైమానిక దాడులు "మీ ప్రవేశానికి అవకాశం కోసం" ప్రాంతాన్ని సిద్ధం చేయడమే లక్ష్యంగా సాగాయని ఆయన అన్నాడు.

హలేవి ప్రకారం, ఇజ్రాయెల్ ఇప్పటికీ ఉత్తర ప్రాంతాల నుంచి స్థానభ్రంశం చెందిన నివాసితులను వారి ఇండ్లకు తిరిగి ఇవ్వడానికి ప్రయత్నిస్తోంది. "దీని కోసం, మేము గ్రౌండ్‌ని సిద్ధం చేస్తున్నాం" అని ఆపరేషన్‌కు దిగే కాలాన్ని వెల్లడించకుండా జనరల్ చెప్పాడు. "మీరు లోపలికి వెళ్లి అక్కడ ఉన్న శత్రువులను, వారి మౌలిక సదుపాయాలను నిర్దయాత్మకంగా నాశనం చేస్తారు" అని హలేవి చెప్పాడు. హిజ్బుల్లా గ్రామాలను "భూగర్భ మౌలిక సదుపాయాలు, స్టేజింగ్ పాయింట్లు, మా భూభాగంలోకి లాంచ్ ప్యాడ్‌లతో పెద్ద సైనిక అవుట్‌పోస్టులుగా మార్చారు."

ఇజ్రాయెల్, హిజ్బుల్లా, హమాస్‌లకు వ్యతిరేకంగా పశ్చిమ జెరూసలేం సైనిక చర్య వెలుగులో పాలస్తీనా కారణానికి మద్దతు ఇచ్చినందున గతేడాదిలో అడపాదడపా కాల్పులు జరిగాయి. పశ్చిమ జెరూసలేం ఈ నెల ప్రారంభంలో షియా మిలీషియా సమూహానికి వ్యతిరేకంగా తన దాడులను తీవ్రంగా పెంచింది. హిజ్బుల్లా హ్యాండ్‌హెల్డ్ కమ్యూనికేషన్ పరికరాలను లక్ష్యంగా చేసుకుని జరిపిన విధ్వంసక చర్యలో వేలాది మంది గాయపడ్డారు. తదనంతరం దక్షిణ లెబనాన్‌పై వైమానిక దాడులతో ఇజ్రాయెల్ చెలరేగిపోయింది. లెబనీస్ ఆరోగ్య అధికారుల ప్రకారం, ఇజ్రాయెల్ దాడులలో కనీసం 1,300 మంది ప్రాణాలు కోల్పోయారు.

లెబనీస్ రాజధాని బీరుట్‌లోని దక్షిణ శివారులో గ్రూప్ ప్రధాన కార్యాలయంగా అభివర్ణించబడిన ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లా మరణించిన ఒక రోజు తర్వాత ఏబీసీ నివేదిక వచ్చింది. శనివారం తెల్లవారుజామున మిలీషియా తన నాయకుడి మరణాన్ని ధవీకరించింది. నస్రల్లాకు వారసుడి పేరు లేదు.

పశ్చిమ జెరూసలేం శనివారం తరువాత హిజ్బుల్లా సైనిక నాయకులందరినీ హతమార్చినట్టు ప్రకటించింది. గత కొన్ని వారాలుగా హతమైన డజను మంది టాప్ కమాండర్ల జాబితాను కూడా షేర్ చేసింది. "వేలాది మంది అమెరికన్లు, ఇజ్రాయెలీలు, లెబనీస్ పౌరులతో సహా అతని అనేక మంది బాధితులకు దీనితో న్యాయం జరిగింది" అని పేర్కొంటూ నస్రల్లా మరణంపై వాషింగ్టన్ ప్రతిస్పందించింది. ఇది పశ్చిమ జెరూసలేం "తనను తాను రక్షించుకునే హక్కు" కోసం తన పూర్తి మద్దతును అమెరికా పునరుద్ఘాటించింది.

అయితే అమెరికా సంఘర్షణను తీవ్రతరం చేయడానికి ప్రయత్నిస్తుందని, లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు యావత్ మధ్యప్రాచ్యాన్ని యుద్ధంలోకి నెట్టే ప్రమాదం ఉందని ప్రపంచంలోని శాంతి కాముకులు హెచ్చరిస్తున్నారు.